సోమవారం
3-2-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 133
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

టెన్నిస్ బాల్‌తో క్రికెట్ ఆడిన రిషి సునాక్

ముంబై: బ్రిటన్ మాజీ ప్రధాని, ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి అల్లుడు రిషి సునాక్ ఆదివారం ముంబైలో పర్యటించారు. దక్షిణ ముంబైలోని పార్సీ జింఖానా గ్రౌండ్‌లో ఆయన కొద్దిసేపు క్రికెట్ ఆడారు. క్లబ్ వార్షికోత్సవాల నేపథ్యంలో అక్కడికి వచ్చిన వారితో కాసేపు ముచ్చటించారు.

ఈ మేరకు ఎక్స్‌లో పంచుకున్నారు. ముంబై ఎప్పుడు వెళ్లినా టెన్నిస్ బాల్‌తో క్రికెట్ ఆడాల్సిందేనని పేర్కొన్నారు. రాజధానిలోని జైపూర్‌లో సాహిత్య ఉత్సవంలో పాల్గొనేందుకు రిషి సునాక్ భారత్‌కు వచ్చిన విషయం విదితమే.

దిల్లీలో చంద్రబాబు ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: తెలుగుదేశం పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదివారం రాత్రి దిల్లీలో ఎన్‌డీఏ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ సహద్ర ప్రాంతంలో ఆయన ప్రచారం చేశారు. తెలుగు ప్రజలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో చంద్రబాబు పార్టీ ఎంపీలతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. తొలుత ఆదివారం మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయం నుంచి

- మిగతా 2 లో

రాందేవ్ బాబాపై అరెస్ట్ వారెంట్

న్యూదిల్లీ: యోగా గురువు, పతంజలి సంస్థ వ్యవస్థాపకుడు రాందేవ్ బాబా, ఎండీ ఆచార్య బాలకృష్ణకు కేరళ హైకోర్టు నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. పతంజలికి చెందిన దివ్య ఫార్మసీ వైద్యవిధానాలపై ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు, ప్రచారాల నేపథ్యంలో కేరళ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ కేసు నమోదు చేశారు. దీనిపై పాలక్కాడ్ జిల్లా కోర్టు విచారణ చేపట్టింది. ఫిబ్రవరి 1న విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. అయితే రాందేవ్,

- మిగతా 2 లో



సురేశ్ గోపి వివాదాస్పద వ్యాఖ్యలు

తిరువనంతపురం: గిరిజనుల సంక్షేమ శాఖను అగ్ర వర్ణాల మంత్రులకు అప్పగించాలంటూ కేంద్ర మంత్రి సురేశ్ గోపి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీంతో సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఆయనను పదవిలో నుంచి తొలగించాలన్న డిమాండ్ కేరళవ్యాప్తంగా వినిపిస్తోంది. సురేశ్ గోపి వ్యాఖ్యలను సీపీఐ జాతీయ కార్యదర్శి వినయ్ విశ్వం తీవ్రంగా ఖండించారు. కుల వ్యవస్థను రెచ్చగొట్టేందుకు యత్నించిన సురేశ్ గోపిని తక్షణమే పదవిలో నుంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. కేరళను అనుమానించడమే

- మిగతా 2 లో

ఇదీ లోకం!

దీన్నే మహా ప్రసాదమని ప్రచారం చేయాలి!

అండర్-19 మహిళల టీ 20

విశ్వవిజేత భారత్

- ఫైనల్లో దక్షిణాఫ్రికా చిత్తు
- 11.2 ఓవర్లలోనే 82 పరుగుల లక్ష్య ఛేదన
- ఆల్‌రౌండ్ ప్రదర్శనతో మెరిసిన తెలుగుతేజం

2 లో

అండర్-19 మహిళల టీ20 క్రికెట్ ప్రపంచకప్‌ను భారత్ కైవసం చేసుకుంది. తొమ్మిది వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించి భారత యువ జట్టు ట్రోఫీని కైవసం చేసుకుంది. బ్యాటింగ్‌లోనూ, బౌలింగ్‌లోనూ ఆల్‌రౌండ్ ప్రతిభచూపిన తెలుగుతేజం గొంగడి త్రిష భారత్‌కు సునాయాస విజయాన్ని అందించింది.

గ్రేడ్‌ల కోసం
ముడుపులు

- ప్రైవేట్ వర్సిటీల అడ్డదారులు
- సీబీఐ తనిఖీల్లో బట్టబయలు
- న్యాక్ బృందాలకు ప్రలోభాల ఎర
- బంగారం, డబ్బు, ఎలక్ట్రానిక్ పరికరాల బహుకరణ
- మరికొన్ని విద్యా సంస్థలపైనా సీబీఐ కన్ను?

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : గ్రేడింగ్‌ల కోసం అడ్డదారులు తొక్కుతున్న ప్రైవేట్, డీమ్డ్ యూనివర్సిటీల యాజమాన్య పోకడలు ఒక్కసారిగా సీబీఐ తనిఖీల్లో వెలుగుచూశాయి. గుంటూరు జిల్లా తాడేపల్లి వడ్డేశ్వరంలో ఉన్న కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ (కేఎల్‌ఈఎఫ్) 'ఏ++' రేటింగ్ కోసం న్యాక్ పరిశీలన బృందానికి భారీగా ముడుపులు ఇచ్చినట్లుగా ఈనెల 1వ తేదీన సీబీఐ కేసు నమోదు చేయడం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. న్యాక్ బృందంలోని అధికారులు, కేఎల్‌ఈఎఫ్ ఆఫీసు బేరర్లు సహా మొత్తం 10 మందిని అరెస్టు చేయడం తీవ్ర సంచలనమైంది. సీబీఐ జాబితాలో మరికొన్ని ఇంజినీరింగ్ కళాశాలల జాబితా, యూనివర్సిటీల వివరాలు ఉన్నట్లు సమాచారం. అత్యంత గోప్యంగా ఏ క్షణంలోనైనా విచారణకు దిగుతారన్న ప్రచారం ఉంది. ప్రతి ఏటా ఇంజినీరింగ్ కళాశాలల ప్రవేశాల సమయంలో యూజీసీ నిబంధనలకు అనుగుణంగా విద్యార్థులకు తగిన సౌకర్యాలు, వారికి తగిన సంఖ్యలో ప్రొఫెసర్ల నియామకం, కళాశాల/యూనివర్సిటీ ప్రాంగణంలో మౌలిక సౌకర్యాలు, ల్యాబ్‌లు తదితర సౌకర్యాలపై ఆరా తీసేందుకుగాను కేంద్రం నుంచి న్యాక్ బృందాలు వస్తాయి. అయితే ఈ బృందాలను కళాశాలు, యూనివర్సిటీ యాజమాన్యం మచ్చిక చేసుకుని... వారికి బహుమతులు ఇప్పించి, సకల సౌకర్యాలు కల్పించి అనుకూలంగా నివేదికలు రూపొందించుకున్నట్లు తెలుస్తోంది. ఆ తరహాలోనే కేఎల్‌ఈఎఫ్ వ్యవహారం బట్టబయలైంది. ఏ++ గుర్తింపు పొందేందుకు న్యాక్ బృందానికి లంచాలు ఇచ్చిన ఆ సంస్థ యాజమాన్యంపైన, తీసుకున్న సభ్యులపైనా సీబీఐ కేసు నమోదు చేసింది. మొత్తం ఇందులో 14 మందిని నిందితులుగా చేర్చింది. కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషనల్ ఫౌండేషన్-కేఎల్‌ఈఎఫ్ ప్రెసిడెంట్, ఇతర ప్రతినిధులతో పాటు న్యాక్ తనిఖీ బృందంలోని 10 మంది సభ్యులను నిందితులుగా సీబీఐ పేర్కొంది. 10 మందిని అరెస్టు చేసి జైలుకు తరలించింది.

న్యాక్ బృందాలకు నగదు, బంగారం, ల్యాప్‌ట్యాప్‌లు

ప్రైవేట్ ఇంజినీరింగ్/ప్రైవేట్, డీమ్డ్ యూనివర్సిటీల తనిఖీలకు ప్రతి ఏటా వచ్చే న్యాక్ బృందాలకు నగదు, బంగారం, ల్యాప్‌ట్యాప్‌లు, ఖరీదైన సెల్‌ఫోన్లతో ఇంజినీరింగ్ కళాశాలలు, ప్రైవేట్ యూనివర్సిటీ యాజమాన్యం ఎరవేస్తున్నట్లు సమాచారం. మార్కెట్‌లో తమ కళాశాలలు, యూనివర్సిటీల రేటింగ్ కోసం కృత్రిమంగా పెంచేందుకు యాజమాన్యం తపనపడుతోంది. వాస్తవంగా ఆయా కళాశాలల ప్రాంగణంలో సరిపడా మౌలిక సౌకర్యాలు

- మిగతా 2 లో

నిధులిచ్చే వరకు పోరాటం

- ఇద్దరు మంత్రులకు రాష్ట్రాభివృద్ధి పట్టదా ?
- బడ్జెట్‌లో అన్యాయానికి కాంగ్రెస్ నిరసన

విశాలాంధ్ర - హైదరాబాద్: కేంద్రం నిధులు ఇచ్చేంతవరకు శాంతియుతంగా పోరాటం చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం ఎదుట టీపీసీసీ అధ్యక్షుడి అధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య నాయకులు మాట్లాడుతూ డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం సాక్షిగా తెలంగాణపై కేంద్రం వైఖరికి నిరసనగా బీజేపీ పై యుద్ధం ప్రకటిస్తున్నామన్నారు. తెలంగాణ సంక్షేమం, అభివృద్ధి కోసం రాజకీయాలను పక్కన పెట్టి పార్టీలకు అతీతంగా కలిసి రావాలని కోరారు. ఇద్దరు కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డికి రాష్ట్ర అభివృద్ధి పట్టదా అని ప్రశ్నించారు. తెలంగాణ పట్ల ప్రేమ ఉంటే బండి సంజయ్, కిషన్ రెడ్డి కేంద్రమంత్రి పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ కోసం సీఎం రేవంత్, మంత్రులు ఒంటరి పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. తెలుగింటి కోడలు నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ సమగ్ర అభివృద్ధికి కాకుండా కేవలం రాజకీయ ప్రయోజనాలకే ఉద్దేశించినట్టుగా ఉందన్నారు. తెలంగాణ సహా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలపై బీజేపీ చూపిస్తున్న వివక్ష, రాజకీయ కక్షకు బడ్జెట్ కేటాయింపులే నిదర్శనమన్నారు. రాష్ట్రం నుంచి 8 మంది ఎమ్మెల్యేలు, 8మంది ఎంపీలు ఉంటే కేంద్రం తెలంగాణకు గాడిదగుడ్డు ఇచ్చిందన్నారు."దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్" అన్న తెలుగు గేయం వినిపించి తెలుగువారి ఆకాంక్షలకు, తెలుగునేల అభివృద్ధికి మొండిచేయి చూపించారని దుయ్యబట్టారు. బడ్జెట్ కేటాయింపులు దిల్లీ, బీహార్ ఎన్నికల కోసమే అన్నట్లుగా ఉందని విమర్శించారు. రాజకీయ అవసరాల కోసం బీజేపీ కేంద్ర బడ్జెట్‌ను ఉపయోగించుకుంటూ రాష్ట్రాలను విడదీస్తూ జాతి సమగ్రతను పక్కన పెట్టిందన్నారు. బడ్జెట్‌లో దేశ సమ్మిళిత వృద్ధిని కేంద్రం కొంచెం కూడా పట్టించుకోలేదని ఆరోపించారు. బడ్జెట్ కేటాయింపులు తెలంగాణ పట్ల బీజేపీ సవితి ప్రేమను ప్రతిబింబిస్తున్నాయని, కొన్ని రాష్ట్రాలకే బడ్జెట్ కేటాయింపులతో వికసిత్ భారత్ ఎలా సాధ్యం అవుతుందని నిలదీశారు. దేశ జీడీపీలో 5.1 శాతం వాటా ఉన్న తెలంగాణకు 2.10 శాతమే తిరిగి వస్తోందన్నారు. తెలంగాణ నుంచి జీఎస్టీ, ఇతర పన్నుల రూపంలో సుమారు రూ. లక్ష వేల కోట్ల రూపాయిలు వసూలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం కనీసం 40 వేల కోట్లు తిరిగి ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. బడ్జెట్‌లో విభజన చట్టం హామీలు, మెట్రో రెండో దశకు నిధుల కేటాయింపుతో పాటు ఇతర వాటికి కేటాయింపులు శూన్యంగా ఉన్నాయన్నారు. సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అని గొప్పలకు పోయే బీజేపీకి దేశంలో ఉన్న 140 కోట్ల ప్రజలు, వారి సమస్యలు కనపడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. 2025-26 బడ్జెట్ కేటాయింపులు చూసి తెలంగాణ ప్రజలు బీజేపీని ఎప్పటికీ క్షమించరన్నారు. తెలంగాణ అభ్యున్నతి కోసం రాజకీయాలకు అతీతంగా ప్రతి తెలంగాణ పౌరుడు ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కేంద్రం కక్ష పూరిత వైఖరికి నిరసనగా బీఆర్‌ఎస్, తెలంగాణవాదులు ముందుకు రావాలన్నారు. మాటిమాటికి ప్రతిపక్ష బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు సీఎం రేవంత్ దిల్లీ పర్యటనను విమర్శిస్తారని, ఇప్పుడు బడ్జెట్ కేటాయింపులపై వారు ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. రాష్ట్ర నిధుల కోసం సీఎం రేవంత్, మంత్రులు దిల్లీకి వెళ్లి ప్రధాన మంత్రిని కలిసి యాచించినా తెలంగాణకు ఒరిగింది ఏమి లేదన్నారు. కేంద్రం వైఖరికి నిరసనగా సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా గల్లీ నుంచి పట్టణం వరకు జరిగే నిరసన కార్యక్రమాల్లో ప్రధాన మంత్రి, ఆర్థిక మంత్రి, తెలంగాణ కేంద్ర మంత్రుల దిష్టి బొమ్మలను దగ్ధం చేయాలని పిలుపునిచ్చారు. ధర్నాలో మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ యాదవ్, ఎమ్మెల్సీలు వెంకట్, ఎగ్గే మల్లేశం, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీగణేష్, ఈర్లపల్లి శంకర్, నాగరాజు, డీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్‌లు మెట్టు సాయి కుమార్, మల్రెడ్డి రాంరెడ్డి, చల్ల నర్సింహారెడ్డి, ప్రీతమ్, రియాజ్, మహిళ కాంగ్రెస్ చీఫ్ సునీత రావ్, సామ రాంమోహన్ రెడ్డి, ఎన్ ఎస్ యూ ఐ రాష్ట్ర అధ్యక్షులు శివ చరణ్ రెడ్డి, వెంకట్ స్వామి, సేవాదళ్ చైర్మన్ జితేందర్, నియోజక వర్గ ఇంచార్జ్ లు తదితరులు పాల్గొన్నారు.నిరసనలో భాగంగా ప్రధాన మంత్రి, ఆర్థిక మంత్రి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు.

తెలంగాణలో బీసీలే అధికం

- 50 రోజులలో కులగణన చరిత్రాత్మకం
- రేపు అసెంబ్లీలో చర్చ

విశాలాంధ్ర - హైదరాబాద్: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయాలతో పాటు 50 రోజుల వ్యవధిలో సమగ్రమైన కులగణన నిర్వహించిన తెలంగాణ రాష్ట్రం అద్భుతమైన రికార్డు నమోదు చేసుకుందని మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. వెనుకబడిన తరగతులకు న్యాయం చేయాలనేదే తమ ఆకాంక్ష అని స్పష్టం చేశారు. 2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ప్రజల కిచ్చిన హామీని తూ. చ తప్పకుండా అమలులోకి తీసుకురావడం చారిత్రాత్మకమన్నారు. ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా, నోడల్ అధికారి అనుదీప్ దురిశెట్టి పర్యవేక్షణలో అధికారుల బృందం ఆదివారం అంబేద్కర్ సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, సభ్యులు...మంత్రులు సీతక్క, దామోదర రాజ నరసింహ, పొన్నం ప్రభాకర్‌లకు వివరాలను పుస్తక రూపంలో అందజేసింది. ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తుందని అన్నారు. ఈ నెల నాలుగో తేదీన మంత్రివర్గం ఆమోదంతో అదే రోజు అసెంబ్లీలో చర్చకు పెట్టనున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం, సమకాలీన సామాజిక-ఆర్థిక డేటా ఆధారంగా సంక్షేమ విధానాల కోసం పునాది వేసినట్లయిందన్నారు. 94,863 గణకులు, 9,628 సూపర్‌వైజర్లు 96.9 శాతం కుటుంబాలను కేవలం 50 రోజుల్లో సర్వే చేసిందన్నారు. 76 వేల మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు 36 రోజుల్లో సమాచారాన్ని డిజిటలైజ్ చేశారన్నారు. గత నవంబరు తొమ్మిదో తేదీన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ తొలి స్పందనకర్తగా పాల్గొని అధికారికంగా సర్వే ప్రారంభించిన విషయాన్ని ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తు చేశారు. బీసీలు 1,64,09,179 (46.25 శాతం), ఎస్సీలు 61,84,319 (17.43శాతం), ఎస్టీలు 37,05,929 (10.45 శాతం), ముస్లిం జనాభా 44,57,012 (12.56 శాతం), ఓసీలు 44,21,115 (13.31 శాతం) ఉన్నట్టు సర్వే ద్వారా వెల్లడైందన్నారు. తెలంగాణ డేటా ఆధారిత పరిపాలనలో ముందంజలో ఉందని ఈ సర్వే నిరూపించిందన్నారు.

ఇది కేవలం డేటా సేకరణ ప్రక్రియ మాత్రమే కాదని, సామాజిక న్యాయ విప్లవం అని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సర్వే ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుంది అని అన్నారు. ఈ సర్వే తెలంగాణ చరిత్రలో ఓ స్వర్ణ అధ్యాయం అని పొన్నం ప్రభాకర్ అన్నారు."ర్వే సామాజిక న్యాయాన్ని నిర్ధారించడంలో నిబద్ధతతో కూడిన ప్రయత్నమని దామోదర్ రాజ నరసింహ వ్యాఖ్యానించారు. ఇలాంటి సర్వేలు దేశవ్యాప్తంగా నిర్వహించాలని సీతక్క అన్నారు.

యూట్యూబ్‌లో వీడియోలు చూసి...

- మోస్ట్ వాంటెడ్ ప్రభాకర్ నేరాలు
- ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 80 కేసుల్లో నిందితుడు

విశాలాంధ్ర-హైదరాబాద్: మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ బత్తుల ప్రభాకర్ అలియాస్ రాహుల్‌రెడ్డి నివాసంలో పోలీసులు తనిఖీలు చేయగా 428 తూటాలు దొరికాయని మాదాపూర్ డీసీపీ వినీత్ తెలిపారు. నేరస్థుడు ప్రభాకర్‌ను విచారించగా... అతడు ఇచ్చిన సమాచారం మేరకు సోదాలు నిర్వహించినట్టు చెప్పారు. కేసు దర్యాప్తులో పోలీసులకు విస్తుపోయే నిజాలు వెల్లడయ్యాయి. డీసీపీ వినీత్ వివరాలిలా ఉన్నాయి. 'చిత్తూరు జిల్లాకు చెందిన బత్తుల ప్రభాకర్ పాత నేరస్థుడు. 2022 మార్చిలో విచారణ నిమిత్తం ఏపీలోని అనకాపల్లి కోర్టుకు తీసుకెళ్లిన సమయంలో తప్పించుకుపోయాడు. అప్పటి నుంచి పరారీలో ఉన్నాడు. గత రాత్రి గచ్చిబౌలిలోని ప్రిజం పబ్ వద్ద' ఉన్నాడని తెలుసుకుని పట్టుకునేందుకు వెళ్లిన కానిస్టేబుల్‌పై కాల్పులు జరిపాడు. హెడ్ కానిస్టేబుల్ వెంకటరెడ్డి కాలికి బుల్లెట్ గాయం అయింది. నిందితుడిని అదుపులోకి తీసుకొని రెండు తుపాకులు, 23 తూటాలు సీజ్ చేశాం. 2013 నుంచి ప్రభాకర్ నేరాలు చేయడం మొదలు పెట్టాడు. తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 80 కేసుల్లో నిందితుడు. తెలంగాణలో 11, ఆంధ్రప్రదేశ్‌లో 12 కేసుల్లో మోస్ట్ వాంటెడ్‌గా ఉన్నాడు. తమిళనాడు, కేరళ, కర్నాటక, ఆంధ్రా, తెలంగాణలో నేరాలకు పాల్పడ్డాడు. ఇళ్లలో చోరీ చేయడం కష్టంతో కూడుకున్నదని శివార్లలో ఉండే విద్యాలయాల్లో దొంగతనాలు చేస్తున్నాడు. దొంగతనానికి ముందు రెక్కీ చేస్తాడు. పోలీసులకు చిక్కకుండా ఎలా తప్పించుకోవాలో యూట్యూబ్‌లో వీడియోలు చూస్తాడు. గతంలో జైల్లో ఉన్నప్పుడు ఓ ఖైదీతో గొడవపడి కక్ష పెంచుకున్నాడు. అతడిని చంపాలని జైల్లో పరిచయమైన ఖైదీల సహకారంతో బీహార్‌లో తుపాకీ కొనుగోలు చేశాడు.

గన్ కొనుగోలు చేయడానికి, నేరాలు చేయడానికి సహకరించిన వారందరినీ అరెస్టు చేస్తాం. ఇప్పటి వరకు ప్రభాకర్ 66 కేసుల్లో అరెస్టయ్యాడు. ఎనిమిది నెలల నుంచి తుపాకులు వాడుతున్నాడు' అని డీసీపీ పేర్కొన్నారు.

ఆగని నల్లరాయి దోపిడీ

- మన్యంలో అక్రమ క్వారీలతో కొండలు పిండి...
- గిరిజనులను నిండా ముంచుతున్న మైనింగ్ మాఫియా
- అనుమతికి మించి తవ్వకాలు
- నోరు మెదపని మైనింగ్ శాఖ అధికారులు

విశాలాంధ్ర-పాడేరు : ప్రకృతి అందాలకు నిలయమైన అల్లూరి సీతారామరాజు జిల్లా ఇప్పుడు అక్రమార్కుల దోపిడీ కారణంగా కళా విహీనంగా మారుతోంది. ఎటు చూసినా కనుచూపు మేరకు పచ్చని అడవులతో దర్శనమిస్తూ పర్యాటకులను ఆహ్లాదపరిచే వాతావరణం కానరావడం లేదు. ఇప్పుడు ఏజెన్సీ ప్రాంతం మొత్తంపై మైనింగ్ మాఫియా కన్ను పడింది. వారి లాభార్జన కోసం కొండలను పిండి చేసి ప్రకృతిని సర్వ నాశనం చేస్తున్నారు. మైనింగ్ మాఫియా కొంతమంది అధికారులు, ప్రజా ప్రతినిధులతో చేతులు కలిపి గిరిజనుల జీవితాలను, వారి సంపదను నాశనం చేస్తున్నారు. నివాస ప్రాంతాలకు

- మిగతా 2 లో

ఇక వాణిజ్య యుద్ధమే !

- ట్రంప్ ప్రభుత్వం దూకుడు
- చైనా, కెనడా, మెక్సికోపై భారీగా సుంకాలు
- ప్రతీకారం తీర్చుకుంటామన్న ఆ 3 దేశాలు

వాషింగ్టన్/బీజింగ్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండవ సారి అధికార పగ్గాలు చేపట్టినప్పటి నుంచి దూకుడుగా వ్యవహరిస్తున్నారు. గత పాలనా కాలంలో చేయలేకపోయినవన్నీ ఈసారి చేసేయాలని ఆత్రుతగా ఉన్నారు. ఒక దాని తర్వాత ఒకటిగా ఆదేశాలను జారీ చేస్తున్నారు. అమెరికాకే తొలి ప్రాధాన్యత నినాదంతో ముందుకెళుతూ అన్ని దేశాలపై తనదైన శైలిలో ప్రతాపం చూపే ప్రయత్నాన్ని ఆయన చేస్తున్నారు. ఇదే క్రమంలో వాణిజ్య యుద్ధానికి కాలు దువ్వుతున్నారు. తాజాగా చైనాతో పాటు కెనడా, మెక్సికోపై భారీగా సుంకాలు విధిస్తూ ఆదేశాలిచ్చారు. చైనా దిగుమతులపై 10శాతం సుంకం విధిస్తూ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ఇచ్చారు. అలాగే కెనడా, మెక్సికో దిగుమతులపై 25శాతం సుంకం విధించారు. ట్రంప్ నిర్ణయాలపై దేశ, విదేశాల నుంచి వ్యతిరేకత వస్తోంది. ప్రస్తుతమున్న టారిఫ్‌లలో టాప్ దిగుమతులపై 10శాతం సుంకం అమలవుతుందని శ్వేతసౌధం ప్రకటించింది. కెనడా నుంచి దిగుమతి చేసుకునే నేచురల్ గ్యాస్, విద్యుత్, నూనె వంటి వాటిపై 10శాతం సుంకం విధిస్తూ ఆదేశాలిచ్చారు. అమెరికా ప్రయోజనాల దృష్ట్యా ఫెంటనైల్, సరైన పత్రాలు లేకుండా అక్రమ చొరబాటుదారుల నియంత్రణకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు

ట్రంప్ తెలిపారు.

ప్రతిఘటన తప్పదు: చైనా

అమెరికా తీరును చైనాతో పాటు కెనడా, మెక్సికో దేశాలు తీవ్రంగా ఖండించింది. ప్రతిఘటన తప్పబోదని హెచ్చరించాయి. వాణిజ్య యుద్ధం లేక సుంకాల యుద్ధంలో విజేతలు అంటూ ఎవరూ ఉండరని అమెరికాకు చైనా హితవు పలికింది. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ)లో ట్రంప్ సుంకాలను సవాల్ చేస్తామని తెలిపింది. చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ స్పందిస్తూ 'ట్రేడ్ వార్ / టారిఫ్ వార్‌లో విజేతగా ఎవరూ ఉండరని చైనా నమ్ముతోంది. దేశ ప్రయోజనాల పరిరక్షణకు ఎప్పుడు కట్టుబడి ఉంటుంది' అని అన్నారు. సుంకాల అంశంపై చైనా వైఖరిలో మార్పు లేదు అని వాణిజ్య శాఖ అధికార ప్రతినిధి హే యడాంగ్ చెప్పారు. వాణిజ్య యుద్ధం వల్ల చైనాకుగానీ అమెరికాకుగానీ మిగతా ప్రపంచానికిగానీ ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. ఏకపక్షంగా ముందుకెళితే ప్రతికార చర్యలను ఎదుర్కోవల్సి వస్తుందని అమెరికాకు స్పష్టంచేశారు. అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలను అతిక్రమించేలా ట్రంప్ తాజా చర్యలు ఉన్నాయని, నిజాయతీగా సంప్రదింపులు జరిపి... సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని అమెరికాకు చైనా వాణిజ్య శాఖ సూచించింది. ఫెంటనైల్ అన్నది అమెరికా సమస్య అని చైనా విదేశాంగ శాఖ తెలిపింది. అమెరికాతో చైనాతో సుదీర్ఘ యాంటీ-నార్కోటిక్ సహకారం ఉన్నదని, ఈ క్రమంలో గణనీయమైన ఫలితాలు సాధించామని గుర్తుచేసింది.

కెనడా ఎదురు దాడి

ప్రతీకార చర్యలు తీసుకుంటామని అమెరికాకు కెనడా తేల్చిచెప్పింది. అమెరికా దిగుమతులపై 25శాతం సుంకం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అమెరికా పద్ధతి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పబోవని హెచ్చరించింది.బీరు, వైన్, పండ్లు, పండ్ల రసాలు, కూరగాయలు, ఫర్ఫ్యూమ్, వస్త్రాలు, పాదరక్షలు వంటి నిత్యావసరాలపైనా సుంకాలు విధించబోతున్నట్లు కెనడా ప్రధాని ప్రకటించారు. గృహోపకరణలు, ఫర్నీచర్, క్రీడా సామాగ్రి, ప్లాస్టిక్ తదితర ఉత్పత్తులపై సుంకాలు తప్పబోవన్నారు. 'ఇలా చేయాలని అనుకోలేదు కానీ ట్రంప్ చర్యలతో తప్పడం లేదు' అని ఎక్స్‌లో ప్రధాని పేర్కొన్నారు.

మాపై ఆరోపణలు తగవు: మెక్సికో

తమ ప్రభుత్వానికి అక్రమ మాదక ద్రవ్యాల సరఫరా ముఠాలతో సంబంధాలు ఉన్నట్లు అమెరికా ఆరోపించడంపై మెక్సికో అధ్యక్షులు క్లాడియా షెయిన్‌బౌమ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు ఆరోపణలు చేయడం తగదని హితవు పలికారు. అలాగే తమ దేశ వ్యవహారాల్లో తలదూర్చే ప్రయత్నాలనూ సహించబోమని అమెరికాకు తేల్చి చెప్పారు. 'మీ దేశంలో ఫెంటనైల్ వినియోగం సమస్యను పరిష్కరించాలని మీరు అనుకుంటే ప్రధాన నగరాల్లోని వీధులపై డ్రగ్స్ అమ్మకాలను ఆపండి. కానీ మీరు అలా చేయరు' అని అసహనం వ్యక్తం చేశారు. ప్రజలకు హానికరమైన అక్రమ దందాలు, మనీలాండరింగ్‌ను నియంత్రించాలని అమెరికాకు ఆమె సూచించారు. తమ దేశంపై విరుచుకుపడటం అమెరికాకు ఏ మాత్రం తగదని క్లాడియా 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు. అమెరికా తమ దేశంపై సుంకాలు విధించడాన్ని ఆక్షేపించారు. మెక్సికో ప్రయోజనాల దృష్ట్యా దౌత్యపరమైన తగిన చర్యలకు సిద్ధంగా ఉన్నామన్నారు. అమెరికా విషయంలో ప్రణాళికా బద్ధంగా ముందుకెళ్లాలని అధికారులకు క్లాడియా మార్గదర్శకాలు చేశారు. ఇదిలావుంటే తాజా పరిస్థితులపై దక్షిణ కొరియా, జపాన్ ఆందోళన వ్యక్తం చేశాయి. అన్ని పరిణామాలను నిశితంగా గమనిస్తున్నట్లు వెల్లడించాయి.

జర్మనీ మాజీ అధ్యక్షుడు కొహ్లెర్ మృతి

బెర్లిన్: జర్మనీ మాజీ అధ్యక్షుడు, ఐఎంఎఫ్ నాయకుడు హోస్ట్ కొహ్లెర్ (81) కన్నుమూశారు. ఈ మేరకు జర్మన్ అధ్యక్ష కార్యాలయం ఆయన కుటుంబం తరపున ఒక ప్రకటన చేసింది. అనారోగ్యంతో కొహ్లెర్ మరణించినట్లు తెలిపింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) డైరెక్టర్‌గా పని చేసిన కొహ్లెర్‌కు 2004లో అధ్యక్ష పగ్గాలు చేపట్టేంత వరకు రాజకీయంగా గుర్తింపు రాలేదు. అధ్యక్షుడు అయ్యాక ఆయన ప్రాచుర్యం పొందారు. ఆరేళ్లు పదవిలో ఉన్నారు. ఛాన్సలర్ ఏంజిలా మెర్కెల్‌తో కలిసి పనిచేశారు. జర్మనీని ఆలోచల గడ్డగా మార్చేలనుకున్నారు. తద్వారా దేశానికి ఉజ్వల భవిష్యత్ ఉండటమే కాకుండా అంతర్జాతీయంగా ప్రాధాన్యత పెరుగుతుందని భావించారు. ఆర్థిక సంస్కరణలకు సంబంధించి సాహసోపేత నిర్ణయాలను ఆయన ప్రోత్సహించారు. 21వ శతాబ్దంలో తన స్థానం కోసం జర్మనీ పాటు పడాలని 2004 మేలో అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు అన్నారు. 2010లో రెండవసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అయితే అఫ్ఘాన్‌లో జర్మన్ సైనికుల సేవలపై, పీస్ కీపింగ్ మిషన్లపై చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. దీంతో పదవి బాధ్యతల

నుంచి అర్థాంతరంగా తప్పుకున్నారు. ఓ అధ్యక్షుడు ఈ విధంగా తప్పుకోవడం నాలుగు దశాబ్దాల్లో అదే మొదటిసారి. కొహ్లెర్ 1943, ఫిబ్రవరి 22న పోలాండ్‌లో జన్మించారు. రెండవ ప్రపంచ యుద్ధమప్పుడు ఆయన కుటుంబం జర్మనీలోని లెయిప్జిగ్ సమీపంలోని పట్టణానికి వెళ్లింది. ఆపై తొమ్మిదేళ్లకు మరోసారి వలస వెళ్లింది. ఈస్ట్ జర్మన్ తిరుగుబాటు వల్ల తరలిపోవాల్సి వచ్చింది. అనంతరం అనేక శరణార్థి శిబిరాల్లో తలదాచుకున్న కొహ్లెర్ కుటుంబం చివరకు పశ్చిమ జర్మనీలోని లుడ్‌విగ్స్‌బర్గ్‌లో స్థిరపడింది. అధ్యక్షుడు అయ్యాక కొహ్లెర్ తన దృష్టిని మానవతా సంబంధిత పనుల మీద పెట్టారు. తన భార్య ఈవా లూసీతో కలిసి ఆఫ్రికా అభివృద్ధి, వాతావరణ మార్పులపై పనిచేశారు. కొహ్లెర్‌కు ఓ కుమార్తె, కుమారుడు, నలుగురు మనుమళ్లు ఉన్నారు.

రాందేవ్ బాబాపై అరెస్ట్ వారెంట్

(మొదటిపేజీ తరువాయి)

బాలకృష్ణ హాజరుకాలేదు. దీంతో కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. ఈనెల 15న కేసును తిరిగి విచారిస్తామని పేర్కొంది. ప్రజలను తప్పుదోవ పట్టించే వాణిజ్య ప్రకటనల వల్ల ఇప్పటికే పతంజలికి చెందిన 10 దివ్య ఫార్మసీ ఉత్పత్తుల తయారీ లైసెన్స్ రద్దయిన విషయం తెలిసిందే.

సురేశ్ గోపి వివాదాస్పద వ్యాఖ్యలు

(మొదటిపేజీ తరువాయి)

కాకుండా ఫ్యూడల్ సిద్ధాంతాలను బేఖాతరు చేసిన కేంద్ర సహాయ మంత్రి జార్జ్ కురియన్ రాజీనామాకు వినయ్ విశ్వం డిమాండ్ చేశారు. బీజేపీ హయాంలో రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లకు ఈ ఇద్దరు మంత్రులే ప్రత్యక్ష ఉదాహరణలని ఆయన అన్నారు. తాజా వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించాలని రాష్ట్రపతిని కోరారు. గిరిజనులకు, కేరళకు వ్యతిరేకంగా ఈ ఇద్దరు మంత్రులు చేసిన ప్రకటనలపై బీజేపీ స్పష్టత ఇవ్వాలని వినయ్ విశ్వం డిమాండ్ చేశారు. కాగా, సురేశ్ గోపి చౌకబారు వ్యాఖ్యలు చేశారని, ఆ మాటలతో ఆయన అవగాహన రాహిత్యం తెలుస్తోందని గిరిజన నాయకుడు సీకే జాను అన్నారు. ఇదిలావుంటే, 'గిరిజనుల శాఖను ఇకపై బ్రాహ్మణుడు లేక నాయుడు చేపట్టాలి. అప్పుడే శాఖాపరంగా మార్పు వస్తుంది. ప్రజాస్వామిక వ్యవస్థలో ఇలాంటి సంస్కరణ జరగాలి. అలాగే గిరిజన నాయకులకు భవిష్యత్ వర్గాల సంక్షేమ శాఖ బాధ్యతలు అప్పగించాలి' అన్న వ్యాఖ్యలతో సురేశ్ గోపి వివాదానికి తెరతీశారు. మరోవైపు కురియన్ కేరళను కించపరిచారు. కేంద్రం నుంచి నిధులు కావాలంటే విద్య, మౌలిక వసతులు, సంక్షేమంలో వెనుకబడిన రాష్ట్రంగా కేరళ ప్రకటించుకోవాలన్నారు. దీంతో కేరళలో పెద్దఎత్తున నిరసన వ్యక్తమవుతోంది.

దిల్లీలో చంద్రబాబు ఎన్నికల ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)

ఆయన దిల్లీకి బయలుదేరి వెళ్లారు.దిల్లీలో ఆయనకు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఏపీ శాసనసభ ఉప సభాపతి రఘురామ కృష్ణరాజు, కూటమి ఎంపీలు కేశినేని శివనాథ్, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కలిశెట్టి అప్పలనాయుడు, మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రనాథ్ తదితరులు చంద్రబాబుకు స్వాగతం పలికారు. దిల్లీలో తెలుగువారు ఎక్కువగా నివసించే ప్రాంతాలలో టీడీపీ ఎంపీలు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఎన్‌డీఏ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం చేయాలని ఇటీవల ఎంపీల సమావేశంలో చంద్రబాబు సూచించారు. ఈ క్రమంలో ఆదివారం గుంటూరు పార్లమెంట్ సభ్యుడు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆయన సతీమణితో కలిసి బీజేపీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.

మున్సి'పోల్' క్యాంపు రాజకీయాలు!

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ఖాళీ అయిన డిప్యూటీ మేయర్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ స్థానాలకు సోమవారం ఎన్నికలు జరగనున్నాయి. నాడు ఆయా స్థానాల్లో వైసీపీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లే అధికంగా గెలిచినప్పటికీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొందరు టీడీపీలోకి ఫిరాయించారు. మరికొందరికి టీడీపీ ప్రలోభాలు పెడుతుందన్న ఆందోళనతో ఉంది. దీంతో కార్పొరేటర్లను రహస్యంగా క్యాంపు శిబిరాలకు ఆ పార్టీ తరలించింది. వైసీపీకి పోటీగా టీడీపీ క్యాంపు శిబిరాలను ఏర్పాటు చేసింది. తిరుపతి, ఏలూరు, నెల్లూరు కార్పొరేషన్లకు డిప్యూటీ మేయర్ ఎన్నికలు జరగనున్నాయి. హిందూపురం, పాలకొండ, నందిగామ మున్సిపాల్టీల్లో చైర్మన్ల ఎంపిక కోసం ఎన్నికలు నిర్వహిస్తున్నారు. తుని, పిడుగురాళ్ల, నూజివీడు మున్సిపాల్టీలకు వైస్ చైర్మన్లను ఎన్నుకోనున్నారు. ఇక్కడ గతం కంటే వైసీపీకి కొంత బలం చేజారడంతో... దానిని కూటమి పార్టీలకు అవకాశం దక్కకుండా ఉండేందుకు క్యాంపు శిబిరాలకు తెరదీసింది.

తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్‌గా కొనసాగుతున్న భూమన అభినయ్‌రెడ్డి గత ఎన్నికల్లో తిరుపతి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబడ్డారు. ఆ సమయంలో తిరుపతి డిప్యూటీ మేయర్‌గా కొనసాగుతున్న అభినయ్‌రెడ్డి ఆ పదవికి, కార్పొరేట్ పదవికి రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడింది. తిరుపతి కార్పొరేషన్‌లో 50 కార్పొరేటర్లకుగాను వైసీపీకి దాదాపు 40 మంది ఉన్నారు. అభినయ్‌రెడ్డి వ్యతిరేక వర్గం పార్టీకి దూరంగా ఉండటంతో అక్కడ వైసీపీలో టెన్షన్ మొదలైంది. వైసీపీ తరపున డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా భాస్కర్‌ను బరిలోకి దించారు.

అక్కడ వైసీపీ కార్పొరేటర్లను క్యాంపు శిబిరాలకు తరలించారు. గుంటూరు కార్పొరేషన్ స్థాయి సంఘం ఎన్నికలతో వైసీపీ, టీడీపీ క్యాంపు రాజకీయాలకు తెరదీసింది. నెల్లూరులోనూ అదే పరిస్థితి నెలకొంది. హిందూపురం మున్సిపల్ చైర్మన్ ఎంపిక కోసం వైసీపీ, టీడీపీ బలబలాలను నిరూపించుకోనున్నాయి.

ఎమ్మెల్సీ ఎన్నికల వేడి!

మండలిలో బలం కోసం టీడీపీ కసరత్తు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో పూర్తిగా పట్టుకోల్పోయిన కూటమి ప్రభుత్వం... ఎలాగైనా తన బలం పెంచుకునేందుకు పావులు కదుపుతోంది. గత అసెంబ్లీ సమావేశాల్లో శాసన మండలిలో వైసీపీ సభ్యులు ప్రజా సమస్యలపై గళం విప్పారు. అడుగడుగునా ప్రశ్నలు వేసి కూటమి మంత్రులు, సభ్యులను ఇరకాటంలో పెట్టారు. ఇది పాలక ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారింది. రాబోయే బడ్జెట్ సమావేశాల్లోనూ మండలి వేదికగా పునరావృతమయ్యే అవకాశముంది. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే మండలిలో సంఖ్య పెంపు కోసం ప్రయత్నాలను ముమ్మరం చేసింది. వైసీపీ నుంచి ముగ్గురు ఎమ్మెల్సీలు రాజీనామాలు చేసి... టీడీపీకి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. వారి రాజీనామాలు శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషెన్‌రాజు వద్ద పెండింగ్‌లో ఉండటంతో... టీడీపీకీ సంఖ్యా బలం పెరగలేదు. ఈ క్రమంలో ఖాళీ అయిన స్థానాల ద్వారా వచ్చిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కూటమి ముందుకు పోతోంది. తాజాగా రెండు పట్టభద్రులు, ఒక ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఇటీవల కేంద్ర ఎన్నికల కమిషన్ షెడ్యూలు జారీజేసింది. మార్చి మూడో తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంతోపాటు కృష్ణా-గుంటూరు జిల్లాలకు చెందిన పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి, శ్రీకాకుళం-విజయనగరం-విశాఖపట్నం ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. మార్చి 29వ తేదీతో మూడు నియోజక వర్గాల ఎమ్మెల్సీల పదవీ కాలం ముగియనుంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థిగా డి.వి. రాఘవులు పేరు ఖరారు చేశారు. కూటమి తరపున టీడీపీ అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖరం పేరును ప్రకటించారు. కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి టీడీపీ తరపున ఆలపాటి రాజా, పీడీఎఫ్ నుంచి కె.ఎస్.లక్ష్మణరావు బరిలో దిగారు. ఇక్కడ ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అయినప్పటి నుంచి టీడీపీ అభ్యర్థి ఆలపాటి రాజా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు ఓటర్లను కలుస్తున్నారు. ఇక్కడ పోటీ రసవత్తరంగా మారనుంది. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాత్రం టీడీపీ దూరంగా ఉంది.

మహిళల క్రికెట్ జట్టుకు రేవంత్ అభినందనలు

విశాలాంధ్ర - హైదరాబాద్: వరుసగా రెండోసారి అండర్-19 మహిళల ప్రపంచ కప్‌ను గెలుచుకున్న టీమిండియా క్రికెట్ జట్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. ఫైనల్ మ్యాచ్‌లో అద్భుతమైన ఆటతీరుతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ బిడ్డ గొంగడి త్రిషకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. మలేషియాలో సౌతాఫ్రికాతో జరిగిన ఫైనల్ మ్యాచ్ లో విజయం సాధించి ఇండియా విశ్వ విజేతగా నిలిచింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలానికి చెందిన త్రిష ఆల్ రౌండ్ ప్రతిభతో అదరగొట్టే ఆటను ప్రదర్శించింది. అత్యధిక పరుగులు సాధించి ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచింది.

త్రిష వంటి క్రీడాకారిణులు మన రాష్ట్రానికి గర్వ కారణమని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. మరింతగా రాణించి భవిష్యత్తులో టీమిండియా సీనియర్ జట్టులో చోటు దక్కించుకోవాలని ఆకాంక్షించారు.

విశ్వవిజేత భారత్

కౌలాలంపూర్: అండర్-19 మహిళల టీ20 క్రికెట్ ప్రపంచకప్‌ను భారత్ కైవసం చేసుకుంది. తొమ్మిది వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించి భారత యువ జట్టు ట్రోఫీని కైవసం చేసుకుంది. బ్యాటింగ్‌లోనూ, బౌలింగ్‌లోనూ ఆల్‌రౌండ్ ప్రతిభచూపిన తెలుగుతేజం గొంగడి త్రిష భారత్‌కు సునాయాస విజయాన్ని అందించింది. దక్షిణాఫ్రికాను 82 పరుగులకే కట్టడి చేసి ... ఒక వికెట్ మాత్రమే కోల్పోయి భారత్ జట్టు లక్ష్యాన్ని ఛేధించింది. మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లోని బయుమాస్ ఓవల్ వేదికగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తొలుత దక్షిణాఫ్రికా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. పేలవమైన ప్రదర్శనతో స్కోరు 82 పరుగులకే పరిమితమైంది. 18 బంతుల్లో 23 పరుగులు చేసిన మైకే వాన్ వూరస్ట్ దక్షిణాఫ్రికా తరుపున టాప్ స్కోరర్‌గా నిలిచింది. టోర్నీ ఆద్యంతం బ్యాట్‌తో అద్భుతంగా ఆడిన త్రిష బౌలింగ్‌తోనూ మెరిసింది. నాలుగు ఓవర్లలో 15 పరుగులిచ్చి మూడు వికెట్లు తీసింది. వైష్ణవి శర్మ, ఆయుషి శుక్లా, పరుణికా సిసోడియా చెరో రెండు వికెట్లు తీయగా, షబ్నమ్ షకీల్ ఒక వికెట్ తీసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్ 11.2 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 82 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. త్రిష 33 బంతుల్లో 8 ఫోర్ల సాయంతో 44 పరుగులు చేసి అజేయంగా నిలిచింది. సానికా చాల్కే 22 బంతుల్లో 26 పరుగులు (నాటౌట్) చేశారు. ఓపెనర్ జి.కమలిని (8) వికెట్ కోల్పోయింది. ఫైనల్లో సౌతాఫ్రికాపై తొమ్మిది వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించి దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పి విశ్వవిజేతగా నిలిచిన అండర్-19 మహిళల జట్టును దేశవ్యాప్తంగా అభినందనల్లో ముంచెత్తుతున్నారు. గతంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఇంగ్లండ్‌ను ఓడించి తొలి ప్రపంచకప్‌ను భారత్ కైవసం చేసుకుంది.

ఆగని నల్లరాయి దోపిడీ

(మొదటిపేజీ తరువాయి)

దగ్గరలో మాత్రమే రెవెన్యూ భూములు ఉండటం, మిగిలిన ప్రాంతమంతా అటవీ శాఖ పరిధిలో ఉండటంతో అమాయక గిరిజ నులను మోసం చేసి నల్ల రాయి క్వారీలకు అనుమతులకు మించి గ్రామాలకు సమీపం లో బ్లాస్టింగ్‌లు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. మితిమీరిన బ్లాస్టింగ్‌ల వలన ప్రజల పంట పొలాలు, తోటల్లోకి పెద్ద పెద్ద బండ రాళ్లు పడి పంటలు సర్వనాశనమవుతున్నాయి. బ్లాస్టింగ్ వలన వస్తున్న దుమ్ము ధూళి కారణంగా చుట్టుపక్క ప్రాంతాల పంట పొలాల దిగుబడి తగ్గిపోతోంది. ఇక దుమ్ము ధూళి ప్రజలు పీల్చి అనేక రకాల ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రుల్లో చేరుతున్న సంఘటనలు అనేకం. భారీ బ్లాస్టింగ్ వలన భూమంతా కంపించి చుట్టుపక్క ప్రాంతాల గృహాలు పగుళ్లు రావడమే కాకుండా, ఇళ్లలోని సామాన్లు నివాసితులపై పడి వారు గాయపడే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా అల్లూరి జిల్లా కేంద్రం పాడేరుకు అతి సమీపంలో ఉన్న దేవరపల్లి నల్లరాయి క్వారీలో అనుమతులకు మించి బ్లాస్టింగ్‌లు చేయడం వలన కురిడమెట్ట, కొత్తబు, దేవరపల్లి, నేరోడివలస, పనసపల్లి గ్రామస్తులకు చెందిన పంట పొలాలు, ఆస్తులు ధ్వంసం అవుతున్నాయి. అంతేకాకుండా పసి పిల్లలు, గర్భిణుల ప్రాణాలు పోవడంతో నల్ల రాయి క్వారీ తవ్వకాలు నిలుపుదల చేయాలని కొత్తబు, కురిడే మెట్ట గ్రామస్తులు క్వారీ వద్ద ఆందోళన చేసి క్వారీ రహదారిని రాళ్లు, కర్రలతో మూసివేశారు. దీంతో ఏం చేయాలో తెలియని దేవరపల్లి నల్ల రాయి తవ్వకాలు జరుపుతున్న యజమాన్యం రాష్ట్ర స్థాయి ప్రజాప్రతినిధులతో మంతనాలు జరిపి కింద స్థాయి అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి పోలీసు అధికారులతో కురిడే మెట్ట, కొత్తబు గ్రామ ప్రజలను ఒక్కొక్కరిని పోలీస్ స్టేషన్‌కు పిలిచి బెదిరిస్తున్నారని ఆయా గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే, రెండు గ్రామ ప్రజలు కలిసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు వచ్చి వారి సమస్యను విన్నవించుకున్నారు. క్వారీ యజమాన్యం మాత్రం ఎలాగైనా క్వారీ తవ్వకాలు జరుపుతామని, తమకు అన్ని అనుమతులు ఉన్నాయని మొండికేశారు. దీంతో ఆయా పరిసర ప్రాంతాల ప్రజలు గ్రామ సమీపంలో ఆందోళన చేపట్టారు. క్వారీ తవ్వకాలు జరిపితే మా ప్రాణాలు ప్రాణంగా పెట్టి అడ్డుకుంటామని, క్వారీ నిలుపుదల చేసేవరకు తమ ఉద్యమం ఆగదని స్పష్టం చేస్తున్నారు. తవ్వకాలు జరిపితే క్వారీ వద్దే ఆందోళనకు దిగి వాహనాలను సైతం అడ్డుకుంటామని హెచ్చరిస్తున్నారు. క్వారీకి బినామీ యజమానిగా ఉన్న వ్యక్తి గిరిజనుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ప్రవరిస్తున్నాడని ఆరోపించారు. అధికారులు ఇకనైనా అక్రమ క్వారీ తవ్వకాలను నిలిపివేసే చర్యలు చేపట్టాలని కురిడే మెట్ట, కొత్తబు గ్రామస్తులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో దేవరపల్లి నల్లరాయి క్వారీ యజమాన్యం తవ్వకాలు కొనసాగిస్తుందా లేక ప్రజా ఉద్యమం వల్ల నిలిపివేస్తుందో వేచి చూడాల్సి ఉంది.

గ్రేడ్‌ల కోసం ముడుపులు

(మొదటిపేజీ తరువాయి)

లేకపోయినప్పటికీ, ఇష్టానుసారంగా రేటింగ్ పెరిగిపోవడం విద్యావేత్తలకు సైతం ఆశ్చర్యం కలుగుతోంది. దీనిపై సీబీఐకి ఫిర్యాదులు రావడతో దేశ వ్యాప్తంగా నిఘా ఉంచి ఈ వ్యవహారాన్ని గుట్టురట్టు చేసింది. కొన్ని ఇంజినీరింగ్ కళాశాలలకు తగినంత మౌలిక సౌకర్యాలు లేకపోయినప్పటికీ, అధికార అండదండలతో డీమ్డ్ యూనివర్సిటీ స్థాయి హోదాను తెచ్చుకుంటున్నాయన్న విమర్శలున్నాయి. మరికొన్ని ఇంజినీరింగ్ కళాశాలలకు ప్రైవేట్ యూనివర్సిటీలుగా హోదా కల్పించాలంటూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు ప్రతిపాదనలు పంపాయి. ఆ దిశగా రాయలసీమ, ఉత్తరాంధ్ర, ఆంధ్రా ప్రాంతాలకు చెందిన కొన్ని ఇంజినీరింగ్ కళాశాలలు తమ కళాశాలను యూనివర్సిటీలుగా చేయించుకున్నాయి. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఒకటి రెండు ఇంజినీరింగ్ కళాశాలలు... యూనివర్సిటీ హోదా కల్పించాలంటూ ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి. అటు రాజకీయ పలుకుబడిని ఉపయోగించడం, ఇటు తనిఖీలకు వచ్చిన కేంద్ర బృందాలను ప్రలోభపెట్టినట్లుగా సమాచారం. ప్రైవేట్, డీమ్డ్ యూనివర్సిటీలుగా ఉన్నతీకరణ అయిన వాటిలో చాలా మంది ప్రొఫెసర్లకు డాక్టరేట్‌లు లేకుండానే చెలామణీ అవుతున్నట్లు సమాచారం. అలాంటి వాటిపైనా సీబీఐకి ఫిర్యాదులు వెళ్లినట్లు తెలిసింది.

ఏకకాలంలో న్యాక్ బృంద ఇళ్లపై సీబీఐ సోదాలు

చెన్నై, బెంగళూరు, విజయవాడ, సంబల్‌పూర్, భోపాల్, బిలాస్‌పూర్, గౌతమ్ బుద్ధనగర్, దిల్లీలోని 20 చోట్ల న్యాక్ బృంద సభ్యుల నివాసాలు, కార్యాలయాల్లో ఏకకాలంలో సోదాలకు దిగారు. వారి వద్ద నుంచి రూ.37 లక్షల నగదు, 6 ల్యాప్‌టాప్‌లు, ఒక ఐఫోన్ 16ప్రో స్వాధీనం చేసుకున్నాయి. సీబీఐ అరెస్టు చేసిన వారిలో ఒక్క కేఎల్‌ఈఎఫ్ బృందంతో పాటు న్యాక్ తనిఖీ బృందం చైర్మన్, రామచంద్ర చంద్రవంశీ విశ్వవిద్యాలయం వీసీ సమరేంద్రనాథ్ సాహా, న్యాక్ తనిఖీ బృందం సభ్య సమన్వయకర్త, జేఎన్‌యూ దిల్లీ ప్రొఫెసర్ రాజీవ్ సిజిరియా, భారత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లా డీన్ డాక్టర్ డి.గోపాల్, భోపాల్‌లోని జగ్రాన్ లేక్ సిటీ విశ్వవిద్యాలయం డీన్ రాజేశ్ సింగ్ పవర్, జీఎల్ బజాజ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ మానస్‌కుమార్ మిశ్రా, దేవనగరి విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ గాయత్రి దేవరాజ, సంబల్‌పూర్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ బులు మహారాణా ఉన్నారు. న్యాక్ కమిటీ సభ్యులనూ విజయవాడ జైలుకు తరలించారు. అనంతరం న్యాక్ బృందాలను సీబీఐ కస్టడీకి తీసుకుని విచారించే అవకాశం ఉంది. ఈ విచారణ ఆధారంగా కీలక సమాచారాన్ని సేకరించి... మరికొన్ని ఇంజినీరింగ్ కళాశాలలు, ప్రైవేట్ యూనివర్సిటీల యాజమాన్యాలపై సీబీఐ తనిఖీలకు దిగుతుందన్న ప్రచారం ఉంది. దీంతో ఆయా కళాశాలల యాజమాన్యాలు ఆందోళన చెందుతున్నాయి.

కోల్‌కతా కాలేజిలో సరస్వతి పూజపై వివాదం

మంత్రి పర్యటనకు విద్యార్థుల నిరసన

కోల్‌కతా: కోల్‌కతా కాలేజిలో సరస్వతి పూజ జరగడం వివాదాస్పదంగా మారింది. ఈక్రమంలో బెంగాల్ విద్యా మంత్రి బ్రత్యబసుకి కాలేజి విద్యార్థుల నుంచి నిరసన ఎదురైంది. కాలేజి ప్రాంగణంలో పూజ నిర్వహించిన క్రమంలో తృణమూల్ కాంగ్రెస్ ఛాత్ర పరిషత్ (టీఎంసీపీ) నాయకుడు కొందరు బయట వ్యకులతో వచ్చి బెదిరింపులకు దిగినట్లు ఆరోపించారు. జోగేశ్‌చంద్ర లా కాలేజిలో పూజ నిర్వహించడంపై రెండు వర్గాల విద్యార్థుల మధ్య ఘర్షణ హైకోర్టు వరకు వెళ్లింది. లా కాలేజి విద్యార్థులు ఈ పూజ చేసుకునేందుకు తగిన భద్రతా ఏర్పాటు చేయాలని పోలీసులకు కలకత్తా హైకోర్టు శుక్రవారం ఆదేశించింది. ఈ వివాదం క్రమంలో లా కాలేజికి వెళ్లి టీఎంసీ ఎంపీ మాలా రాయ్‌కు నిరసన సెగ తాకింది. కొందరు మహిళా విద్యార్థులు 'మాకు న్యాయం కావాలి' అని నినాదాలు చేశారు. 'నేను మీతో మాట్లాడేందుకు వచ్చాను. మిమ్మలిని ఎవరూ బెదిరిండమో భయపెట్టడమో చేయబోరు. అలా ఎవరైనా చేస్తే కఠిన చర్యలను ఎదుర్కొంటారు' అని మంత్రి చెప్పగా విద్యార్థినులు కన్నీళ్లు పెట్టుకున్నారు.

కాలేజి లోపలికి వచ్చే సమయంలో లైంగికంగా వేధిస్తామంటూ కొందరు బయట వ్యక్తులు తమను బెదిరించారని మంత్రితో చెప్పారు. దీనిపై తగు విధంగా దర్యాప్తు జరిపిస్తామని, చర్యలు తీసుకుంటామని మంత్రి వారికి భరోసా ఇచ్చారు. కాలేజి యంత్రాంగంతో ఈనెల 5, 6 తేదీల్లో దీనిపై చర్చిస్తానన్నారు. సీనియర్ మంత్రి ఫిర్హాద్ హకీం స్పందిస్తూ బెంగాల్‌లో సరస్వతి పూజ, దుర్గా పూజ వంటివి సామాజిక, మతపరమైన కార్యక్రమాలని, ఇందులో అన్ని వర్గాల వారు పాల్గొంటారని చెప్పారు. కొందరు ఉద్దేశపూర్వకంగా రాష్ట్రంలో మతసామరస్యాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

పోలవరం ఎత్తు గందరగోళం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : కేంద్ర బడ్జెట్ (2025-26) ప్రవేశపెట్టిన అనంతరం పోలవరం జాతీయ ప్రాజెక్టు ఎత్తు అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. కేంద్ర బడ్జెట్ పెట్టినప్పుడల్లా పోలవరానికి నిధుల వరద వస్తుందన్న ఆశతో రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తారు. బడ్జెట్‌లో మాత్రం అరకొర నిధులతోనే కేంద్రం సరిపెడుతోంది. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ... కేంద్రంలోని బీజేపీకి మద్దతుగా నిలవడంతోనే ఈ పరిస్థితి ఉత్పన్నమవుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కేంద్రంలోని బీజేపీకి అన్ని విధాలా సహకరించింది. దీంతో కేంద్ర ప్రభుత్వ తప్పిదాలను, రాష్ట్రానికి నిధులు, కేటాయింపుల్లో వివక్షతను నేరుగా ప్రశ్నించలేక పోయింది. ఇప్పుడు ఏకంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం... ఆంధ్ర ప్రదేశ్, బీహార్ రాష్ట్రాల బలంతోనే నడుస్తోంది. అయినా కేంద్రంపై ఒత్తిడి పెంచి రాష్ట్రానికి అవసరమైన నిధులు, పోలవరం ప్రాజెక్టు ఎత్తుకు సరిపడా కేటాయింపులను బడ్జెట్‌లో రూపొందించుకోవడంలో కూటమి పార్టీలు పూర్తిగా విఫలమయ్యాయన్న విమర్శలున్నాయి. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టును 41.15 మీటర్ల ఎత్తుతోనే పూర్తిచేసేందుకు రూ.5,936 కోట్లు కేటాయిస్తామని ప్రకటించారు. కేంద్రం తాజాగా ఈ ప్రాజెక్టుకు డీపీఆర్‌ను ఆమోదించి... మరో రూ.12,157 కోట్లు

ఇచ్చేందుకు అంగీకరించి, అడ్వాన్స్ నిధులు ఇవ్వడంతో పనులు ప్రారంభమయ్యాయి. ఇక్కడ నిధుల కేటాయింపు కంటే... పోలవరం ఎత్తు సమస్య మరోసారి ఉత్ప న్నమైంది. గత వైసీపీ ప్రభుత్వ హయాం లో ఇదే అంశం చాలా రాద్ధాం తమైంది. రెండు దశలుగా పోలవరం ఎత్తు పెంచాలని నిర్ణయించి విమర్శలపాలైంది. తొలి దశలో పోలవరం ఎత్తు 41.15 మీటర్ల ఎత్తులో నిర్మాణం చేపట్టి నీటిని నిల్వ చేయాలని, ఆ తర్వాత భూసేకరణ చేసుకుంటూ రెండో దశలో 45.72 మీటర్లకు (150 అడుగులు) పెంచేందుకు ప్రతిపాదనలు రూపొందిం చారు. దీంతో పోలవరం ఎత్తును వైసీపీ తగ్గిస్తుందంటూ అప్పటి ప్రతిపక్ష టీడీపీ నేతలు పెద్ద ఎత్తున రాద్ధాంతం చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలోనూ అదే పరిస్థితి ఎదురైంది. గత వైసీపీ ప్రభుత్వ తరహాగానే పోలవరం ఎత్తును 41.15 మీటర్లుగానే చూపించడం విమర్శలకు తావిస్తోంది. వాస్తవంగా పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తుతో నిర్మించాల్సి ఉంది. ఇలా నిర్మిస్తేనే పోలవరం ద్వారా 200 టీఎంసీల నీరు లభిస్తుంది. ఆ నీటితో కృష్ణా, గోదావరి జిల్లాల్లోని లక్షలాది ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు, కొత్త ఆయకట్టుకు నీరు లభిస్తుంది. వాటితో పాటు 960 మెగావాట్ల విద్యుదుత్పత్తి, విశాఖ నగరానికి తాగునీరు, 600 గ్రామాలకు నీరు అందుతుంది. 150 అడుగుల మీర నిర్మిస్తేనే అదంతా సాధ్యమవుతుంది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం పోలవరం ఎత్తును 41.15 మీటర్లకే పరిమితం చేయడంతో దీనిని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అంగీకరిస్తుందా?, లేదా? అనేదీ తేలాలి. రాష్ట్ర ప్రభుత్వానికి తెలియకుండానే పోలవరం ఎత్తు 41.15 మీటర్లేనని ఎలా నిర్ధారిస్తుందన్న సందేహాలున్నాయి. అటు దీనిపై కూటమి నేతల వ్యాఖ్యలిలా ఉన్నాయి. 2014లో చంద్రబాబు అధికారం చేపట్టాక పోలవరం ప్రాజెక్టులో 45.72 మీటర్ల స్థాయిలో నీటిని నిల్వచేసి, వినియోగించుకోవాలనే ప్రణాళిక రూపొందించారని, అప్పటికి చంద్రబాబు ప్రభుత్వం ముగిసేనాటికి పోలవరం ప్రాజెక్టులో 45.72 మీటర్ల ఎత్తుకు నీళ్లు నిలిపేలా రూ.55,656 కోట్లతో డీపీఆర్‌ను సాంకేతిక సలహా కమిటీ ఆమోదించిందని, ఆ తర్వాత వచ్చిన జగన్ ప్రభుత్వం 45.72 మీటర్ల స్థాయికి నిధులను ఆమోదింపజేసుకుని, తొలి దశ, రెండో దశగా ప్రాజెక్టును విడగొట్టి తప్పిదం చేసిందని కూటమి నేతలు విమర్శించారు. దీంతో గత వైసీపీ ప్రభుత్వ విధానాలతోనే తాజాగా కేంద్ర బడ్జెట్‌లో పోలవరానికి విడుదల చేసిన నిధులు 41.15 మీటర్ల స్థాయికి నీళ్లు నిలబెట్టేందుకే సరిపోతాయని కూటమి నేతలు స్పష్టం చేస్తున్నారు.

తెలంగాణ, మైనార్టీలకు కేంద్రం మొండి చెయ్యి

రాష్ట్ర మైనార్టీ నాయకులు నయీమ్ ఖురేషి

విశాలాంధ్ర - కొత్తగూడెం : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన రూ.50.65 లక్షల కోట్ల బడ్జెట్‌లో తెలంగాణ తోపాటు దేశంలోని మైనార్టీలకు వివక్షతోనే బీజేపీ పార్టీ మొండి చేయి చూపించిందని రాష్ట్ర మైనారిటీ నాయకులు, కొత్తగూడెం ఉర్దు ఘర్ అధ్యక్షులు నయీమ్ ఖురేషి విమర్శించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రధానిగా నరేంద్ర మోడీ వచ్చాక మైనారిటీలపై ప్రత్యేకంగా కక్ష సాధింపు ధోరణి స్పష్టంగా అమలు చేస్తున్నట్లు ఆరోపించారు. బిజెపి ప్రభుత్వ విభజించు పాలించు పరిణామాలు రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఇటీవలే ముఖ్యమంత్రి నితీష్ కుమార్ బీజేపీపై అసంతృప్తితో చేస్తున్న తిరుగుబాతుకు భయపడి బీహార్ రాష్ట్రం పై బడ్జెట్లో వరాలు కురిపించినట్లు ఖురేషి తెలిపారు. మధ్యతరగతి వ్యక్తిగత ఆదాయపు పన్ను రూ.12 లక్షల వరకు పన్ను వెసులుబాటులోను కొన్ని అభ్యంతరాలు పెట్టినట్టు చెప్పారు. మోడీ వచ్చిన 11 ఏళ్ళ తర్వాత మొదటి సారి ఒక మతలబుతో మధ్యతరగతిపై ప్రేమ చూపరన్నారు. దేశ జనాభాలో 8.5 కోట్ల మంది 6.63 శాతం ఇన్కమ్ టాక్స్ పేయర్స్ ఉన్నారని, వీటిలో జీరో టాక్స్ పేయర్ 5 కోట్ల మంది ఉంటారన్నారు. మధ్యతరగతి కేవలం 2.3 శాతం టాక్స్ పేయర్స్ మాత్రమే ఉన్నారని ఆర్థిక మంత్రి ఏదో గొప్ప ఘనకార్యం చేసినట్లు ప్రచారం చేసుకోవడం శోచనీయమన్నారు. వ్యవసాయ రంగానికి మైక్రో, చిన్న తరహా పరిశ్రమలకు, వ్యవసాయ రంగానికి, తెలంగాణ ప్రాజెక్టులకు, మైనారిటీలకు రక్ష సాధింపుతోనే మొండి చేయి చూపారని ఖురేషి విమర్శించారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : విద్యార్థులకు పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని సింగరేణి సంస్థ డైరెక్టర్ వెంకటేశ్వర రెడ్డి అన్నారు. వర్తమాన పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించాలంటే పాఠశాల దశలో ఏకాగ్రతతో చదివి సబ్జెక్టుల్లో ప్రావీణ్యం సంపాదించాలని కోరారు. తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట శివశంకర్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం 200 ఎస్సి హాస్టల్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను ఉచితంగా అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని వెంకటేశ్వర రెడ్డి విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ రోజుల్లో విద్యార్థుల్లో అధిక శాతం సెల్ ఫోన్ లకు బానిసలవుతున్నారని ఇలా చేస్తే చదువులో ఏకాగ్రత కోల్పోతారన్నారు. తమ టెస్ట్ బుక్ లపై ధ్యాస పెట్టి చదువుతూ నోట్స్ ప్రిపేర్ చేసుకొవడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలంటే ముందస్తు ప్రణాళిక ప్రిపరేషన్ అవసరం అన్నారు. అప్పుడే విద్యార్థులు ఉత్తమ ప్రతిభతో ఉన్నత శిఖరాలు అధిరోహించే అవకాశం ఉంటుందని విద్యార్థులకు డైరెక్టర్ హితబోధ చేసారు. కష్టపడి చదివి సింగరేణిలో డిప్లమా పాసై ఉద్యోగం సాధించి అంచలంచెలుగా డైరెక్టర్ స్థానానికి ఎదగడం జరిగిందని తల గురించి వెంకటేశ్వర రెడ్డి చెప్పారు. ఏజీఎం రాజీవ్ కుమార్, కోట శివశంకర్, షెడ్యూల్ కేర్ డెవలప్మెంట్ ఏ సి డి ఓ సునీత, దుర్గాభవాని దాసరి స్పందన, రాజా ఆనంద్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి కార్యక్రమం రద్దు : కలెక్టర్

విశాలాంధ్ర - కొమురం భీం : శాసనమండలి ఎన్నికల దృష్ట్యా అధికారులు ఎన్నికల పనులలో నిమగ్నమై ఉంటున్నందున ప్రతి సోమవారం నిర్వహించు ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. శాసనమండలి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున కోడ్ ముగిసేంత వరకు ప్రజావాణి కార్యక్రమం నిలిపివేయడం జరుగుతుందని, ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

మృతుని కుటుంబానికి అండగా ఉంటాం :ఎస్పీ

విశాలాంధ్ర జిల్లా బ్యూరో- మహబూబాబాద్: గుండెపోటుతో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ సోమేశ్వర రావు కుటుంబానికి అండగా ఉంటానని జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ పోలీస్ స్టేషన్లో రైటర్‌గా విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ సోమేశ్వరరావు ఆదివారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి జిల్లా చెందారు. ఈ విషయం తెలిసిన వెంటనే ఎస్పీ దంతాలపల్లి మండలం పెద్ద ముప్పారం గ్రామానికి చేరుకొని సోమేశ్వరరావు పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చి మీ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చి ధైర్యపరిచారు. హెడ్ కానిస్టేబుల్ మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎస్పీ వెంట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయ, ఆర్థిక రంగాల్లో గొల్ల కురుమలు ముందుండాలి

విశాలాంధ్ర (మహబూబాబాద్) తొర్రూరు : రాజకీయ ఆర్థిక రంగాలతో పాటు అన్ని రంగాలలో గొల్ల కురుమలు ముందుండాలని పశు వైద్య, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు భూసాని వెంకన్న, గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం జిల్లా కార్యదర్శి బొల్లం అశోక్‌లు అన్నారు. ఆదివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని జిఎంపిఎస్ కార్యాలయంలో 2025 జిఎంపిఎస్ నూతన డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొల్ల కురుమలు ఐక్యత లోపం వల్లనే రాజకీయ రంగంతోపాటు అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆవిష్కరణలో ప్రైవేట్ హాస్పిటల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వల్లపు అశోక్, జిఎంపిఎస్ నాయకులు కొమ్మనబోయిన యాకయ్య, సర్వి నాగరాజు, భూసాని యశ్వంత్ కుమార్, పాల్గొన్నారు.

ఘనంగా బుర్రి పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : నల్లగొండ పట్టణంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాప్ కార్యాలయంలో ఆదివారం నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, శ్రేయోభిలాషుల మధ్య బుర్రి శ్రీనివాస్ రెడ్డి కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్యతో పాటు మాజీ కౌన్సిలర్లు, మాజీ జెడ్పిటిసిలు, ఎంపీపీలు, మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలంతా బుర్రికి పూలబొకేలు అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

మహిళా క్రికెటర్ త్రిషకు అభినందన వెల్లువ...

జిల్లా కీర్తిని ప్రపంచ స్థాయిలో చాటిన త్రిష : కలెక్టర్ జితేష్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం ప్రాంతానికి చెందిన మహిళ క్రికెటర్ గొంగడి త్రిష మలేషియాలోని కౌలాలంపూర్‌లో ఆదివారం నిర్వహించిన ఐసీసీ అండర్ 19 మహిళా టి-20 ప్రపంచ కప్‌లో అద్వితీయమైన ప్రతిభ కనబరిచింది. దీంతో ఈమెకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ తోపాటు ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా ప్రకటించారు. త్రిష విజయపరంపర జాతీయ, అంతర్జాతీయ మీడియాతో స్థానిక సోషల్ మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీంతో ఖ్యాతి గడించిన ఆమెకు జిల్లా వ్యాప్తంగా అన్ని వర్గాల నుంచి అభినందన వెల్లువలు వ్యక్తమౌతున్నాయి. సామాన్య కుటుంబానికి చెందిన ఆ యువతి జిల్లా ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఒక ప్రకటనలో అభినందించారు. చివరి మ్యాచ్‌లో 3 వికెట్లు తీయడంతో పాటు 33 బంతుల్లో 44 పరుగులు చేసిందన్నారు. మొత్తం 7 మ్యాచ్ ల్లో 309 పరుగులు చేసి ఏడు వికెట్లు తీసి, ప్రపంచ మహిళా క్రికెట్ వేదికలో తనకంటూ ఓ చరిత్రను లిఖించుకున్న త్రిష ప్రతిభకు జిల్లా ప్రజలు గర్వపడుతున్నారని కలెక్టర్ తెలిపారు. ఆమే క్రీడా స్ఫూర్తి జిల్లాలోని యువతీ యువకులకు స్ఫూర్తిదాయకమన్నారు. జిల్లా ప్రజల తరఫున త్వరలోనే త్రిషకు ఘనంగా సత్కరించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

తెలంగాణపై మహా వివక్ష : బాగం

విశాలాంధ్ర - ఖమ్మం : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్లో తెలంగాణపై మహా వివక్ష ప్రదర్శించారని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ఆరోపించారు. రాజకీయ వాంఛతోనే బిజెపి దాని మిత్రపక్షాలు ఏలుబడిలో ఉన్న రాష్ట్రాలకు పెద్దపీట వేశారని భారతదేశ చరిత్రలో ఇంతటి రాజకీయ వివక్ష-ప్రదర్శించిన బడ్జెట్ మరొకటి లేదని ఆయన అభివర్ణించారు. కేంద్ర బడ్జెట్ను నిరసిస్తూ సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బైపాస్ రోడ్డులో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. సిపిఐ కార్యాలయం నుండి ప్రదర్శనగా వెళ్లి బైపాస్ రోడ్డులో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. బాగం హేమంతరావు మాట్లాడుతూ తెలంగాణకు కనీసం ఒక ప్రాజెక్టు కూడా కేటాయించకపోగా కనీస ప్రతిపాదన చేయలేదని ఆయన తెలిపారు. కేవలం సంపన్న వర్గాలకు మాత్రమే మేలు చేసే ఈ బడ్జెట్ను సిపిఐ పూర్తిగా వ్యతిరేకిస్తుందని హేమంతరావు తెలిపారు. భారతదేశ రైతాంగం కిసాన్ సంయుక్త మోర్చా ఆధ్వర్యంలో చారిత్రాత్మక పోరాటం వ్యవసాయోత్పత్తులకు మద్దతు ధరను కల్పించాలని చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం రైతాంగ డిమాండ్లను పూర్తిగా విస్మరించిందన్నారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోతుంటే దానిని పట్టించుకోక పోగా కార్పొరేట్ శక్తులకు మేలు చేసేవిధంగా బడ్జెట్లో అంకెలను పొందుపర్చారని తెలిపారు. నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ భవిష్యత్తులో దేశాన్ని రుణ భారత్గా మార్చే ప్రమాదం ఉందని సుమారు 13.65 -లక్షల కోట్ల రూపాయల లోటును ఎలా భర్తీ చేస్తారని ఆయన ప్రశ్నించారు. విద్యా, వైద్య రంగాలను విస్మరించారని ధరల నియంత్రణపై ఊసెత్తలేదని బడ్జెట్లో అంకెలు చూస్తుంటే మోడీ సర్కార్ కార్పొరేట్లు, సంపన్నుల చేతుల్లో బంధీగా మారిందని అవగతమవుతుందని ఈ బడ్జెట్ను వ్యతిరేకించి భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, రావి శివరామకృష్ణ, మేకల శ్రీనివాసరావు, ప్రజా సంఘాల నాయకులు గాదె లక్ష్మి నారాయణ, తాటి నిర్మల, ఇటికాల రామకృష్ణ, ఎస్కె సైదా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పురుషుల కబడ్డీ పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర - నేరేడుచర్ల : రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల కబడ్డీ పోటీలను ఆదివారం నేరేడుచర్ల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో కబడ్డీ అసోసియేషన్ మండల అధ్యక్షుడు నూకల సందీప్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న కబడ్డీ పోటీలను ఉమ్మడి నల్లగొండ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు అల్లం ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కబడ్డీ పోటీలలో సూర్యాపేట జిల్లా జట్టుకు చెందిన సుమారు 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కబడ్డీ క్రీడాకారులకు నూకల సందీప్ రెడ్డి క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ ఆసోసియేషన్ మండల కార్యదర్శి పంగ సైదులు, శెట్టి రామచంద్రరావు, నామ నరసింహరావు, శ్రీనివాస్ రెడ్డి, వెంకటరెడ్డి, అడహాక్ కమిటీ జిల్లా కన్వీనర్ కార్తయ్య, గజ్జల కోటేశ్వరరావు, ఇంజమూరి శ్రీకాంత్, ఎండి కలీం తదితరులు పాల్గొన్నారు. ఎంపికైన జిల్లా కబడ్డీ జట్టుకు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొనే సూర్యాపేట జిల్లా పురుషుల సీనియర్ కబడ్డీ జట్టు ఎంపికైనట్లు అడహాక్ కమిటీ చైర్మన్, కన్వీనర్ ఆర్. భూలోకరావు, జి.కార్తయ్య, తెలిపారు. ఈనెల 4 నుండి 7వ తారీకు వరకు జరిగే 71వ అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి పురుషుల కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు బి. సతీష్, ఎస్. అనిల్, కె.సాయి, ఏ.నవీన్, బి. శ్రీకాంత్, బి.జానకి రాములు, బి.సైదులు, పి.కార్తీక్, టి. వినోద్, ఎం.జానీ, బి.మాధవరెడ్డి, కె.వీరస్వామి ఎంపికయ్యారు. ఈ క్రీడలకు కోచ్ సిహెచ్ వినయ్, మేనేజర్‌గా కర్ణాకర్ వ్యవహరించారు.

ఎడ్ల వెంకటయ్య మృతి బాధాకరం

విశాలాంధ్ర - కొండమల్లేపల్లి : మండల పరిధిలోని చిన్న అడిసర్లపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎడ్ల వెంకటయ్య మృతి చెందారు విషయం తెలుసుకున్న టిపిసిసి సభ్యులు, పిఎసిఎస్ చైర్మన్ డాక్టర్ దూదిపాల వేణుదర్ రెడ్డి వారి భౌతికాయానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు వారితోపాటు చిన్న అడిసర్లపల్లి మాజీ సర్పంచ్ గడ్డం శ్రీరాములు, అందుగుల లింగయ్య, కోట్ల జగదీష్, పిల్లి శ్రీను, అంజయ్య, బద్రి పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులకు ఇన్సెంటివ్ పథకం ప్రారంభం

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి : ఏఐటీయూసీ సింగరేణి గుర్తింపు సంఘంగా గత నిర్మాణాత్మక సమావేశంలో చేసిన ప్రతిపాదన మూలంగా సింగరేణిలో ఫిబ్రవరి మార్చి నెలలకు గాను హాజరు ఆధారిత ఇన్సెంటివ్ పథకం సింగరేణి ప్రారంభించిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.సీతారామయ్య, కె.రాజకుమారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన విధివిధానాలు యాజమాన్యం సర్క్యులర్ ద్వారా విడుదల చేస్తుందని వారు తెలిపారు. బడ్జెట్లో సింగరేణికి ఎలాంటి ఆర్థిక నిధులు కేటాయించలేదని, కేంద్ర భాగస్వామ్యం సింగరేణిలో ఉన్నా చిన్నచూపు చూస్తుందని వారన్నారు.త

పరిగి పట్టణంలో డీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కుల్కచర్ల మండలంలోని దాస్య నాయక్ తండాలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడానికి వచ్చిన కేటీఆర్ చిల్లర రాజకీయాలు మాట్లాడి వెళ్ళిపోతున్నారని అన్నారు. కేటీఆర్ బతుకంతా రాజకీయం చేయడమే అని అన్నారు. విశాలాంధ్ర - పరిగి :

బ్రీడింగ్ చెక్కర్స్ వేతనాలు విడుదల చేయాలి

విశాలాంధ్ర - హుజూర్‌నగర్ : బ్రీడింగ్ చెక్కర్స్‌కు పది నెలలుగా జీతాలు అందక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే బకాయి జీతాలు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆదివారం హుజూర్‌నగర్‌లో మీడియాతో మాట్లాడుతూ సూర్యాపేట డిఎంహెచ్వో కార్యాలయంలో మలేరియా విభాగం నందు బ్రీడింగ్ చెక్కర్స్‌గా విధులు నిర్వహించామని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రభలే సమయంలో జూలై నుండి డిసెంబర్ మాసం వరకు ప్రతి ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలో దోమలు ప్రబలకుండా స్ప్రేను పిచికారి చేసి దోమల వ్యాప్తిని అరికట్టడానికి తమ సేవలు వినియోగించుకున్నారని తెలిపారు. డెంగ్యూ నివారణకే కాకుండా మలేరియా, ఫైలేరియా, చికున్‌గునియా, జపనీస్ మెదడువాపు,నీటి ద్వారా వచ్చే వ్యాధులు, అన్నిరకాల తట్టు, వైరల్ ఇన్ఫెక్షన్ల వ్యాప్తిని అరికట్టేందుకు కూడా పనిచేసినట్లు తెలిపారు. సంవత్సరానికి 5 నెలల విధులు నిర్వహించామని తెలిపారు. 2023, 2024 సంవత్సరాలలో నెలకి 10,000 రూపాయల చొప్పున లక్ష రూపాయల వేతనాలు అందాల్సి ఉందని తెలిపారు. సూర్యాపేట జిల్లాలో 18 మంది బ్రీడింగ్ చెక్కర్స్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమ సమస్యను ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు నివేదించిన బడ్జెట్ లేదని చెబుతున్నారని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్న తమకు ఎలాగైనా జీతాలు విడుదల చేయాలని కోరారు. కోళ్లపూడి రాజేష్, తాటికొండ అఖిల్, నరేందర్, రామ్మూర్తి, రఘు, శ్రవణ్, నవీన్, గణేష్ పాల్గొన్నారు.

పర్యాటక రంగ అభివృద్ధికి కృషి : రామకృష్ణ

విశాలాంధ్ర - కొమరం భీం : సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అదనపు ప్రాజెక్టు అధికారి రామకృష్ణ తెలిపారు. ఆదివారం సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ-ఉట్నూర్ ఆధ్వర్యంలో అడ ప్రాజెక్టు వద్ద నిర్మించిన లేక్ వ్యూ రెస్టారెంట్‌ను జె.డి.ఎం. నాగభూషణం, ఆసిఫాబాద్ వెలుగు మహిళా మండల సమాఖ్య ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ లేక్ వ్యూ రెస్టారెంట్ పరిధిలో ఆసిఫాబాద్ వెలుగు మహిళ మండల సమాఖ్య ద్వారా భీమన్న వి.ఓ.ఎ. ద్వారా 5 మంది మహిళలతో జాయింట్ లయబులిటీ గ్రూప్ ఏర్పాటుచేసి ప్రయాణికులు, పర్యాటకులకు వివిధ రకాల స్నాక్స్, టీ అందించబడుతుందని తెలిపారు. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధి దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికి తీయాలి

విశాలాంధ్ర బ్యూరో - మెదక్ : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ గాజుల రమేష్ పిలుపునిచ్చారు. మెదక్ మండల మాచవరం ఉన్నత పాఠశాల వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికి తీయాలని, ఇలాంటి వార్షికోత్సవాల వల్ల పాఠశాలకు మంచి గుర్తింపు వస్తుందని అన్నారు. మెదక్ జిల్లాలో తొలిసారిగా ఒక ప్రభుత్వ పాఠశాల చరిత్రపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ నీలకంఠం రూపొందించిన దృశ్యకావ్యం సిడిని ఆయన ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు, సోది, నృత్యాలు, ఏకపాత్రాభియం, పాటలు, పిరమిడ్లు అలరించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాధాకిషన్, అకడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన మూర్తి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఏఎస్వో నవీన్ కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ లలిత, వివిధ మండలాల మండల విద్యాధికరులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వివిధ గ్రామాల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్ఎక్స్‌ప్లోరర్స్ కార్నివాల్‌లో గ్రామీణ విద్యార్థుల శాస్త్రీయ నైపుణ్య ప్రదర్శన

ఖమ్మం: షెల్ ఇండియా మద్దతుతో, తెలంగాణ ప్రభుత్వంతో కలిసి స్మైల్ ఫౌండేషన్, ఖమ్మంలో ఎన్ఎక్స్ (ఎన్ఎక్స్‌ప్లోరర్స్) కార్నర్ కార్నివాల్‌ను నిర్వహించింది. గ్రామీణ పాఠశాలల విద్యార్థులు తమ శాస్త్రీయ నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి ఒక వేదికను అందించాలనే లక్ష్యంతో ఈ కార్నివాల్‌ను రోజంతా నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ పి.శ్రీజ ముఖ్య అతిథిగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర్‌శర్మ గౌరవ అతిథిగా హాజరయ్యారు. 13 పాఠశాలల నుండి 60 మంది విద్యార్థులు సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణితం రంగాలలో ఎంపిక చేసిన 20 మార్పు ప్రాజెక్టులు, వినూత్న ఆలోచనలను కార్నివాల్‌లో ప్రదర్శించారు. రోజువారీ సమస్యలు, పర్యావరణ అనుకూల వ్యవసాయ పద్ధతులు, ఉద్గారాలను నియంత్రించడం, ప్రకృతి పరిరక్షణ, సస్టైనబుల్ అభివృద్ధి లక్ష్యాలుతో అనుసంధానించబడిన అనేక రంగాలకు సంబంధించిన వర్కింగ్ నమూనాలు, వినూత్న ఆలోచనలతో పాఠశాలల విద్యార్థులు ముందుకు వచ్చారు.

వైభవంగా 'రామాయణ కల్పవృక్షం' మహోత్సవం

హైదరాబాద్: ఇది ఉత్సవం.. మహా ఉత్సవం, మహాకావ్యం రామాయణాన్ని ఘనంగా చాటిన మహోత్సవం. 'రామాయణ కల్పవృక్షం' పేరుతో మూడు రోజుల ఈ ఉత్సవంలో మహాకావ్యం రామాయణాన్ని సంగీతం, నృత్యం, కథనం, చర్చల ద్వారా జనబాహుళ్యంలోకి తీసుకెళ్లారనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ఈ వేడుక సంవత్సరానికి ఒక్కసారి జరిగే అత్యంత ప్రతిష్టాత్మక సంబరంగా మారింది. దేశవ్యాప్తంగా కళాకారులు, పండితులు, ప్రేక్షకులు అపూర్వమైన అనుభూతిని పొందారు. ఈ ఉత్సవాన్ని లోక్‌సభ సభ్యులు తేజస్వీ సూర్య ప్రారంభించారు. రామాయణం నేటి సమాజానికి గల సంబంధాలను వివరించారు. మన సంస్కృతి, కళలను ఆదరించడం ఎంత అవసరమో? తెలియజేస్తూ.. తన జీవిత అనుభవాల ద్వారా రామాయణంలోని అంశాలు ప్రస్తుత పరిస్థితులకు ఎలా వర్తిస్తాయో హృద్యంగా వివరించారు.

బడ్జెట్ ఓ వ్యూహాత్మక మార్పు: డాక్టర్ ప్రశాంత్

విశాలాంధ్ర - హైదరాబాద్: కేంద్ర బడ్జెట్ 2025 దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధి వైపు వ్యూహాత్మక మార్పును సూచిస్తుందని నిమ్స్ హైదరాబాద్‌లోని ఎస్‌ఓసి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చింతపట్ల ప్రశాంత్ అభిప్రాయపడ్డారు. ఆర్థిక క్రమశిక్షణ, మౌలిక సదుపాయాల పెట్టుబడి పన్ను సంస్కరణలపై స్పష్టమైన దృష్టిని కలిగి ఉంటుంది. మౌలిక సదుపాయాల కోసం కేటాయించిన 10.18 లక్షల కోట్లు, జీడీపీలో దాదాపు 3.1 శాతం, 2024 బడ్జెట్‌లో రూ.9.87 లక్షల కోట్ల నుండి గణనీయమైన పెరుగుదల, ఇది మూలధన నిర్మాణంపై బలమైన నిబద్ధతను సూచిస్తుంది. ఆర్థిక లోటు లక్ష్యాన్ని 2024లో 4.8 శాతం 2023లో 5 శాతం నుండి 4.4 శాతంకి తగ్గించడం, ఆర్థిక ఏకీకరణ, స్థూల ఆర్థిక స్థిరత్వంపై స్పష్టమైన దృష్టిని ప్రదర్శిస్తుంది. బడ్జెట్ విజయం ఎక్కువగా ప్రభావవంతమైన అమలుపై ఆధారపడి ఉంటుంది. బడ్జెట్‌ను మరింత పెంచడానికి, ఉపాధి మరియు వృద్ధిని ప్రోత్సహించడానికి మౌలిక సదుపాయాల కోసం 10.18 లక్షల కోట్లతో పాటు స్టార్టప్‌లకు లక్ష్య మద్దతును నేను సూచిస్తున్నాను. సాంకేతికత ఆధారిత వ్యవసాయ మద్దతు ప్రత్యక్ష బదిలీలను విస్తరించడం వల్ల గ్రామీణ ఆదాయాలు పెరుగుతాయి, వ్యవసాయం కోసం కేటాయించిన 2.5 లక్షల కోట్లకు అనుగుణంగా ఉంటాయి. అదనంగా, తక్కువ ఆదాయ వర్గాలకు ఎక్కువ ఆర్థిక చేరిక మరియు స్థిరత్వ చొరవలు, ముఖ్యంగా గ్రీన్ ఎనర్జీలో, దీర్ఘకాలిక వృద్ధికి చాలా అవసరం. అంతిమంగా, ఈ విధానాల ప్రభావం బలమైన పాలన మరియు సకాలంలో అమలుపై ఆధారపడి ఉంటుందని ప్రశాంత్ తెలిపారు.

దేశ బడ్జెట్ కాదు... కార్పొరేట్ అనుకూల బడ్జెట్ : న్యూడెమోక్రసీ

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : ఈ ఆర్థిక ఏడాది కేంద్ర బడ్జెట్ తీరు చూస్తుంటే ప్రధాని మోడీ ప్రభుత్వ కార్పొరేట్ మార్క్ స్పష్టంగా కనిపిస్తోందని సిపిఐ ఎం-ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి బానోత్ ఉక్లా విమర్శించారు. ఆదివారం కొత్తగూడెం పట్టణంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొన్ని మాట్లాడారు. కొన్ని రాష్ట్రాల్లో రాజకీయ లబ్ది ధ్యేయంగా, ఆర్ఎస్ఎస్, బిజెపి అనుకూల కార్పొరేట్ శక్తులకు అనుగుణంగా ఈ దఫా బడ్జెట్ ను కూడా రూపొందించినట్లు ఉక్లా ఆరోపించారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. తెలంగాణపై వివక్షత చూపినప్పటికీ ఇక్కడి 8 మంది బీజేపీ ఎంపీలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణలో బిజెపి ఎంపీలు మతోన్మాదాన్ని రెచ్చగొట్టడం తప్ప ప్రజలకు లబ్ది చేకూర్చాలనే దృక్పథం వారికి ఏమాత్రం లేదని విమర్శించారు. సంపదను సృష్టించే, ఆహారాన్ని అందించే దేశ రైతాంగానికి, కార్మిక వర్గానికి ఈ బడ్జెట్‌తో ఎలాంటి ఉపయోగం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ బడ్జెట్ లో ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. కేంద్ర ప్రభుత్వంపై మధ్యతరగతి, ఉద్యోగ వర్గాల్లో వస్తున్న వ్యతిరేకతకు భయపడి రూ. 12 లక్షల వరకు టాక్స్ రిలీఫ్ ఇవ్వడం జరిగిందన్నారు. ఉద్యోగ, ఉపాధినిచ్చే రంగాలను అభివృద్ధికి ఏమాత్రం కేంద్రప్రభుత్వం నిధులు కేటాయించలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నేటి యువతరం అర్థం చేసుకొని హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు ఉప్పరబోయిన రాంమూర్తి, బానోత్ రాంసింగ్, కందగట్ల సురేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులు విద్యపై ఆసక్తి పెంచుకోవాలి

విశాలాంధ్ర - గూడూరు: విద్యార్థులు విద్యపై ఆసక్తి పెంచుకోవాలని గూడూరుపాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ కె.లలిత కుమారి అన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ వాయిస్ ఆఫ్ గర్ల్స్ అనే ఎన్జీవోస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జనవరి 27 నుండి ఫిబ్రవరి 5 తారీకు వరకు గూడూరు మండలంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఏడవ, ఎనిమిదో తరగతి చదివే అమ్మాయిల కొరకు కార్యక్రమాలు నిర్వహిస్తుందని, అమ్మాయిలు ఏ విధంగా సమాజంలో ధైర్యంగా మెలగాలో మారుమూల ప్రాంతాల్లోని గిరిజన విద్యార్థులు విద్యపై ఆసక్తి పెంచుకోవడానికి పలు రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాయబోయిన వెంకన్న, వాయిస్ ఫర్ గర్ల్స్ స్వచ్ఛంద సంస్థ నుంచి రిపోర్టింగ్ ఆఫీసర్, అనుష పద్మావతి, కోఆర్డినేటర్ సింధు సమీరా, క్యాంప్ కౌన్సిలర్స్ సహస్ర, నాగదుర్గ, శ్రీజ, రిషితలు పాల్గొన్నారు.

కారేపల్లిలో మాజీ ఎమ్మెల్యే విస్తృత పర్యటన

విశాలాంధ్ర - కారేపల్లి : కారేపల్లి మండలంలో ఆదివారం వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ విస్తృతంగా పర్యటించి పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. బస్వాపురం, కొత్తూరు తండా, సీతారాంపురం గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను రామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. భాగ్యనగర్ తండాకు చెందిన మాజీ జడ్పీటీసీ వాంకుడోత్ జగన్ నాయక్ కు కొద్దిరోజుల క్రితం రోడ్డు ప్రమాదాన్ని గురై చికిత్స తీసుకొని ఇంటి వద్ద ఉన్న ఆయనను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. పోలంపల్లి, పేరేపల్లి మాజీ సర్పంచ్లకు పితృవియోగం కావడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే మదన్ లాల్ వెంట బిఆర్ఎస్ నాయకులు తాత వెంకటేశ్వర్లు, హనుమకొండ రమేష్, జడల వెంకటేశ్వర్లు, ఇస్లావత్ బన్సీలాల్, డొంకెన రవీందర్, షేక్ గౌసుద్దీన్, బానోతు సక్రాం పాల్గొన్నారు.

చలిలో నులివెచ్చని 'వెన్నెలహాసం'

సాహితి

గ్రంథ సమీక్ష

కంతేటి చంద్రప్రతాప్ సీనియర్ పాత్రికేయులు, సంపాదకులు, హాస్యప్రియులు, నిరాడంబరులు, కవి, సోదర సమానులు, అంతకు మించి సహృదయులు. 'నవ్వు నలభై విధాల గ్రేటు!' అంటూ, తన చెరగని చిరునవ్వుతో మనకు ఎలా కనిపిస్తారో అలాగే నవ్వించేకథలు రాస్తారు ఎక్కువగా. ఆ మధ్య తన జీవితంలోని 24సంఘటనలను మినీ హాస్య కథల 'వెన్నెలహాసం' మనముందు ఉంచారు. అవి చదివాక, 'వీరు ఇలాంటివి మరిన్ని అందిస్తే బాగుణ్ణు!' అని అనుకునే లోగానే, తాజాగా 'వెన్నెలహాసం రెండో సంపుటి' ని మన ముందుకు తెచ్చారు. ఈ సంపుటిలోకూడా వారు నిజ జీవితంలో తాము పడ్డ కష్టాలను, ఎదుర్కొన్న సమస్యలనూ సరదాగా చెప్పే ప్రయత్నం చేశారు. మొదటి సంపుటికీ దీనికీ తేడా ఒక్కటే. దీనికి సుప్రసిద్ధ రచయిత మల్లాది కృష్ణమూర్తి ముందుమాట ప్రత్యేకం. మిగతా అంతా సేమ్ టు సేమ్ - అదే హాస్యపుమార్కు విభిన్నకథలే. వృత్తిరీత్యా పత్రికాసంస్థలో పనిచేశారుకాబట్టి వారికి ఆయా సంస్థలలో పరిస్థితులు క్షుణ్ణంగా తెలుసు. వాటినే వ్యంగ్య హాస్యాలతో తనదైన శైలిలో మన ముందు ఉంచారు.

రచయిత ఈ కథలకు పెట్టే పేర్లే సగంకథను చెప్పేస్తాయి. 'కొంపముంచిన సుకవి', 'వంకాయ చూరుకు ఒట్టిఅన్నం నోటికి', 'తలుపుసందు జర్నలిజం', 'ఓ పులిపిల్ల వైరాగ్యం', 'లడ్డూలు కావాలా నాయనా', 'ఆవు యొక్క ఆవేదన - వేదన', 'త్యాగరాజుతో కటీఫ్', 'ఛస్సునూ ఛందస్సునూ దూరం పెట్టానందుకే', 'నన్ను చెడగొట్టిన ముగ్గురిలో శ్రీశ్రీ ఒకరు', 'చావు వార్తలతో చచ్చే చావు బాబూ', 'అన్నమయ్య వల్ల ఇమేజీకి డామేజీ', 'మెచ్చుకోలూ లేదు మేకతోలూ లేదు' - ఇదిగో ఇలా కథలకు తమాషాగా పేర్లున్నాయి.

సరదాగా ఆత్రేయగారి పాటలతో వచ్చిన వ్యాసాన్ని చూచి కంపోజింగ్ ప్రాక్టీసు చేసుకొందామనేసరికి అది కాస్తా చిలవలు పలవలై పత్రిక ఎండీగారి దాకా పోవడం అనే మొదటి కథ -'కొంపముంచిన సుకవి'. 'ఎంకిపెళ్లి సుబ్బి చావు కొచ్చింద'ని పాత సామెత. పాపం! ఆఫీసు మిత్రుని పెళ్లికి వెళ్లి శాకాహారుడైన రచయిత ఎంత అవస్థ పడ్డాడో, 'వంకాయ చూరుకు ఒట్టి అన్నం నోటికి', చదువుతూంటే నవ్వు కాదు. దుఃఖం వస్తుంది కొంత.(మరీ ఈ మధ్య శాకాహారం దొరకడం చాలా కష్టమైపోయింది).

ఆఫీసుల్లో, పబ్లిక్ ప్లేసుల్లో మిత్రునిపేరును వాడుకొని తన పనులు కానిచ్చుకోవడం వేరు. కానీ రచయిత మిత్రుని పేరు ఇంట్లో వాడుకొని సినిమాలు చూశానని చెప్పుకోవడం చూస్తే తమాషా అనిపిస్తుంది. చివరికి అది ఏ పర్యవసానాలకు దారితీసింది అనేది తెలియాలంటే 'వాడుకోవడం అంటూ మొదలుపెడితే మన తర్వాతే ఎవరైనా' కథ చదవాల్సిందే.

ఈ మధ్య సాంఘిక మాధ్యమాల్లో తెల్లవారితే చాలు. 'గుడ్మార్నింగ్' మెసేజి పెట్టాల్సిందే. ఒక్కరోజు పెట్టక పోయినా, పెట్టడం ఆలస్యమైనా సందేహాలు జనాలకు. ఏమైంది నీకు అంటూ... ఈ జాడ్యాన్ని సునిశితంగా స్పృశిస్తూ రాసిన మరో చెణుకు - 'ఎంత ఆక్టివ్ ఐతే అంతమేలుట' అనే కథ. ఫేసుబుక్కులో యాక్టివ్‌గా ఉండకుంటే మీరు పోయారనుకొంటారు అనే సందేశంతో ముగిసిందీ కథ.

సగటు పత్రికాఫీసు ఉద్యోగి జీవితం, అక్కడి ఇన్‌ఛార్జిల జీవితం ఎలా ఉంటుందో మనకు తెలిపే కథ - 'పైవాళ్ళతో మొటిక్కాయలు, కిందవాళ్ళతో తిట్లు'.

'క్యూరియాసిటీ కిల్డ్ ఎ క్యాట్' అని ఆంగ్లసామెత. దానికి



వెన్నెలహాసం-2, చంద్రప్రతాప్ కంతేటి
పేజీలు: 178, వెల: 250/-
ప్రతులకు: తపస్వీ మనోహరం పబ్లికేషన్స్,
ఫోన్: 91-7893467516, మరియు
అమెజాన్ ఆన్‌లైన్‌లో)

సంబంధించిందే 'కీ హోల్ జర్నలిజం'-లేనిదానికి లేనిపోనివి కల్పించడం. 'తలుపుసందు జర్నలిజం' కథలో రచయితే ఇన్వెస్టిగేషన్ చేసి చివరికి నాలిక కరుచుకోవడం ఈ కథ.

నేటి నిత్యజీవితంలో టీవీక్షణలో, సినిమాల వీక్షణలో అందరూ ఎదుర్కొనేవే 'జవాబు దొరకని ప్రశ్నలు' అనే కథా సారాంశం. 'టాంక్‌బండ్‌లో నీళ్ళు లేవా, మీ కాళ్ళు తడవలేదేం' అనే కథలో సున్నిత మనస్కులతో రాజకీయపార్టీ పెడితే, వర్కవుట్ కాదంటారు రచయిత. నిజ జీవితంలో రచయిత కూడా చాలా సున్నితమైన మనస్కులే. పెళ్లిపనుల్లో తీపి తినుబండారాలు చేయడం, దానిని పర్యవేక్షించడం రెండూ కత్తిమీదసాములే. ఏకంగా రచయిత పెళ్లిలో జరిగిన లడ్డులు చుట్టు ప్రహసనం గురించి, 'లడ్డూలు కావాలా నాయనా' అనే కథలో 'చాపకింద పానకం బూందీ'లాగే చక్కగా వర్ణించారు.

మీడియాలో తెలుగు ఎంత గొప్పగా ఉంటుందో మనం చూస్తూనే ఉన్నాం. 'నానాటికీ తీసికట్టు నాగంభట్టూ' అన్నట్టు. పాపం! ఒక సీనియర్ సంపాదక సభ్యునిగా విలేకరులను ఎంపిక చేయడంలో రచయితకు ఎదురైన పరిస్థితి. హతవిధీ అనక తప్పలేదు, 'ఆవు యొక్క వేదన- ఆవేదన' కథలో.

ఛస్సునూ, ఛందస్సునూ దూరం పెట్టారట, బట్టతల వచ్చిన రచయిత ఎందుకో మరి. అది తెలుసుకోవాలంటే, 'ఛస్సునూ ఛందస్సునూ దూరం పెట్టానందుకే' అనే కథ చదవాల్సిందే.

ఆధునిక కాలంలో కవితా వేదికలు, సమ్మేళనాలూ ఎలా ఉంటున్నాయి, దానికి ఒక రచయిత వెళితే. అది తెలుసుకోవాలంటే - 'చీకటి కన్ను కొట్టే సరికి పగలు పారిపోయింది' కథ చదవాలి.

సిటీ బస్సులో వెళ్లడం అంటే సంగ్రామానికి వెళ్లడమే అనే సగటు ప్రయాణీకుడికి అనిపిస్తూంటుంది. మరి సాయంత్రం వేళ ఏ ఆరుకో ఏడుకో బస్సెక్కితే. ఇక స్త్రీపురుష సంగ్రామమే కదా. అదే 'సిటీబస్సు' కథలో సీరియస్‌గా అమాయకంగా చెప్పారు రచయిత.

పాటలు పాడేవారున్నా ఆస్వాదించేవారు లేకపోతే అపార్థసారథులే మిగుల్తారు. పాపం ఎన్నోసార్లు అలాంటి పాడువానిని రక్షించి తన ఇంట్లో రూములో ఉంచి చివరికి తానూ అపార్థం చేసుకొని తరిమేయాల్సి వచ్చింది రచయితకు. అసలు జరిగిన కథేంటో తెలియాలంటే 'త్యాగరాజుతో కటీఫ్' కథ చదవాల్సిందే.

ఇలా చెబుతూ పోతే, ఇదే ఒక చిన్నపాటి పుస్తకం అయ్యేలా ఉంది. ఇలాంటి కథలు చదువుతూంటే, బీపీలూ, షుగర్లూ అనేవాళ్లు సైతం ఆరోగ్యంగా ఉండొచ్చు. కాబట్టి 'వెన్నెల హాసం -2' కొని, గైకొని చదవండి. ప్రతి ఒక్క కథలో కూడా మనందరిలో ఎవరో ఒకరికి ఎదురయ్యే సంఘటనలనే ఎంచుకొని తన నిజజీవితంలో జరిగిన సంఘటనలను చిన్ని చిన్ని కథలుగా హాస్య భరితంగా చెప్పడం రచయిత ప్రత్యేకత. ఇంత చక్కని పుస్తకాన్ని అందించిన రచయితకీ, తపస్వీ మనోహరం పబ్లికేషన్స్‌కీ అభినందనలు తెలియజేస్తూ, వెన్నెల హాసం-3 త్వరలో వస్తుందనీ, మరిన్ని హాస్య గుళికలను రచయిత మనకందిస్తారనీ ఆశిస్తున్నాను.

డా.వి.వి. వేంకటరమణ, 9441234429

ఇంకా ఎంతకాలం!?

అక్కడ ఒక జీవితం
దారికేసి చూస్తోంది
వలసకై తన గమ్యం
ఎటువైపు సులభమని

ఇక్కడ ఒక దృశ్యం
ఎండిన పేగుల్ని మెడలో వేసి
ఆకలి అంటూ తిరుగుతోంది
మింగగా మిగిలింది వుంటే
కడుపుకేద్దామనే ఆశతో

ఎక్కడో ఒక దేహం
అరుపుల్ని తరంగాలుగా చేసి
సింహాసనం వైపు పంపించింది
నిద్రపోతున్న వాగ్దానం లేచి
కళ్ళు నులుముకుని
సమాజం వైపు చూస్తుందని

అక్కడక్కడా కొన్ని తతంగాలు
పోట్లాడుతూ ఎర్రబడుతున్నాయి
నువ్వా నేనా అంటూ
కాలాన్ని కాలర్ పట్టి నెట్టివేస్తూ
చోద్యానికి ఆజ్యం పోస్తున్నాయి

ఇప్పుడేమో ఒక ప్రాణం
అటు ఇటు తొక్కిసలాడుతోంది
గతంలో ఇచ్చిన మాటల్ని
ఊపిరి నిండా బిగబట్టుకుని
నీటి బుడగపై నిలబడిపోయింది

ఇంకా ఎంతకాలం అంటూ
ఒక సగటు వేదన
నిప్పులు చెరుగుతోంది
సమావేశాల ప్రాంగణాల్లో
ఆవేశం జూలు విదిలిస్తూ
కర్తవ్యాలను తరుముతున్నందుకు

ఇక కాలంతో పనిలేదని
ఒక బడుగు జీవి మనోవేదన
అడుగులు కదుపుతూ
కడగళ్ళను దాటెళ్ళిపోతోంది
భృతి కోసం భుక్తి కోసం
ఇంకా ఎంతకాలం
ఈ ఎదురు చూపుల జీవితమని

- నరెద్దుల రాజారెడ్డి
సెల్ : 9666016636

ఓదార్పు గీతం

చెట్టులాంటి కుటుంబంలో
స్వతంత్ర భావాలు కొమ్మలై విస్తరించినప్పుడు
బాధ్యతలను తప్పించుకుంటూ
కన్నబిడ్డలు బతుకు తెరువంటూ
కొత్త కొత్త సంపాదనా ఊడలను పట్టుకొని
కన్నవారిని వదిలి వెళ్లిపోతున్నారు.

తల్లిదండ్రులకు చేయూతనిచ్చే చేయిలేక
కష్టంవస్తే మాటకలిపే మనిషి కనపడక
నాలుగుగోడల మధ్య రాళ్లులా మిగిలిపోతున్నారు.

ఏడాదికో మారు చుట్టపు పలకరింపులు
వారిపై నీళ్లల్లా చిలకరించి
మదిలో ఆనందాలతడి ఆరకముందే
తిరిగి ప్రయాణమయ్యి
వారికి కన్నీరు మిగుల్చుతున్నారు.

ఆ వృద్ధ దంపతుల గుండెల్లో
తోడలేని దుఃఖపు ఊటబావులెన్నో
కంటికి కనిపించని ఓదార్పు గీతాలెన్ని
పాడుకుంటున్నారో
ఆ రాలిపోయే పండుటాకులు
కన్నబిడ్డల చేతి స్పర్శ కోసం

-చింతా రాంబాబు, 9948178092

భిన్న అంశాలను స్పృశిస్తూ సాగే శతక రచన

సామాజిక, సమకాలీన, రాజకీయ అంశాలను స్పృశిస్తూ కవి, రచయిత శర్మ సీహెచ్. రాసిన 'శర్మ శతకము'లో సమాజంలో నేడు కనిపిస్తున్న విభిన్న అంశాలు, వాటి ప్రభావం ఎలా ఉందన్నది తన పద్యాలద్వారా తెలిపే ప్రయత్నంచేశారు. సాధారణంగా శతకం అనగానే అందరి మదిలో మెదిలేవి వేమన, సుమతి, భాస్కర శతకం వంటివి. అందలి పద్యాల్లోని నాలుగుపాదాల్లో నాలుగో పాదం మకుటం ఉన్నట్టే ఇందులోనూ 'శర్మ పదమెప్పుడూ ధర్మ పథం మిత్రమా!' అని ముగుస్తుంది. కథలు, నవలలు ఎక్కువగా వస్తున్న వేళ శతక పద్య రచన రావడం విశేషమేనని చెప్పాలి.

నేడు వృద్ధాప్యం అంటే ఓ తీరని ఆవేదన కలిగించే అంశంగా మారుతోంది. అటువంటి వృద్ధాప్యాన్ని రచయిత 'కన్నీరు దిగమింగి పన్నీరు పంచినారు/దిశ చూపి దశ మార్చి దిక్సూచి అయినారు/పండుటాకులు వారు పిల్లల వెలుగురేఖలు...' అంటారు. పెండ్లంటే ఆర్థికంగా అన్నిటా ఉన్నతంగా ఉండాలన్నదే నేడు ప్రధానంగా చూస్తున్నారు కాని అసలు పెండ్లికి కావల్సింది ఏమిటో చెబుతూ 'పెళ్లి బాజా మోగడానికి అనేకనేక వంకలు/ధనముకన్నా గుణము మిన్నరా కన్నా..' అంటూ వైవాహిక బంధం సుఖంగా సాగటానికి గుణమే ప్రధానం ఆ తర్వాతే మిగిలినవంటారు.

ఉరుకులపరుగుల జీవితాల్లో బయటతిండ్లు తినడం బాగా అలవాటై పోతోంది. నాణ్యత చూసుకోకుండా రుచిగా ఉందంటూ తినడం ప్రారంభిస్తే ఆ తర్వాత అనేక అనారోగ్యసమస్యలు. అందుకే 'గుండె నిబ్బరంలేకుంటే పొట్టఉబ్బరం తథ్యం' కనుక జాగ్రత్తపడ మంటారు. ఉత్తరం అనగానే రేపటితరం ఏమిటని అడుగుతారేమో! అంతగా చరవాణి రాకతో ఉత్తరానికి శుభం కార్డు పడిందంటారు. అలాగే తారల వివాదాలు, టాటా గురించి, పండగల వేళ అధిక ఛార్జీలతో ప్రయాణీకుల ఇక్కట్లు తదితరాలు పద్యాల్లో పలికిస్తారు. ముఖ్యంగా నేటి సెల్‌ఫోన్ వాడకం గురించి చెబుతూ 'చరవాణికి బాని'సెల్' అయితే బతుకు బండలే'నంటారు. అందుకని వాడకాన్ని తగ్గించుకోమంటారు.

వినోదమంటే రంగస్థలం, ఆపై సినిమా, ఇప్పుడు ఓటీటీలు...ఇలా సాగిన వినోదం గురించి 'సినిమాల రాకతో రంగస్థలానికి చెల్లు/ఓటీటీ వచ్చాక సినిమాహాళ్ల ఘొల్లు/ కొత్తొక వింత పాతొక రోత జగమంతేలే...' అంటూ కాలంతోపాటు మారిన వినోదం రూపురేఖలను వివరిస్తారు. అలాగే రైతు క్షేమాన్ని కాంక్షించాలని, కొన్ని ఆసుపత్రుల ఖర్చులవల్ల చితికి పోతున్న సామాన్యుల గురించి చెబుతారు. జ్ఞానాన్ని అందిస్తూ విజ్ఞాన వీచికలుగా పేరొందిన గ్రంథాలయాలను కాపాడుకుందామంటూ ఓ పద్యంలో పలుకుతారు.



ఇలా అనేక అంశాలపై తన ఆలోచనలను పద్యరూపంలో పాఠకులతో పంచుకుంటారు. చివరగా 'పదిమందికీ మనంచేసే సేవ/అందరికీ కావాలి అదితోవ/ మంచిని పెంచుతూ...స్ఫూర్తిని నింపుతూ/ శర్మ పదమెప్పుడూ ధర్మపథం మిత్రమా!' అని ఆకాంక్షిస్తూ ముగిస్తారు. పద్యాలనగానే చాలామందిలో ఓకింత భయం ఉంటుంది. వచన కవితా ధోరణిలో సాగినా శతక రచనగా సులభశైలిలో అందరికి అర్థమయ్యే రీతిలో ఆకట్టుకుంటుంది.

శర్మ శతకము-శర్మ సీహెచ్, పేజీలు: 48, వెల: రూ.60/-
ప్రతులకు: సిహెచ్. వి.ఎన్.ఎస్.శర్మ, డోర్ నం. 29-19-8/1,
సుబ్రహ్మణ్య టవర్స్, సూర్యారావుపేట, డోర్నకల్ రోడ్,
విజయవాడ-520002.ఆంధ్రప్రదేశ్.

జె.ఎస్.బి.

జన దృక్పథంతో రాసిన చరిత్ర

మంచి పుస్తకం

ఇర్ఫాన్ హబీబ్ దేశంలోని అగ్రశ్రేణి చరిత్రకారుల్లో ఒకరు. ఆయన అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీలో చాలా కాలం అధ్యాపకుడిగా ఉన్నారు. దాదాపు 30 ఏళ్ల కాలంలో ఆయన దేశంలోనూ, విదేశాల్లోనూ వివిధ సమావేశాల్లో సమర్పించిన పత్రాలను సంకలితం చేసి "ఎస్సేస్ ఇన్ ఇండియన్ హిస్టరీ: టువర్డ్స్ ఎ మార్క్సిస్ట్ పెర్సెప్షన్' గ్రంథంగా 1995లో వెలువరించారు.

మార్క్సిస్టు దృక్పథాన్ని అనుసరించి చరిత్రను శోధించిన కొద్దిమందిలో ఇర్ఫాన్ హబీబ్ ప్రసిద్ధులు. భారతదేశ చరిత్రను మార్క్సిస్టు దృక్పథంతో పరిశీలించడమే ఆయన పనిగా పెట్టుకున్నారు. మరో రకంగా చెప్పాలంటే ప్రజల దృష్టితో చరిత్రను చూడడానికి, దాన్ని నమోదు చేయడానికి ఆయన దశాబ్దాలుగా కృషి చేస్తూనే ఉన్నారు.

ఆయన గ్రంథాన్ని చదవడానికి, వాస్తవాన్ని తెలుసుకోవడానికి ఆసక్తి ఉన్న వారికి ఆయన ఏ దృష్టితో చరిత్రను చూశారన్నది ప్రధానం కాదు. కాకూడదు. ఆయన వింగడింపు సవ్యంగా ఉందా లేదా, తర్కబద్ధంగా ఉందా లేదా అన్న అంశం మీదే పాఠకుల ఆసక్తి ఉండాలి. చరిత్ర అంటే బ్రిటిష్ వారు మన మీద రుద్దినది మాత్రమే కాదు. రాజులు, రాణులు, వారి ప్రేమ పురాణాలు మాత్రమే చరిత్ర కాదు. రాజులు పరిపాలిస్తారన్న మాట నిజమే కానీ అసలైన చరిత్ర నిర్మాతలు జనమే. ఆ నిర్మాణ క్రమాన్ని వివరించడానికే ఇర్ఫాన్ హబీబ్ నిరంతరం పాటు పడుతున్నారు.

చరిత్ర గమనంలో భౌతిక పరిస్థితులను, వర్గాలను, భావనలను, వర్గ పోరాటాలను అర్థం చేసుకుంటే తప్ప ఒక జాతి చరిత్ర నిజస్వరూపం అంతుపట్టదు. కార్ల్‌మార్క్స్ చేసిన పని ఇదే. తాను మార్క్సిస్టు దృక్కోణంతో చరిత్రను అధ్యయనం చేయడానికి ప్రయత్నించానే తప్ప ఆ పని మార్క్స్ చేసినంత పకడ్బందీగా చేసే తాహతు తనకు లేదని ఇర్ఫాన్ హబీబ్ చెప్పడం ఆయన వినయానికి నిదర్శనం.

చరిత్ర రచనలో అనేక ధోరణులున్నాయి. చరిత్రకారులు ధరించే కళ్లజోళ్లను బట్టి వారు చెప్పే చరిత్ర ఆధారపడి ఉంటుంది. ఈ గ్రంథం ఆయన దశాబ్దాల కింద రాసిన వ్యాసాల సంకలనం.

చరిత్రను పరిశీలించేటప్పుడు చరిత్రకారుడి మదిలో ఎలాంటి ప్రశ్నలు తలెత్తుతాయి, వాటికి వచ్చే సమాధానాలు ఎలాంటివి అన్న

అంశాన్నిబట్టే చరిత్ర రచన ఆధారపడి ఉంటుంది. ఇంతకు ముందు ఇర్ఫాన్ హబీబ్ "అగ్రేరియన్ సిస్టం ఆఫ్ మొగల్ ఇండియా," "ఆన్ అట్లాస్ ఆఫ్ ది మొగల్ ఎంపైర్," "ప్రీ హిస్టరీ" లాంటి గ్రంథాలు అందించారు.

చరిత్ర రచనకు కావాల్సిన పాండిత్యం ఆయనకు ఉంది. ఆయన నిబద్ధతగల చరిత్రకారుడు. సోషలిస్ట్ ఇండియా అవతరించాలన్నది ఆయన కల. చరిత్ర రచనా క్రమంలో ఆయన లేవనెత్తే ప్రశ్నలు మనలను అబ్బురపరుస్తాయి. భారత చరిత్ర నిర్మాణంలో రైతులు నిర్వర్తించిన పాత్రను తవ్వి తీయడానికి ఆయన చేసిన ప్రయత్నం ప్రశార్హమైంది. వర్గ పోరాటాల రీతులను ఆయన వెతికి పట్టుకున్నారు. మొగల్ పరిపాలనలో ఆర్థికాభివృద్ధి దశ ఏమిటో వివరించడానికి ఆయన ప్రయత్నించారు.

ఈ గ్రంథంలో ఉన్న అన్ని వ్యాసాలూ ఆయన లోతులకెళ్లి చరిత్ర ఆనవాళ్లను అన్వేషించి చరిత్ర సౌధాన్ని నిర్మించిన తీరు ఆశ్చర్యం కల్గిస్తుంది. మార్క్స్ మన దేశాన్ని చూసిన తీరును కూడా ఇర్ఫాన్ హబీబ్ ఎత్తి చూపారు. పీపుల్స్ హిస్టరీ ఆఫ్ ఇండియా సంపుటాలకు ఆయన సంపాదకుల్లో ఒకరిగా ఉన్నారు.

93 ఏళ్ల ఇర్ఫాన్ హబీబ్ నిరంతర అన్వేషి. ఈ వయసులో కూడా ఆయన అధ్యయనం ఆపలేదు. చరిత్రను వక్రీకరిస్తున్న దశలో అసలు మన చరిత్రలో దాగిన కోణాలను అన్వేషించడానికి రొమిలా థాపర్, ఇర్ఫాన్ హబీబ్ లాంటి వారు చేసిన కృషి నిరుపమానమైంది.

ఆర్వీ రామారావ్



వక్ఫ్ బిల్లుపై నేడు లోక్‌సభకు జేపీసీ నివేదిక

న్యూఢిల్లీ : వక్ఫ్ (సవరణ) బిల్లు 2024 నివేదికను సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) సోమవారం (ఫిబ్రవరి 3) లోక్‌సభకు సమర్పించనుంది. ఈ వక్ఫ్‌బిల్లును ఎన్డీయే సభ్యులు ఏకపక్షంగా ఆమోదించుకున్నారని ప్రతిపక్ష ఎంపీలు మండిపడుతున్నారు. 'ఈ కమిటీలో నేను కూడా సభ్యుడిగా ఉన్నాను. ఈ బిల్లును నేను వ్యతిరేకిస్తూ వివరణాత్మక నోట్‌ను కమిటీకి సమర్పించాను. అయితే ఆశ్చర్యకరంగా నేనిచ్చిన నోట్‌లోని కొన్ని భాగాలు నాకు తెలియకుండానే సవరించారు' అని ఈ కమిటీలో సభ్యుడైన కాంగ్రెస్ ఎంపి సయ్యద్ నసీర్ హుస్సేన్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. కాగా, ఈ బిల్లుకు ప్రతిపక్ష సభ్యులు ప్రతిపాదించిన 44 సవరణల్ని జేపీసీ తిరస్కరించింది. ఈ కమిటీలో ఎన్‌డిఎ సభ్యులు ప్రతిపాదించిన 14 సవరణల్ని ఆమోదించింది. ఈ సవరణలకు ఎన్‌డిఎ సభ్యులు 16 మంది మద్దతు తెలిపారు. ప్రతిపక్షానికి చెందిన 10 మంది వ్యతిరేకించారు.

భర్త కిడ్నీ రూ.10 లక్షలకు అమ్మేసి...

హౌరా: భర్త కిడ్నీని రూ.10 లక్షలకు అమ్మేసి ఆ డబ్బుతో ప్రియుడితో పరారైన కిలాడీ భార్య ఉదంతం పశ్చిమ బెంగాల్‌లోని హౌరాలో వెలుగుచూసింది. హౌరా జిల్లా సంక్రైల్‌లో కిడ్నీ అమ్మాలని ఒక మహిళ తన భర్తను బలవంతపెట్టింది. ఆ దంపతులకు 10 సంవత్సరాల కుమార్తె ఉంది. " డబ్బు లేకపోవడం వల్ల మన కూతురి భవిష్యత్తును తీర్చిదిద్దలేకపోతే, అందుకు మీదే తప్పు అవుతుంది. మీ కూతురి భవిష్యత్తును నాశనం చేయడానికి మీరే బాధ్యత వహించాలి " అని నిరంతరం తన భర్తను సాధిస్తూనే ఉంది. భర్త ఆదాయం తన కూతురి చదువు ఖర్చులకు సరిపోలేదు. కాబట్టి భార్య తన భర్తతో మీ కిడ్నీని అమ్మేయండి. దీంతో మన ఆర్థిక సమస్యలు అన్నీ తీరుతాయని నమ్మబలికింది. దీంతో తన కూతురి భవిష్యత్తు కోసం ఆయన కిడ్నీ అమ్మడానికి అంగీకరించాడు. తన కిడ్నీ ఎవరైనా కొంటారేమోనని నెల రోజుల పాటు వెతికాడు. నెల తర్వాత కిడ్నీ రూ.10 లక్షలకు అమ్ముడయ్యింది. భార్యాభర్తలిద్దరూ కలిసి కిడ్నీ కొంటున్న వ్యక్తి దగ్గరకు వెళ్లి డబ్బు తెచ్చారు. దీని తరువాత భార్య ఈ డబ్బు నాకు ఇవ్వు ఉదయం ఆ మొత్తాన్ని బ్యాంకులో జమ చేస్తాను అంది. దీంతో భార్యకు ఆ మొత్తాన్ని అందజేశాడు. అయితే, భార్య ఆ డబ్బులు తీసుకుని రాత్రే ఇంటి నుంచి పారిపోయింది. కొన్ని రోజుల తరువాత గత శుక్రవారం తన భార్య బరాక్‌పూర్‌లోని సుభాష్ కాలనీలో పెయింటర్‌గా పనిచేస్తున్న రవిదాస్ అనే వ్యక్తితో నివసిస్తున్నట్లు భర్తకు తెలియగానే ఆయన తన కుటుంబంతో సహా అక్కడికి చేరుకున్నాడు. అప్పుడు ఆమె ఇంట్లోనే ఉండి తలుపు గడియపెట్టుకుంది. " ఏం చేసుకుంటావో చేసుకో నీకు విడాకులు పంపిస్తాను " అని గట్టిగా అరిచేసింది. కనీసం తన పదేళ్ల కూతురు మీద కూడా జాలి చూపించలేకపోయింది. చేసేదిలేక ఆ పెయింటర్ రవిదాస్, భార్య ఇద్దరిపై భర్త కేసు పెట్టాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉద్యోగులపై మైక్రోసాఫ్ట్ వేటు

న్యూఢిల్లీ : టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్... పనితీరు మెరుగుపడని ఉద్యోగులపై చర్యలకు ఉపక్రమించిందని 'బిజినెస్ ఇన్‌సైడర్' పత్రిక వెల్లడించింది. తాజాగా ఉద్యోగాలు కోల్పోయిన వారికి మెడికల్, ప్రిస్క్రిప్షన్, డెంటల్ హెల్త్‌కేర్ ప్రయోజనాలు వెంటనే నిలిచిపోతాయని ఆదేశించినట్టు ఆ కథనంలో వెల్లడించారు. కొందరు ఉద్యోగులకు సర్వీస్ పే కూడా చెల్లించనట్లు తెలుస్తోంది. 'మీ స్థాయికి తగినట్లు పనితీరులో కనీస ప్రమాణాలు అందుకోలేదు. దీంతో ఉద్యోగం నుంచి తొలగిస్తున్నాం. మిమ్మల్ని అన్ని డ్యూటీల నుంచి రిలీవ్ చేస్తున్నాం. మైక్రోసాఫ్ట్ సిస్టమ్‌లు, అకౌంట్స్, బిల్డింగ్‌ల్లోకి పర్మిషన్లను నిలిపివేస్తున్నాం. ఇక మీరు మైక్రోసాఫ్ట్ తరఫున ఏ పనీ చేయకూడదు' అని ఆ ఉద్యోగులకు పంపిన లేఖలో వివరించారు. మళ్లీ ఇదే కంపెనీలో కొత్త ఉద్యోగానికి దరఖాస్తు చేసుకుంటే గతంలో ఆ ఉద్యోగి పనితీరు, టర్మినేషన్‌కు గురైన అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటామని మైక్రోసాఫ్ట్ వారికి సూచించింది. ఇటీవల కంపెనీ లెవల్ 80 వరకు ఉద్యోగుల పనితీరును విశ్లేషించింది. జూన్ 2024 నాటికి కంపెనీలో 2.28 లక్షల మంది ఉద్యోగులు ఉన్నారు. ఇటీవలే మైక్రోసాఫ్ట్ సెక్యూరిటీ, డివైజ్, సేల్స్, గేమింగ్ విభాగాల్లోని ఉద్యోగులపై కూడా వేటు వేసింది.

15న పార్లమెంటులో 'ది లెజెండ్ ఆఫ్ ప్రిన్స్ రామ' సినిమా ప్రదర్శన

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో ఈ నెల 15న 'రామాయణం: ది లెజెండ్ ఆఫ్ ప్రిన్స్ రామ' సినిమాను ప్రదర్శించనున్నట్టు గీక్ పిక్చర్స్ ఇండియా వెల్లడించింది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, పార్లమెంటు సభ్యులతో పాటు పలువురు ప్రముఖులు సైతం దీనికి హాజరుకానున్నారు. 'ఇది మాకు ఎంతో స్ఫూర్తినిస్తుంది' అని గీక్ పిక్చర్స్ ఇండియా సహ వ్యవస్థాపకులు అర్జున్ అగర్వాల్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 1993లో 'రామాయణం: ది లెజెండ్ ఆఫ్ ప్రిన్స్ రామ' యానిమేటెడ్ చిత్రాన్ని రూపొందించారు. 24వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియాలో దీన్ని ప్రదర్శించారు. అయితే కొన్ని కారణాల వల్ల అప్పుడు థియేటర్‌లలో ప్రదర్శించలేకపోయారు. 2000 సంవత్సరంలో టీవీలో దీన్ని టెలికాస్ట్ చేయగా ప్రేక్షకాదరణ సొంతం చేసుకుంది. దీంతో దీని 4కే వెర్షన్‌ను సిద్ధం చేసి జనవరి 10న రిలీజ్ చేశారు. గీక్ పిక్చర్స్‌ఇండియా, ఏఏ ఫిల్మ్స్ సంయుక్తంగా దీన్ని నిర్మించాయి.

గ్రామ కోర్టులకు నిధుల కొరత

ఇంటి వద్దకే న్యాయం అందించే చర్యలకు బడ్జెట్‌లో మొండిచేయి

న్యూఢిల్లీ : ఇంటి వద్దకే న్యాయం అందించే సాధనంగా భావించిన గ్రామ న్యాయాలయాలు లేదా గ్రామ కోర్టులకు ఈ సంవత్సరం నిధుల కేటాయింపు గణనీయంగా తగ్గింది. బడ్జెట్ పత్రం ప్రకారం, కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ గ్రామ న్యాయాలయ పథకానికి రాబోయే 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.2 కోట్లు కేటాయించింది. 2024-25 సంవత్సరానికి సవరించిన అంచనాల ప్రకారం, ఈ పథకానికి రూ.10 కోట్లు కేటాయించారు. మానవశక్తి కొరత, ఆర్థిక సంక్షోభం కారణంగా గ్రామ కోర్టులు తమ లక్ష్యాన్ని చేరుకోవడం కష్టతరం చేస్తున్నాయి. ఇప్పటివరకు, 481 గ్రామ న్యాయాలయాలను 15 రాష్ట్రాలు నోటిఫై చేశాయి. వీటిలో 309 కోర్టులు 10 రాష్ట్రాల్లో పని చేస్తున్నాయని న్యాయ మంత్రిత్వ శాఖ గత సంవత్సరం వర్షాకాల సమావేశాల్లో పార్లమెంటుకు తెలిపింది. 1986లో న్యాయ కమిషన్ పౌరులకు వారి ఇంటి వద్దకే న్యాయం అందుబాటులోకి వచ్చేలా గ్రామ కోర్టులను ఏర్పాటు చేయాలని సూచించింది. సంవత్సరాల తరువాత గ్రామ న్యాయాలయాల చట్టం-2008 మరుసటి సంవత్సరం గాంధీ జయంతి నుంచి అమలులోకి వచ్చింది. పౌరులకు వారి ఇంటి వద్దే న్యాయం లభించేలా, సామాజిక, ఆర్థిక లేదా ఇతర వైకల్యాల కారణంగా ఎవరికీ న్యాయం పొందే అవకాశం కోల్పోకుండా చూసుకోవడానికి గ్రామ న్యాయాలయాలను ఏర్పాటు చేయడానికి చట్టం వీలు కల్పిస్తుంది. 'కొన్ని అధ్యయనాలను' ఉటంకిస్తూ, ఈ గ్రామ కోర్టుల ఏర్పాటులో నెమ్మదిగా పురోగతి సాధించడానికి ప్రధాన కారణాలు అనేక రాష్ట్రాల్లో 'న్యాయాధికారి' పోస్టులను భర్తీ చేయకపోవడం, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, నోటరీలు అందుబాటులో లేకపోవడం, ఫస్ట్-క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ల సాధారణ కొరత అని న్యాయ మంత్రిత్వ శాఖ పార్లమెంటులో పేర్కొంది. గ్రామ న్యాయాలయాల పరిమిత ఆర్థిక అధికార పరిధి, తగినంత సిబ్బంది లేకపోవడం, రాష్ట్రాల నుంచి తగినంత ఆర్థిక మద్దతు లేకపోవడం, చట్టపరమైన, రాష్ట్ర అధికారుల నుంచి అయిష్టత, సమాజ అవగాహన లేకపోవడం గ్రామ కోర్టుల ప్రస్తుత పరిస్థితికి ఇతర కారణాలుగా ప్రభుత్వం పేర్కొంది. అంతేకాకుండా, సాధారణ కోర్టులతో అధికార పరిధిని అతివ్యాప్తి చేయడం అనే అంశం కొన్ని రాష్ట్రాల్లో ఇటువంటి కోర్టులు 'నెమ్మదిగా పనిచేయడానికి' మరొక కారణమని అది పేర్కొంది. మార్గదర్శకాల ప్రకారం, పునరావృతం కాని ఖర్చులను తీర్చడానికి కేంద్రం గ్రామ న్యాయాలయానికి రూ.18 లక్షలు అందజేస్తుంది. ఈ కోర్టుల పునరావృత ఖర్చులలో 50 శాతం భరిస్తుంది. ఇది మొదటి మూడు సంవత్సరాలలో సంవత్సరానికి లక్ష కోర్టుల పరిమితికి లోబడి ఉంటుంది. గత సంవత్సరం డిసెంబరులో గ్రామ న్యాయాలయాల స్థాపనపై మొత్తం దేశానికి 'నేరుగా అద్దుకునే సూత్రం' ఉండదని సుప్రీం కోర్టు పేర్కొంది. ఎందుకంటే పరిస్థితి రాష్ట్రం నుంచి రాష్ట్రానికి ఆధారపడి ఉంటుంది. సుప్రీం కోర్టు పర్యవేక్షణలో గ్రామ న్యాయాలయాలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని కేంద్రం అన్ని రాష్ట్రాలను ఆదేశించాలని కోరుతూ దాఖలయిన పిటిషన్‌ను విచారిస్తూ న్యాయమూర్తులు జస్టిస్ బి.ఆర్.గవాయ్, కె.వి.విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.

దిల్లీ ఎన్నికల్లో బీజేపీదే విజయం

ప్రధాని మోదీ

న్యూఢిల్లీ : కేంద్ర బడ్జెట్ ప్రతి కుటుంబంలో సంతోషంతో నింపిందని, ఇది భారతదేశ చరిత్రలో అత్యంత మధ్యతరగతి వారికి అనుకూలమైన బడ్జెట్ అని ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఫిబ్రవరి 5న దిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇక్కడ జరిగిన ర్యాలీలో ప్రసంగిస్తూ, మధ్యతరగతికి బడ్జెట్‌లోని వివిధ ప్రయోజనకరమైన నిబంధనల గురించి మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రూ.12 లక్షల వరకు ఆదాయం ఉన్నవారికి ఇంత ఉపశమనం లభించలేదని చెప్పారు. భారత చరిత్రలో తమకు ఇది అత్యంత స్నేహపూర్వక బడ్జెట్ అని మధ్యతరగతి వర్గాలు చెబుతున్నాయని ఆయన అన్నారు. దేశ రాజధానిలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం తప్పుడు వాగ్దానాలు చేసిందని, అవినీతికి పాల్పడిందని విమర్శిస్తూ, దాని విధానాలు ఫ్యాక్టరీల మూసివేతకు దారితీశాయని, ప్రజలను దోచుకున్న వారు దానికి జవాబు చెప్పాల్సి ఉంటుందని తెలిపారు. ఒకవైపు 'ఆప్-దా' అనేది తప్పుడు వాగ్దానాలకు నిలిస్తే, మరోవైపు 'మోదీ హామీలు' అని ప్రధాని అన్నారు. ఆదివారం వసంత పంచమి సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ పండుగ సీజన్ మార్పును సూచిస్తుందని, దిల్లీ ప్రజలు బీజేపీ ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని నిర్ణయించుకున్నారని చెప్పారు. 'ఆప్-దా' 11 సంవత్సరాలుగా దేశ రాజధానిని నాశనం చేసిందని, దాని అభివృద్ధి, వృద్ధికి అంకితమైన డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఇప్పుడు ఎన్నికవుతుందని ప్రధాని అన్నారు. కేంద్రంలో తన ప్రభుత్వం పేదలు, రైతులు, యువత, మహిళల నాలుగు స్తంభాలను బలోపేతం చేయడానికి కట్టుబడి ఉందని, ఈ బడ్జెట్ మోదీ హామీలను నెరవేరుస్తుందని ఆయన నొక్కి చెప్పారు. పర్యాటకం, తయారీ వంటి ఉపాధిని సృష్టించే రంగాలపై బడ్జెట్ దృష్టి యువతకు ప్రయోజనం చేకూరుస్తుందన్నారు. సీనియర్ సిటిజన్లు, మహిళలు సహా బీజేపీ మ్యానిఫెస్టోలో చేసిన సంక్షేమ వాగ్దానాల గురించి ఆయన మాట్లాడుతూ దేశ రాజధానిలో బీజేపీ ప్రభుత్వం వారికి తీసుకువచ్చే ప్రయోజనాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. జీతాలు పొందే ఉద్యోగులతో సహా మధ్యతరగతి ఓటర్లలో గణనీయమైన వర్గానికి అనుగుణంగా, వారి కలలు, ఆకాంక్షలను తీర్చే నిర్ణయాలు తన ప్రభుత్వం తీసుకుంటుందని ప్రధాన మంత్రి అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ వాదనలను తిప్పికొడుతూ, బీజేపీ అధికారంలోకి వస్తే ఏ సంక్షేమ పథకాన్ని నిలిపివేయబోమని అన్నారు. పూర్వాంచల్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ తాను ఆ ప్రాంత ఎంపీనని, వారణాసిని ప్రస్తావిస్తూ ఆయన పేర్కొన్నారు. బీహార్‌ను అభివృద్ధి చేయడానికి ఎన్డీఏ ప్రభుత్వం పగలు, రాత్రి పనిచేస్తోందని, బడ్జెట్‌లో రాష్ట్రానికి చేసిన అనేక ప్రతిపాదనలను ప్రస్తావించారు. బీజేపీ విజయం గురించి విశ్వాసం వ్యక్తం చేస్తూ, 'ఫిబ్రవరి 8న దిల్లీలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని, మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాటికి మహిళలు రూ.2,500 అందుకోవడం ప్రారంభిస్తారని మీరు గమనించవచ్చు' అని అన్నారు. మహిళలు తనకు రక్షణ కవచంగా పనిచేశారని, కేంద్రంలో తన ప్రభుత్వాన్ని మూడవసారి ఏర్పాటు చేయడంలో పెద్ద ఎత్తున కృషి చేశారని చెప్పారు. ఆప్ ప్రభుత్వం కారణంగా దిల్లీ భారీ మూల్యం చెల్లించుకుందని, దానిని తొలగించాలని నిర్ణయించుకున్నారని ఆయన అన్నారు. 'శీష్ మహల్'లో నివసించే వారు పేద కుటుంబానికి చెందిన జుగ్గీతో లేదా మధ్యతరగతి కుటుంబానికి చెందిన 2 బెడ్ రూమ్ ఫ్లాట్‌తో సంబంధం కలిగి ఉండలేరని, మాజీ ముఖ్యమంత్రి, ఆప్ నాయకుడు అరవింద్ కేజ్రీవాల్‌ను విమర్శిస్తూ ఆయన అన్నారు. ఆప్ ప్రజల ఆరోగ్య చర్యలతో సహా ప్రతి రంగంలోనూ కుంభకోణం, అవినీతికి పాల్పడిందని అన్నారు. ఎన్నికల్లో పార్టీ టికెట్ ఇవ్వని సిట్టింగ్ ఎమ్మెల్యేలు సహా అనేక మంది ఆప్ నాయకులు ఆ పార్టీని వీడటంతో, ప్రజలు పార్టీ పట్ల ఎంతగా ఆగ్రహాన్ని కలిగి ఉన్నారో తాము గ్రహించామని మోదీ అన్నారు. ఆందోళన చెందుతున్న ఆప్ ప్రతిరోజూ తప్పుడు ప్రకటనలు చేస్తోందని చెప్పారు.

దళిత మహిళపై హత్యాచారం... విలపించిన ఎస్పీ ఎంపీ

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య జిల్లాలో దళిత మహిళ(22)పై హత్యాచారం జరిగింది. కాళ్లు విరిచి, కంటి గుడ్లు పెకలించిన మహిళ నగ్న మృతదేహాన్ని కాలువలో గుర్తించారు. ఈ దారుణంపై ఫైజాబాద్ ఎస్పీ ఎంపీ అవధేశ్ ప్రసాద్ ఈ దారుణంపై స్పందించారు. ఆదివారం మీడియా సమావేశంలో ఆయన విలపించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరుగకపోతే లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేస్తానని అన్నారు. 'నన్ను దిల్లీకి వెళ్లనివ్వండి. ప్రధాని మోదీ ముందు ఈ విషయాన్ని లోక్‌సభలో లేవనెత్తుతా. న్యాయం జరుగకపోతే లోక్‌సభ సభ్యత్వానికి నేను రాజీనామా చేస్తా. కూతుళ్లను రక్షించడంలో మనం విఫలమవుతున్నాం. చరిత్ర మనల్ని ఎలా భావిస్తుంది? మన కూతురికి ఇది ఎలా జరిగింది? పురుషోత్తమ రామ... తల్లి సీత, మీరు ఎక్కడ ఉన్నారు' అంటూ బోరున విలపించారు. పక్కనే ఉన్న నేతలు ఆయనను ఓదార్చేందుకు ప్రయత్నించారు. కాగా, మహిళ (22) గత నెల 30వ తేదీ రాత్రి భజన కార్యక్రమానికి వెళ్లిందని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె ఇంటికి తిరిగి రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. కాళ్లు విరిచి, కంటి గుడ్లు పీకి, తాళ్లతో కట్టేసిన నగ్న మృతదేహాన్ని కాలువలో గుర్తించినట్లు తెలిపారు. అత్యాచారానికి పాల్పడి దారుణంగా హింసించి చంపినట్లు అనుమానం వ్యక్తం చేశారు. మరోవైపు పోలీసులు ఆ మహిళ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రిపోర్ట్ వచ్చిన తర్వాత అసలు ఏం జరిగిందో అన్నది నిర్ధారిస్తామని పోలీస్ అధికారి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

'ఉపాధి హామీ'కి బడ్జెట్‌లో మొండిచేయి

కాంగ్రెస్

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ... బడ్జెట్‌లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులను పెంచకపోవడంపై కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రజల జీవనోపాధి విషయంలో చూపిస్తున్న ఉదాసీనతకు ఇది నిదర్శనమని ఆ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శించారు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఏడాదిలో 100 రోజులపాటు ఉపాధి పొందుతారని... ముఖ్యంగా వయోజనులు, మహిళలకు ఇది ప్రయోజనకరంగా ఉందని అన్నారు. గత ఏడాది ఉపాధి హామీ పథకానికి ముందుగా రూ.60 వేల కోట్లు కేటాయించగా.. అదనపు నిధులు ఇవ్వడంతో అది రూ.89,153.71 కోట్లు అయిందని అన్నారు. 2025 బడ్జెట్‌లోనూ రూ.86 వేల కోట్లు కేటాయించారని గతేడాదితో పోల్చితే నిధుల కేటాయింపులో ఎటువంటి పెరుగుదల లేదని మండిపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా, పేద గ్రామీణ కార్మికులకు మొండి చేయి ఇచ్చిందన్నారు. ఉపాధి కార్మికుల వేతనాల పెంపు కూడా తీరని కలగా మారిందన్నారు. 2025 బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖకు రూ.1.81 లక్షల కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో కేటాయించిన మొత్తం కన్నా ఇది 5.75 శాతం అధికం. ప్రధానమంత్రి గ్రామ సడక్‌యోజన పథకానికి ఈసారి రూ.19 వేల కోట్లు కేటాయించారు. ఇది క్రితం సారి సవరించిన కేటాయింపుల కన్నా 31 శాతం అధికం. ప్రధానమంత్రి ఆవాస్ యోజన - గ్రామీణ్ పథకానికి రూ 54,832 కోట్లు ఇవ్వగా... ఉపాధి హామీ పథకానికి రూ.86 వేల కోట్లు కేటాయించారు.

బంగారం ధరకు రెక్కలు

ముంబై: బంగారం ధర అమాంతం పెరిగింది. ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరింది. నెల రోజుల్లో రూ.5వేల పెరిగి... 10 గ్రాముల మేలిమి (999 స్వచ్ఛత) పసిడి ధర రూ.1100కు చేరింది. దేశ రాజధాని దిల్లీలో రూ.84,900కి పెరిగింది. దేశీయంగా కొనుగోళ్ల మద్దతు, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో బంగారం ధరలు రెక్కలు వచ్చినట్లు ఆలిండియా సరఫా అసోసియేషన్ తెలిపింది. దేశీయంగా జనవరి 1న 10 గ్రాముల బంగారం ధర రూ.79,390 ఉండగా... నెల చివరకు రూ.5,510 మేర పెరగడం గమనార్హం. వెండి ధర కూడా పెరిగింది.

కాల్వలోకి దూసుకెళ్లిన పెళ్లి జీపు... 9 మంది మృతి

చండీగఢ్: పెళ్లి వేడుక ముగించుకుని తిరిగి వస్తుండగా ఓ జీపు అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లిన ఘటన హర్యానాలోని ఫతేహాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. తొమ్మిది మంది మృతి చెందగా ముగ్గురు గల్లంతయ్యారు. వివరాల్లోకి వెళితే... 14 మందితో కూడిన పెళ్లిబృందం పంజాబ్‌లోని ఫజిల్కాలో జరిగిన వివాహానికి హాజరై క్రూజర్ వాహనంలో తమ స్వస్థలాలకు తిరుగుపయనమయ్యారు. ఈ క్రమంలో ఫతేహాబాద్‌లోని భాఖడా కాలువ దాటుతుండగా అదుపుతప్పిన జీపు బ్రిడ్జిపై నుంచి నీళ్లలో పడిపోయింది. దీంతో తొమ్మిది మంది అక్కడికక్కడే చనిపోయారు. మరో ముగ్గురు గల్లంతవగా, ఇద్దరు సజీవంగా ఉన్నారని జిల్లా సబ్‌కలెక్టర్ జగదీశ్ చంద్ర చెప్పారు. గల్లంతైన వారికోసం ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్ సిబ్బంది ముమ్మరంగా గాలిస్తున్నారని తెలిపారు. మృతుల్లో ఏడాదిన్నర చిన్నారితోపాటు బాలిక (10), ఓ మహిళ ఉన్నారని తెలిపారు. కాలువలో నీటి ప్రవాహం తక్కువైతే గాలింపు సులభమవుతుందని, దీనికోసం నీటిపారుదల శాఖ అధికారులను సంప్రదించామన్నారు.

నకిలీ ఓటర్లు కావద్దు... కేసుల్లో చిక్కుకోవద్దు

మురికివాడల ప్రజలకు కేజ్రీవాల్ సూచన

న్యూఢిల్లీ: దిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ బలహీన వర్గాలు, మురికివాడల్లోని ప్రజలు తమ ఓటు హక్కును కోల్పోయేలా పెద్ద కుట్ర జరుగుతోందని ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. నకిలీ ఓటర్లుగా మారవద్దు, కేసుల్లో చిక్కుకోవద్దు అని మురికివాడల ప్రజలకు హితవు పలికారు. ప్రత్యర్థి పార్టీ వారు ఓటుకు రూ.3వేలు ఇస్తామని, ఇంటి వద్దకే ఎన్నికల సంఘం వచ్చి ఓటు వేయించుకుంటుందని, వేలికి సిరా ముద్ర ఉంటే డబ్బు ఇస్తామని చెబుతున్నట్లు సర్వెంట్ క్వార్టర్స్, ధోబీ ఘాట్లు, మురికివాడల నుంచి తనకు అనేక ఫోన్‌లు వస్తున్నట్లు కేజ్రీవాల్ వెల్లడించారు. ఇలాంటి అక్రమార్కుల ఉచ్చులో పడవద్దని ఆయా వర్గాలకు సూచించినట్లు ఆదివారం విడుదల చేసిన వీడియోలో ఆయన చెప్పారు. 'డబ్బు ఇస్తే తీసుకోండి కానీ మీ వేలికి సిరా చుక్క పడనివ్వొద్దు, లేకపోతే జీవితాంతం చిక్కులు తప్పవు' అని హెచ్చరించానని చెప్పుకొచ్చారు. నకిలీ ఓటు వేసిన నేరం కింద అరెస్టుకు గురవుతారని, 8-10ఏళ్ల శిక్ష పడవచ్చని తెలిపానన్నారు. ఎన్నికల ముందు రోజు రాత్రి మీడియా నిఘా పెట్టి... ఇలాంటి పనులు చేస్తూ మూడో కంటికి చిక్కితే అరెస్టులు తప్పబోవన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే మురికివాడలను ఎవరూ కాపాడలేరని, సంపన్న మిత్రులతో కలిసి వాటిని ఆ పార్టీ కూల్చివేస్తుందని హెచ్చరించారు. ఆప్‌ను బలపర్చాలని, తిరిగి అధికారంలోకి తీసుకు రావాలని కోరారు. ఆమ్ ఆద్మీ ప్రభుత్వం ఉంటే మురికివాడల జోలికి ఎవరూ రాబోరని దిల్లీ మాజీ సీఎం హామీనిచ్చారు. కాగా, దిల్లీ అసెంబ్లీ ఎన్నికలు బుధవారం జరగనున్నాయి. దేశ రాజధానిలో మూడోసారి అధికారం కోసం ఆప్ యత్నిస్తోంది.

చట్టసభలకు సముచిత బడ్జెట్

లోక్‌సభకు రూ.903కోట్లు, రాజ్యసభకు రూ.413 కోట్లు

న్యూఢిల్లీ: చట్టసభలకు కేంద్ర బడ్జెట్‌లో సముచిత కేటాయింపులు ఇచ్చారు. లోక్‌సభకు రూ.903 కోట్లు ఇవ్వగా ఇందులో రూ.558.81 కోట్ల (సాంసద్ టీవీ కోసం ఇచ్చేది కలిపి)ను లోక్‌సభ సెక్రటేరియట్ కోసం కేటాయించారు. రాజ్యసభకు రూ.413 కోట్లు ఇవ్వగా ఇందులో రూ.2.52 కోట్లను చైర్మన్, డిప్యూటీ చైర్మన్ వేతనాలు, ప్రోత్సాహకాల కోసం కేటాయించారు. రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడి వేతనాలు, ప్రోత్సాహాలు, ఆయన సెక్రటేరియట్ కోసం వేరుగా రూ.3కోట్లు ఇచ్చారు. సభ్యుల కోసం రూ.98.84 కోట్లను కేటాయించారు. అలాగే లోక్‌సభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్ వేతనాలు, ప్రోత్సాహాల కోసం రూ.1.56 కోట్లు ఇచ్చారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడి కార్యాలయం కోసం వేరుగా ఏమీ ఇవ్వలేదు. గత పదేళ్లుగా లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు లేకపోవడం విదితమే. ఇక లోక్‌సభ సభ్యుల కోసం రూ.338.79 కోట్లు కేటాయించారు. కాగా, లోక్‌సభలో మొత్తం 543 మంది, రాజ్యసభలో 245 మంది సభ్యులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరేందుకు రౌత్ చర్చలు

బీజేపీ ఎమ్మెల్యే నితేశ్ రాణే

ముంబై : శివసేన (యూబీటీ) కీలక నాయకుడు సంజయ్ రౌత్ కాంగ్రెస్‌లో చేరేందుకు చర్చలు దిల్లీలోని ఒక నాయకుడితో జరుపుతున్నారని మహారాష్ట్ర మంత్రి, బీజేపీ ఎమ్మెల్యే నితేశ్ రాణే ఆదివారం పేర్కొన్నారు. రౌత్ రాజ్యసభ పదవీకాలం ముగియనుందని, ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని పార్టీకి మరోసారి రౌత్ విజయం సాధించడానికి తగినంత మంది శాసనసభ్యులు లేరని రాణే ఎత్తి చూపారు. నవంబరులో జరిగిన ఎన్నికల్లో 288 మంది సభ్యులున్న మహారాష్ట్ర అసెంబ్లీలో శివసేన (యూబీటీ) 20 సీట్లు గెలుచుకుంది. 'శివసేన (యూబీటీ) లో తాను ఎంతకాలం కొనసాగబోతున్నాడో రౌత్ దాని గురించి సామ్నా (ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని పార్టీ పత్రిక) లో రాయాలి. కాంగ్రెస్‌లో చేరేందుకు దిల్లీలో తాను చర్చలు జరుపుతున్న నాయకుడి గురించి రాయాలి. ఈ అంశంపై ఆయన ఒక ప్రకటన కూడా చేయాలి' అని రాణే అన్నారు. దీనిపై రౌత్ స్పందన కోరేందుకు అనేక సార్లు ప్రయత్నించినప్పటికీ ఆయన అందుబాటులోకి రాలేదు. కాగా ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రి, శివసేన నాయకుడు ఏక్‌నాథ్ షిండే మధ్య విభేదాలు రాష్ట్రంలో పాలనను ప్రభావితం చేస్తున్నాయని రౌత్ పేర్కొన్న నేపథ్యంలో రాణే ఈ వ్యాఖ్యలు చేశారు. ఆదివారం శివసేన (యూబీటీ) పత్రిక 'సామ్నా'లో తన వారపు కాలమ్ రోఖ్‌ఠోక్‌లో, ఫడ్నవీస్, షిండే మధ్య 'చెడిన సంబంధం' రాష్ట్ర పురోగతికి ఆటంకం కలిగిస్తోందని రౌత్ పేర్కొన్నారు. నవంబరు 2024 అసెంబ్లీ ఎన్నికల తర్వాత తాను తిరిగి ముఖ్యమంత్రిగా నియమితులవ్వలేదనే వాస్తవాన్ని షిండే ఇంకా అంగీకరించలేదని, ఆ స్థానాన్ని తిరిగి పొందడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడని, ఇది ఫడ్నవీస్ పూర్తిగా అర్థం చేసుకున్నాడని రౌత్ పేర్కొన్నారు. శివసేన (యూబీటీ), కాంగ్రెస్ మిత్రపక్షాలు.

కుంభమేళాకు భారీగా భక్తులు

లక్నో: వసంత పంచమిని పురస్కరించుకుని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభ మేళాకు భక్తులు భారీగా తరలివచ్చారు. మూడోది, చివరిది అయిన అమృత్ స్నాన్ కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు త్రివేణీ సంగమానికి చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల వరకు సుమారు 90 లక్షల మంది భక్తులు నదీ స్నానాలు ఆచరించినట్లు అధికారులు వెల్లడించారు. కుంభమేళా ప్రారంభమైన జనవరి 13 నుంచి ఈ నెల ఒకటో తేదీ వరకు 33.61 కోట్ల మందికిపైగా పుణ్యస్నానాలు చేసినట్లు తెలిపారు. ఈ నెల 26వ తేదీ వరకూ కొనసాగే కుంభమేళాకు 50 కోట్ల మంది వచ్చే అవకాశం ఉందని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అంచనా వేస్తోంది. అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేసింది. కాగా, వసంత పంచమి నేపథ్యంలో భక్తులు హరిద్వార్‌లోని హరి కి పౌరీ వద్ద గంగా నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. తెల్లవారుజామునే పెద్ద సంఖ్యలో చేరుకున్న భక్తులు పవిత్ర స్నానం చేసి గంగమ్మకు హారతి సమర్పించారు. ఇదిలా ఉండగా గత నెల 29న మౌని అమావాస్యను పురస్కరించుకుని జరిగిన తొక్కిసలాటలో పెద్దసంఖ్యలో గాయపడడం, చనిపోవడాన్ని దృష్టిలో ఉంచుకుని 2019లో జరిగిన అర్ధకుంభమేళాలో క్రౌడ్ మేనేజ్‌మెంట్‌లో అనుభవమున్న ఇద్దరు ఆశిష్ గోయల్, భానుచంద్ర గోస్వామి అనే ఇద్దరు ఐఏఎస్ అధికారులను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నియమించింది.

వీరంతా తమ అనుభవాన్ని ఉపయోగిస్తూ ఏవిధమైన విషాద ఘటనలు పునరావృతం కాకుండా పర్యవేక్షణలో తలమునకలైపోయారు. అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ భాను భాస్కర్ ఆయా రద్దీ ప్రాంతాలను పర్యవేక్షిస్తు ... భక్తులకు తగు సూచనలు ఇస్తున్నారు. స్నానమాచరించిన భక్తులంతా ఆ ప్రదేశాన్ని వీడి వెళ్లాలని సూచించారు. అక్కడ ఉండరాదని ఆదేశాలు ఇస్తున్నారు. ఘాట్ల వద్ద తినుబండారాలు ఏమీ తినవద్దని సలహా ఇచ్చారు.

విశాలాంధ్ర
హైదరాబాద్

మంచి ఆరోగ్యానికి వైద్యుల సలహాలు పాటించాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహబూబ్‌నగర్ పట్టణంలోని 23వ వార్డు శివశక్తినగర్‌లో నితిన్ హాస్పిటల్, ఎంకె హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శివశక్తి నగర్‌లోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంచి ఆరోగ్యానికి వైద్యుల సలహాలను సూచనలను పాటించాలని ఆయన ప్రజలకు తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన నితిన్ హాస్పిటల్, ఎంకె హాస్పిటల్ సిబ్బందిని, శివశక్తి నగర్ యువజన సంఘం సభ్యులను, నిర్వాహకులు ఎల్లంగారి భరత్‌ను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డా.మహేశ్ కుమార్, డాక్టర్ నితిన్, డాక్టర్ వెంకట్ రవితేజ, డాక్టర్ అక్షిత, డాక్టర్ మహేష్, డాక్టర్ కె.పవన్‌కుమార్, డాక్టర్ జువేరియా అంజుం, డాక్టర్ సునీత, డాక్టర్ హాసిని, నాయకులు టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, ఎల్లంగారి భరత్ కుమార్, ఏర్పుల నాగరాజు, ఫయజ్, శంకర్, ముక్రం, పి.మనోహర్, మోయిజ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మల్కాజిగిరికి చెందిన నరహరికి రూ.60 వేలు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును కొంపల్లిలో వారి నివాసం వద్ద వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం : కొలను

విశాలాంధ్ర - కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్‌లకు చెందిన ప్రజలు ఆదివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డిని ఆయన నివాస కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వివిధ సమస్యలను వివరించి వాటిని పరిష్కరించగలరని కోరారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన కొలను శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, సమస్యలు ఏవైనా వాటి సంబంధిత అధికారులతో మాట్లాడి వీలైనంత అతి త్వరలో వాటికి తగు మార్గం చూపుతామని ఆయన నిర్ధారించారు.

హైడ్రా అధికారులు ఏకపక్షంగా వ్యవహరించడం దురదృష్టకరం : మల్లారెడ్డి

విశాలాంధ్ర - ఘట్‌కేసర్ : హైడ్రా అధికారులు దివ్యానగర్ ప్లాట్స్ అండ్ హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వినతి పరిగణలోకి తీసుకోకుండానే ఏకపక్షంగా వ్యవహరించి సంబంధం లేని గోడలను సహితం కూల్చివేతలు చేయడం దురదృష్టకరమని అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్ల మల్లారెడ్డి అన్నారు. పోచారం మున్సిపాలిటీ కాచవాని సింగారం పరిధి దివ్యానగర్ కమ్యూనిటీ భవనం వద్ద అసోసియేషన్ అధ్యక్షుడు సంపత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ హైడ్రా అధికారులు దివ్యానగర్ ఫేజ్ 6 గేటు తొలిగించడం ఏమిటని, ఒక వర్గం వారి ఫిర్యాదును పరిగణలోకి తీసుకోని కోర్టు ఆదేశాలను సహితం లెక్క చేయకుండా కూల్చివేతం చేయడంపై మండిపడ్డారు. అసోసియేషన్ సభ్యులు ఐక్యతతో సమస్యల పరిష్కారానికి పోరాడాల్సిన అవసరం ఎంతైన ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, ప్లాట్స్ అండ్ హౌస్ ఓనర్స్ పాల్గొన్నారు.

సగం ఎంపీ సీట్లు ఇచ్చిన తెలంగాణకు బడ్జెట్‌లో అన్యాయం

విశాలాంధ్ర-బషీర్ బాగ్: గత పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి సగం ఎంపీ సీట్లు బిజెపికి అందించినప్పటికీ నరేంద్ర మోడీ ప్రభుత్వం మాత్రం కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిందని తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర రవికుమార్ విమర్శించారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన ప్రతిసారి పెద్దపెద్ద హామీలు ఇచ్చే కేంద్ర మంత్రుల మాటలు నీటి మూటలైనని ఇది కేంద్ర బడ్జెట్ ద్వారా మరోసారి రుజువైందని మండిపడ్డారు. పేద వర్గాలను పూర్తిగా ఈ ప్రభుత్వం విస్మరించిందని, పేదల సంక్షేమానికి నిర్దిష్టమైన ఎలాంటి కార్యక్రమాలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఇది కార్పొరేట్ అనుకూల బడ్జెట్ అని ధ్వజమెత్తారు. కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు రావాల్సిన వాటా గురించి ఇక్కడి బిజెపి ఎంపీలు ప్రశ్నించకపోవడం వల్లనే నరేంద్ర మోడీ ప్రభుత్వం రాష్ట్రం పట్ల తీవ్ర వివక్షత ప్రదర్శించారని దుయ్యబట్టారు. తెలంగాణ నుంచి 40000 కోట్ల జీఎస్టీ చెల్లిస్తున్నప్పటికీ నిధులు దేనికి కేటాయించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి సంబంధించి పసుపు బోర్డుతో పాటు వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించిన పథకాలకు నిధులు కేటాయించకపోవడం దౌర్భాగ్యం అన్నారు. బడ్జెట్‌లో రైతులకు తీవ్ర అన్యాయం చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

బాలికల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

మంత్రి శ్రీధర్‌బాబు, పీఏసీ చైర్మన్ ఆరెకపూడి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గచ్చిబౌలి స్టేడియంలో సేవా భారతి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన 5కె, 10కె, 21కె. రన్ ఫర్ ఏ గర్ల్ చైల్డ్ కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ ఈరోజు సేవా భారతి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో 5కె, 10కె, 21కె రన్ ఫర్ ఏ గర్ల్ చైల్డ్ కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా గొప్ప విషయం అని, పెద్ద సంఖ్యలో పాల్గొనడం అభినందనీయం అని, బాలికలను సంరక్షించాలని, బాలికల రక్షణే ధ్యేయంగా ప్రతి ఒక్కరు పనిచేయాలని, బాలికల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మహిళ సాధికారికత సాధించాలని, మహిళల పట్ల వివక్ష నశించాలని, మహిళలు అన్ని రంగాలలో సమానం అని నిరూపిస్తున్నారు అని, మహిళలు స్వశక్తితో ఎదగాలని, మహిళలు ఆర్థిక స్వాలంబన సాధించాలని తెలియచేశారు. ఇలాంటి అవగహన కార్యక్రమాలను నిర్వహించిన సేవా భారతి సభ్యులను, ఈ రన్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ అభినదిస్తున్నాను అని తెలియచేశారు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో శారీరక శ్రమ ఎంతో అవసరం అని గుర్తు చేయడం ఈ రన్ ఎంతగానో తోడ్పడుతుంది అని ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తుంది అని అన్నారు. వృద్దులు, యువత, చిన్న పిల్లలు పాల్గొనడం ఎంతో ఆనందయాకం అని అన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల ఎంతో శ్రద్ధ వహించాలని, శారీరక శ్రమ వలన మానసిక ఉల్లాసం, ప్రశాంతత చేకూరుతుంది అని అన్నారు. మారిన జీవన శైలిలో ప్రతి ఒక్కరు తప్పనిసరిగా వ్యాయమం చేయాలని, ఈ రన్ ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. ఇది ఒక మంచి శుభ పరిణామం అని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో సివిల్స్ కోచింగ్ సెంటర్ నిర్వహకురాలు బాల లత, సేవా భారతి నిర్వాహకులు ఉష, సునీత తదితరులు పాల్గొన్నారు.

భారతదేశ సామాజిక పురోగతి, అభివృద్ధికి

ఉమ్మడి పౌర స్మృతి నైతిక ఆవశ్యకత

మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఉజ్వల భవిష్యత్తు వైపు పయనిస్తున్న భారత దేశ సామాజిక పురోగతి, అభివృద్ధికి ఉమ్మడి పౌర స్మృతి నైతిక ఆవశ్యకత ఉన్నదని, ఉత్తరాఖండ్ రాష్ట్రం దేశంలో మొదటి రాష్ట్రంగా అమలు చేస్తుందని, తెలంగాణ రాష్ట్రం కూడా ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేసి దేశంలో రెండవ రాష్ట్రంగా నిలవాలని మహారాష్ట్ర మాజీ గవర్నర్ సిహెచ్.విద్యాసాగర్ రావు ఆకాంక్షించారు. హైదరాబాద్, ఉస్మానియా యూనివర్సిటీ, పిజిఆర్ ఆర్సిఈడి, సెనెటరీ సెమినార్ హాల్‌లో ఆదివారం జరిగిన "విజన్ 2047 ప్రొఫెషనల్స్ ఫౌండేషన్" ప్రారంభసభలో మహారాష్ట్ర మాజీ గవర్నర్ సిహెచ్. విద్యాసాగర్ రావు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు డా.కె.లక్ష్మణ్ ముఖ్య తిథులుగా, కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రో. బట్టు సత్యనారాయణ గౌరవ అతిథిగా, బీజేపీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డా.ఎన్.గౌతమ్‌రావు, ప్రముఖ విద్యావేత్తలు ప్రో.సి.విష్ణు వర్ధన్ రెడ్డి, కటకం మధుకర్, సామాజికవేత్త కొండా లక్ష్మీకాంత్ రెడ్డిలు ప్రత్యేక అతిథులుగా పాల్గొనగా "విజన్ 2047 ప్రొఫెషనల్స్ ఫౌండేషన్" ప్రధాన కార్యదర్శి డా.పుట్ట పాండు రంగయ్య స్వాగతం పలుకగా, అధ్యక్షులు డా.జి. హరిచరణ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిహెచ్.విద్యాసాగర్‌రావు "విజన్ 2047 ప్రొఫెషనల్స్ ఫౌండేషన్"ను ప్రారంభించి మాట్లాడుతూ అన్ని మత సమాజాలకు వర్తించే విధంగా మొత్తం దేశానికి ఒకే చట్టంగా యూనిఫామ్ సివిల్ కోడ్ రూపొందించబడిందని, ఇది జాతీయ సమైక్యత, లౌకికవాదాన్ని ప్రోత్సహిస్తుందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో భారత దేశం దూసుకపోతుందని, అభివృద్ధి, సంక్షేమంతోపాటు అన్ని రంగాల్లో ప్రపంచ అగ్ర దేశాలతో పోటీపడుతుందని ఇది ప్రధాని మోదీ విజయం అని తెలిపారు. మోదీ దేశంలో పెద్ద మొత్తంలో ఉన్న అవినీతిని అంతం చేసి, కఠినమైన, శుభ్రమైన పాలనా కొనసాగించడం వల్లనే ఇది సాధ్యమైందని అయన పేర్కొన్నారు. ప్రపంచంలోని అతిపెద్ద రాజ్యాంగం, ప్రజాస్వామ్య దేశంగా భారత దేశం నేటికీ వర్ధిల్లడానికి కారణం ఈ దేశ ప్రజల ఐక్యత అని, ఇప్పటివరకు భారత దేశం ప్రజలు ఏ దేశంలోనూ శరణార్థులుగా లేరని, జాతీయ సమైక్యతనే ఇందుకు కారణం అని తెలిపారు. అమెరికా, చైనా కంటే పెద్ద సంఖ్యలో భారత్‌లో ఉన్న యువత ఉందని ప్రధాని మోదీ గుర్తించి యువ శక్తిని దేశాభివృద్ధికి వినియోగించుకోవడానికి పాత బూజు పట్టిన విద్యా విధానాన్ని రద్దు చేసి, నైపుణ్యాభివృద్ధి పేరుతో నూతన విద్యావిధానాన్ని తీసుకవచ్చి అమలు చేయడం వల్ల నైపుణ్యాత సాధించిన యువతకు నేడు దేశ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడుతున్నారని అన్నారు. వైద్యులు, ప్రొఫెసర్‌లు, మేధావులతో ఏర్పాటు చేసిన "విజన్ 2047 ప్రొఫెషనల్స్ ఫౌండేషన్" స్వచ్ఛంద సంస్థ అవినీతి నిర్మూలన, విద్య, ఆరోగ్య నాణ్యత కోసం కృషి చేస్తూ, శక్తివంతమైన భారతీయ సంస్కృతిని పరిరక్షించేందుకు కృషి చేయాలనీ సిహెచ్. విద్యాసాగర్ రావు కోరారు. డా.కె.లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉన్నత విద్యావంతులు "విజన్ 2047 ప్రొఫెషనల్స్ ఫౌండేషన్" స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేయడం అభినందనీయం అని అన్నారు.

అభివృద్ధి చెందిన దేశంగా భారతదేశం నిలవాలని ప్రధాని మోదీ కలలను వాస్తవంలోకి తీసుకరావడానికి విక్షిత్ భారత్ 2047 అనే డైనమిక్ వేదికపై "విజన్ 2047 ప్రొఫెషనల్స్ ఫౌండేషన్" వంటి స్వచ్ఛంద సంస్థలు, ప్రజలందరూ భాగస్వాములై సమ్మిళిత, ప్రగతిశీల భారతదేశాన్ని నిర్మించడానికి సమిష్టి కృషి చేయాలనీ డా.కె.లక్ష్మణ్ కోరారు. ప్రో.బట్టు సత్యనారాయణ, ఫౌండేషన్ ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాస్ రెడ్డి, డా.బండి సాయన్న, కార్యనిర్వాహక కార్యదర్శులు డా.ఉమా శంకర్, ఎన్.విజేందర్ రెడ్డి, డా,వీణ దిగ్గీకర్, ప్రో.జి.విజయ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చండి

కమిషనర్ ఇలంబర్తికి మున్సిపల్ సహకార మజ్దూర్ యూనియన్ వినతి

విశాలాంధ్ర - హైదరాబాద్ : దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జిహెచ్ఎంసి కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కరించి, న్యాయ బద్ధమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఐఎన్టీయూసీ గుర్తింపు పొందిన మున్సిపల్ సహకార మజ్దూర్ యూనియన్ జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జిహెచ్ఎం సిలోని యూనియన్లకు గుర్తింపు ఎన్నికల నిర్వహణ కోసం ఇప్పటికే కార్మిక శాఖ నుంచి అందిన ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించాలని కోరారు. దీంతో పాటు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల ప్రమోషన్ల విషయంపై కూడా ప్రత్యేక చొరవ చూపి వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. దుమ్ము ధూళి, రసాయనాల స్ప్రే వంటి ప్రమాదకరమైన వాతావరణంలో విధులు నిర్వహిస్తున్న జిహెచ్ఎంసి పర్మినెంట్ ఉద్యోగులకు ఆరోగ్య భీమాను రూ.15 లక్షలకు పరిమితిగా పెంచాలని కోరారు. చాలా ఏళ్లుగా జిహెచ్ఎంసినే నమ్ముకొని విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్స్ ఉద్యోగుల జీతాల పెంపును కూడా పరిశీలిం చాలని ఆయన కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. జిహెచ్ఎంసిలోకి డిప్యూటేషన్‌పై వచ్చిన వివిధ విభాగాలు చెందిన అధికారుల్లో చాలామందికి మూడేళ్ల డిప్యూటేషన్ గడువు ముగిసిన ఇంకా ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారని, వారిని గుర్తించి వెంటనే వారి మాతృ శాఖకు పంపించాలని ఆదిల్ షరీఫ్ కమిషనర్‌ని కోరగా ఇందుకు సానుకూలంగా స్పందించిన కమిషనర్ యూనియన్ కార్మికులు ఉద్యోగుల డిమాండ్లు అన్నింటిని కూడా పరిశీలించి సాధ్యమైనంత వరకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ తెలిపారు. ఐఎన్టీయూసీ ఆల్ ఇండియా ప్రెసిడెంట్, రాజ్యసభ మాజీ సభ్యులు జి.సంజీవ రెడ్డి ఆదేశాల మేరకు కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించిన వారిలో స్టేట్ ఐఎన్టీయూసీ జనరల్ సెక్రెటరీ ఆర్.డి చంద్రశేఖర్, జనరల్ సెక్రెటరీ విజయకుమార్ యాదవ్, ఉపాధ్యక్షులు భాస్కర్ రెడ్డి, అడిషనల్ జనరల్ సెక్రెటరీ కే.శివకుమార్ తదితరులున్నారు.

నేడు జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు : మహేష్ కుమార్ గౌడ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష చూపి నిధుల కేటాయింపులో అన్యాయం చేసినందుకు నిరసనగా సోమవారం జిల్లా కేంద్రాలలో భారీ నిరసన కార్యక్రమాలు చేపట్టాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఎమ్మెల్సీ పిలుపునిచ్చారు. ఈ విషయమై ఆయన ఒక ప్రకటన చేస్తూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణకు చేసిన అన్యాయం పైన గ్రామస్థాయి నుంచి ఢిల్లీ వరకు పోరాటం చేస్తామని అన్నారు. ఈ నిరసన కార్యక్రమాలల జిల్లాలోని ఎంపీలు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్‌లు, పోటీ చేసిన అభ్యర్థులు, అనుబంధ సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని ఆయన అన్నారు.

ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ దిష్టిబొమ్మలను దగ్ధం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: హైదరాబాద్ రాంనగర్‌లో తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం 2025 నూతన క్యాలెండర్ అఖిల భారత యాదవ సంఘం జాతీయ కౌన్సిల్ మెంబర్ సందన వేణి మహేంద్రనాథ్ యాదవ్ సంఘం తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ రాష్ట్ర సలహాదారి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ తెలంగాణ రాష్ట్ర పంచాయతీ సర్పంచుల సంఘం వ్యవస్థాపకులు సోధాని బుమన్న యాదవ్ ఆధ్వర్యంలో రాంనగర్‌లో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ నివాసంలో ఆయన చేతుల మీదుగా ఘనంగా క్యాలెండర్ ఆవిష్కరణ చేసి అనంతరం గొర్రె కాపరుల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం దృష్టికి గొల్ల కురుమలకు సమస్యలు తీసుకువెళ్లి తగిన న్యాయం చేయాలని వినతిపత్రం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 19 శాతం ఉన్న గొల్ల కురుమలకు రాజకీయ రంగంలో రిజర్వేషన్లు ఇవ్వాలని ఎమ్మెల్యే ఎంపీ ఎమ్మెల్సీ కార్పొరేషన్ చైర్మన్లు నామినేటెడ్ పోస్టులు సర్పంచులు ఎంపీటీసీలు జడ్పిటిసిలు మల్లన్న దేవాలయాలకు చైర్మన్లుగా నియమించాలని గొర్రె కాపరులకు ప్రమాదవశాస్తూ మరణిస్తే జీవిత బీమా ద్వారా కుటుంబానికి 10 లక్షలు ఇవ్వాలని 80శాతం సబ్సిడీ ద్వారా ఎన్సీడీసీ నాబార్డ్ ద్వారా ప్రతి బడ్జెట్లో 5000 కోట్లు మంజూరు చేయాలని మినీ పాల డైరీలు ఇవ్వాలని పిడుగుపాటుకు చనిపోయిన గొర్రెలకు ఇన్సూరెన్స్ ద్వారా నష్టపరిహారం ప్రతి జీవానికి 5000 అందించాలని చదువుకున్న గొల్ల కురుమ యువతి యువకులకు పశుసంవర్ధక శాఖలో ఉద్యోగ అవకాశాలు కలిపించలని అడవిలో పాడి పశువులు మేపుకొనుటకు అడవిలో హక్కును కల్పించాలని ప్రతి మండలంలో వారసంత ఏర్పాటు చేసి కమ్యూనిటీ హాల్లకి నిధులుకేటాయించాలని ప్రతి జిల్లాకు ఒక మాంస విక్రియ మార్కెట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరడం జరిగింది అన్నారు ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షులు అందెల కుమార్ యాదవ్ బెల్లంపల్లి నియోజకవర్గం అధ్యక్షులు బోయిని తిరుపతి యాదవ్ బెల్లంపల్లి మండల మంచిర్యాల జిల్లా నాయకులు పాయవేని మల్లేష్ యాదవ్ మహేష్ యాదవ్ గోపాల్ నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్లో హైదరాబాదును విస్మరించడం దారుణం

విశాలాంధ్ర - హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంపై మొదటి నుండి నిర్లక్ష్యానికి గురి చేస్తుందని జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధిలో భాగస్వామ్యం కాక పోయినా ప్రజల ఆకాంక్ష మేరకు ప్రజాపాలన ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి ఎంతో మేలు చేస్తుదని, ముఖ్యంగా హైదరాబాద్ అభివృద్ధి ప్రజా పాలన ప్రభుత్వం 7032 కోట్ల రూపాయలతో అంతర్జాతీయ నగరంగా దీటుగా అభివృద్ధి చేసేందుకు ముందుకు పోతుందని, హైదరాబాద్ అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని తప్పు పట్టారు. ఫెడరల్ స్ఫూర్తిగా పరిపాలన చేస్తున్నట్లు ప్రధాని మోడీ చెపుతున్నారు గానీ రాష్ట్రం అభివృద్ధిలో తాను మాత్రం ఫెడరల్ స్ఫూర్తినీ కొనసాగించడం లేదన్నారు. గత పార్లమెంటు ఎన్నికల సందర్భంగా హామీలు ఇచ్చిన మోడీకి గుర్తుకు రాడం లేదా అని ప్రశ్నించారు. మెట్రో రైలు అభివృద్ధి నగరాభివృద్ధికి నిధులు ఇవ్వకపోడం దురదృష్టకరమన్నారు. దేశం అంతా బీహార్, ఆంధ్రప్రదేశ్ కాదని మరో 26 రాష్ట్రాల్లో ప్రజలు ఉన్నారనే భావన కేంద్ర మంత్రికి గానీ ప్రధాన మంత్రి గానీ లేకుండా పోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు మరొక సారి ఆలోచించి రాష్ట్రానికి నిధులు మంజూరు చేయాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కోరారు.

ఘనంగా మేర భారత్ మహాన్

విశాలాంధ్ర-బషీర్ బాగ్: కళాకార్ తెలుగు టీవీ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ సందర్భంగా 111 స్టూడెంట్స్ 76 నిమిషాల్లో సర్టిఫికెట్స్ ప్రదానం. మేర భారత్ మహాన్ కార్యక్రమం సౌత్ ఇండియన్ బుక్ అఫ్ వరల్డ్ రికార్డ్స్ నమోదు చేశారు. క్లాసికల్, వెస్ట్రెన్, దేశభక్తి, జానపద నృత్యాలతో చిన్నారులు అలరించారు. ముఖ్యఅతిథులుగా ఆడిటిషినల్ డిసిపి రాందాస్ తేజవత్, న్యాయమూర్తులు బూర్గుల మధుసూదన్, సరస్వతి ఉపసకులు దైవజ్ఞ శర్మ, డా.చిత్తోజి రాజేష్, సెలబ్రిటీ మేకప్ ఆర్టిస్ట్, కళాకార్ తెలుగు టీవీ అధినేత ప్రోగ్రాం ఆర్గనైజర్ డా.సిరాజ్ గురువులకు చిన్నారులకు సౌత్ ఇండియన్ బుక్ అఫ్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్స్, మెమంటోలతో సన్మానించారు. గురువులు డా.మధాను దివ్య రెడ్డి, సిహెచ్ జ్యోతిరెడ్డి, కల్పన నారెడ్లగారు, డా.యశ్వంత్, పవన్ కళ్యాణ్, లావణ్య, బన్ని జాక్సన్, వడ్ల ప్రశాంత్, సిద్ధు, సంజీవని, ఇండియన్ అచీవర్ అవార్డులతో పాటు సౌత్ ఇండియన్ బుక్ అఫ్ వరల్డ్ రికార్డ్స్‌లతో సత్కరించారు. వారితో పాటు కళ్యాణ్ సుమిత్ర అస్మా సుల్తానని ఇండియన్ అచీవర్ అవార్డు, సౌత్ ఇండియన్ బుక్ అఫ్ వరల్డ్ రికార్డ్స్‌తో సన్మానించారు. డా. సిరాజ్ ప్రోగ్రాం విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదలు తెలిపారు.

కులగణన సర్వే దేశానికి ఆదర్శం : చనగాని దయాకర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే దేశానికి ఆదర్శం అని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ అన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బీసీ కులగణన చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కులగణన చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో బీసీ కులాలకు పెద్ద పీట ఉంటుందని పేర్కొన్నారు. బీసీ కులగణన పారదర్శంగా జరిగిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు బీసీలకు న్యాయం చేయడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ సర్వేతో అన్ని కులాలకు న్యాయం జరుగుతుందని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన సర్వే చేసిందని, ఎక్కడ లోపాలు లేకుండా చేసిందని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 96 శాతం మంది సర్వేలో పాల్గొన్నారని, బీసీలకు అవకాశాలు ఇవ్వని పార్టీలు ఇవాళ బీఆరెస్, బీజేపీ పార్ట్ లకు బీసీల గురించి మాట్లాడే అర్హత లేదని దుయ్యబట్టారు. స్థానిక సంస్థల ఎన్నికాల్లో బీసీ మంచి అవకాశాలు రాబోతున్నాయన్నారు. రాహుల్ గాంధీ బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాటం చేస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు అవకాశాలు కలిపించిందని, కులగణన పై విష ప్రచారాలు తిప్పి కొడుతామన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం తగినన్నినిధులుకేటాయించక దగా చేస్తున్నదని భారతీయఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని అందుకే గత పదేళ్లుగా ఈ పథకానికి నిధులలోకోత పెడుతున్నదన్నారు. దేశ వ్యాప్తంగా కోట్లాది మంది వ్యవసాయ కార్మికులకు ఉపాధి కలిగించాలని, సంవత్సరంలో 200 రోజులు పనులు కలిగిం చాలని, రోజుకు 700 రూపాయల కూలి ఇవ్వాలని, అందుకు 3 లక్షల కోట్ల రూపాయలు బడ్జెట్లో కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘాలు చేసిన డిమాండ్‌ను పెడచెవిన పెట్టి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ బడ్జెట్లో కేవలం 86 వేల కోట్లు మాత్రమే కేటాయించడం, ఇందులో నుండి గత సంవత్సరానికి సంబంధించిన బకాయిలు కొన్ని వేల కోట్లు సర్దుబాటు చేస్తే మిగిలిన దానితో దేశ వ్యాప్తంగా ఉపాధి కూలీలకు పనులు ఎలా కల్పిస్తారని ఆయన ప్రశ్నించారు. కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసే విధానాన్ని విడనాడి రెక్కాడితే కానీ డొక్కాడని శ్రమజీవులైన ఉపాధి కార్మికులకు, వ్యవసాయ కూలీలకు పనులు కల్పించాలన్నారు. ఉపాధి లేక మరోవైపు ధరలు పెరిగి కూలీలు దుర్భరంగా జీవిస్తున్నారని ప్రభుత్వం బడ్జెట్లో సవరణ చేసి నిధులను తగిన విధంగా పెంచాలని మరియు పట్టణ కార్మికులకు ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ ఈనెల 5న ధర్నాలు నిర్వహించాలని రైతు, కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో పాల్గొని జయప్రదం చేయాలని వెంకట్రాములు విజ్ఞప్తి చేశారు.

కొంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి చేయాలి : కొలను

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : కొంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హన్మంత్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా కృష్ణరెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆదివారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కొలను హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని నూతన కమిషనర్‌కు సూచించారు. అదే విధంగా అస్తవ్యస్తంగా ఉన్న పారిశుధ్య పరిస్థితులను కొలిక్కి తీసుకొచ్చేందుకు పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. ఎక్కడా విమర్శలకు, వివాదాలకు తావు లేకుండా పని చేయాలని తెలియజేశారు. అనంతరం కొలను హన్మంత్ కమిషనర్ కృష్ణారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేసారు.

బాలాజీ లేఔట్ సమస్యలను పరిష్కరిస్తా : కూన

విశాలాంధ్ర-దుండిగల్ : గాజులరామారం బాలాజీ లేఔట్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం 125 డివిజన్ పరిధి బాలాజీ లేఔట్ అపార్ట్మెంట్ ప్రజలు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్‌ని మర్యాదపూర్వకంగా కలిసి వారి లేఔట్‌లో ఉన్న సమస్యలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో వివిధ కాలనీల సమస్యలను పరిష్కరించడానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. అనుక్షణం ప్రజాహితం కోసం ప్రతిక్షణం ప్రజాశ్రేయస్సు కోసం పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, అంజన్న, వెంకట్, శ్రీనివాసులు, వేణు, రాజు, సుకుమార్, విజయరెడ్డి, కిషోర్ కుమార్, ప్రదీప్, తీర్మాల్, చైతన్య, ఇంద్రాసేనరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహపూరితమైన పర్యావరణ వ్యవస్థ సమ్మిట్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: ఇంటర్నేషనల్ స్టార్ట్ అప్ ఫౌండేషన్ (ఐఎస్ఎఫ్) హైదరాబాద్‌లోని ఐటిసి కోహినూర్‌లో సమ్మిట్‌ను నిర్వహించింది. ఈ సమ్మిట్‌లో గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ల నుండి ప్రపంచ నాయకులు, ప్రభుత్వ ప్రతినిధులు, పరిశ్రమ మార్గదర్శకులు పాల్గొనటంతో పాటుగా కార్పొరేట్ ఆవిష్కరణ, వ్యవస్థాపకత, అంతర్జాతీయ సహకారం గురించి చర్చించారు. మంత్రి డి.శ్రీధర్‌బాబు, జె.ఎ.చౌదరి, జెన్నిఫర్ లార్సన్, మధుసూదన్ సాయి గ్లోబల్ హ్యూమానిటేరియన్ మిషన్ వ్యవస్థాపకుడు సద్గురు మధుసూదన్ సాయి పాల్గొన్న అతిధులలో వున్నారు. మార్గదర్శకత్వం, మార్కెట్ యాక్సెస్ నిధులను అందించడం ద్వారా జీసీసీలు స్టార్టప్ వృద్ధికి ఉత్ప్రేరకంగా ఎలా పనిచేస్తాయో కూడా ఇది చర్చించింది, తద్వారా అభివృద్ధి చెందుతున్న వెంచర్లకు డైనమిక్ పర్యావరణ వ్యవస్థను పెంపొందించవచ్చన్నారు. జీసీసీలకు ప్రవేశ అడ్డంకులను తొలగించడం, స్టార్టప్‌లు, విశ్వవిద్యాలయాలతో అనుబంధాన్ని మరింతగా పెంచడం, జీసీసీ-ఆధారిత ఆవిష్కరణలకు ప్రధాన కేంద్రంగా హైదరాబాద్‌ను నిలపాలనే లక్ష్యంతో రిస్క్ తగ్గించటం కోసం సాంకేతికత పై ఆధారపడటం, అధిక-ప్రభావ రంగాలలో స్టార్టప్‌ల విజయాన్ని వేగవంతం చేయడానికి వారి ప్రపంచ నైపుణ్యాన్ని ఉపయోగించడం అనే లక్ష్యంతో రిస్క్ తగ్గింపు కోసం సాంకేతికతను ఉపయోగించడంపై దృష్టి సారించిన రౌండ్‌టేబుల్ చర్చలను ఈ సమ్మిట్ నిర్వహించింది. మంత్రి డి.శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రగతిశీల విధానాలు, అత్యాధునిక మౌలిక సదుపాయాలు, అభివృద్ధి చెందుతున్న ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థ మరియు శిక్షణ పొందిన మానవశక్తి లభ్యతతో జీసీసీల కోసం ప్రపంచ స్థాయి కేంద్రాన్ని స్థాపించడానికి తెలంగాణ ప్రభుత్వం నిబద్ధతను వెల్లడించారు. ఆవిష్కరణలను నడిపించే, డిజిటల్ పరివర్తనను వేగవంతం చేసే అనుకూలమైన విధాన కార్యాచరణతో రాష్ట్ర ఆర్థిక వృద్ధికి దోహదపడే వాతావరణాన్ని పెంపొందించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని ఆయన నొక్కి చెప్పారు.

పోలీస్ శాఖలో వెల్లివిరిసిన క్రీడోల్లాసం

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖలో క్రీడల ఉల్లాసం వెల్లివిరుస్తుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం చాలాకాలం తర్వాత పోలీస్ శాఖలో రాష్ట్రస్థాయి మూడవ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌ను దాదాపు ఐదు రోజులు పాటు కరీంనగర్‌లో నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రస్థాయిలో స్పోర్ట్స్ మీట్ నిర్వహించడం ఇది మూడోసారి కాగా మొదటగా 2015 సంవత్సరంలో అదిలాబాద్ జిల్లాలోనూ, 2017లో వరంగల్ జిల్లాలోని నిర్వహించారు. దాదాపు ఏడు సంవత్సరాల తర్వాత పోలీస్ శాఖలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. వీటిలో ఎంపికైన వారికి ప్రత్యేకంగా మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చి జాతీయస్థాయిలో అత్యధిక మెడల్స్ సంపాదించాలని రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ యోచిస్తున్నారు.గత ఏడు సంవత్సరాలుగా రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించినందున ప్రత్యేక శ్రద్ధతో డాక్టర్ జితేందర్ ఈ పోటీలను నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని యూనిట్ల క్రీడాకారులు పోటీలలో పాల్గొని పోలీస్ శాఖలో నూతన ఉత్తేజాన్ని కలిగించారు. ఇప్పటికే క్రీడలలో మెడల్స్ గెలుస్తున్నప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ శాఖలో ఉన్న ప్రతిభావంతులను వెలికి తీసి ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ద్వారా జాతీయ స్థాయిలో మరింతగా రాణించగలుగుతారని డిజిపి అభిప్రాయపడుతున్నారు. అదేవిధంగా, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను కనబరిచి, స్పెషల్ పోలీసు బెటాలియన్‌లో డీఎస్పీలుగా ఉన్న క్రికెటర్ సిరాజ్, మహిళా బాక్సర్ నికత్ జరీన్‌ల పర్యవేక్షణలో కోచింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిజిపి ప్రయత్నిస్తున్నారు. చురుకుదనం, నిజాయితీ, సంఘీభావం వంటి లక్ష్యాలతో కూడిన ప్రత్యేక లోగోను తెలంగాణ పోలీస్ శాఖ సిద్ధం చేసి దాదాపు 28 విభాగాలలో క్రీడాకారులకు శిక్షణ ఇవ్వాలని పోలీస్ అధికారులు నిర్ణయించారు. సైక్లింగ్, అథ్లెటిక్స్, యోగా, క్రాస్ కంట్రీ ,స్విమ్మింగ్, రెజ్లింగ్ బాస్కెట్ బాల్, బాడీ బిల్డింగ్, వాటర్ స్పోర్ట్స్, జూడో, టైక్వాండో, కబడ్డీ వాలీబాల్, టేబుల్ టెన్నిస్, ఆర్మ్ రెజ్లింగ్, హ్యాండ్ బాల్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, బాక్సింగ్, కరాటే, హాకీ, బ్యాడ్మింటన్, కోకో ఫుట్ బాల్, జిమ్నాస్టిక్స్, ఆర్చరీ, లాన్ టెన్నిస్, టగ్ ఆఫ్ వార్ వంటి విభాగాలలో జాతీయస్థాయిలో రాణించేందుకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి పోలీస్ సిబ్బందిని అధికారులను సంసిద్ధం చేసేందుకు సంబంధిత అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ విభాగంలోని పోటీల కోసం క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జాతీయ స్థాయిలో మొదటి బహుమతి తెచ్చుకున్న వారికి మూడు లక్షల నగదు మూడు ఇంక్రిమెంట్లు, ద్వితీయ బహుమతికి రెండు లక్షలు రెండు ఇంక్రిమెంట్లు, జాతీయ స్థాయిలో తృతీయ బహుమతి లక్ష రూపాయలు ఒక ఇంక్రిమెంటు ఇవ్వడం ద్వారా వీరిలో క్రీడల పట్ల మరింత ఉత్సాహాన్ని కలిగించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొన్న 20 జట్లలో 2380 మంది క్రీడాకారులు పాల్గొనగా అందులో 296 మంది మహిళలు, 12 మంది ఐపీఎస్ అధికారులు కూడా ఉన్నారు . 28 క్రీడ అంశాల్లో 236 బంగారు పతకాలు, 236 వెండి పతకాలు, 396 కాంస్య పతకాలు ఉన్నాయి. ఓరల్ ఛాంపియన్గా హైదరాబాద్ కమిషనరేట్ , రన్నర్ గాటీజీఎస్పీ రేంజ్ వన్ నిలిచింది. టగ్ ఆఫ్ వార్‌లో టీజీఎస్పి రేంజ్ -2 టీజీఎస్పీ రేంజ్ వన్ రన్నర్ గాను స్విమ్మింగ్లో ఆర్ బి వి ఆర్ ఆర్ విన్నర్ కాగా కాళేశ్వరం జోన్ రన్నర్ గాను ఆర్చరీలో విన్నర్ కాగా వరంగల్ కమిషనరేట్ బాక్సింగ్ లో హైదరాబాద్ కమిషనరేట్ విన్నర్ కాగా టీజీ రేంజ్ 1 రన్నర్ గాను నిలిచాయి. ఓవరాల్ అథ్లెటిక్ ఛాంపియన్షిప్ ను రాచకొండ కమిషనరేట్ గెలుచుకోగా కోకో లో టీజీఎస్పీ రేంజ్ వన్ విన్నర్ గాను రేంజ్ టు రన్నర్ గాను మూడో స్థానంలో రాజన్న సిరిసిల్ల జోన్ 3 నిలువగా కబడ్డీ మహిళల పోటీల్లో రాచకొండ జోన్ విన్నర్ గాను యాదాద్రి జోన్ రన్నర్ గాను ఫుట్ బాల్ లో టీజీఎస్పీ ఒకటి విన్నర్ గాను హైదరాబాద్ కమిషనరేట్ రన్నర్ గాను నిలిచాయి. ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉల్లాసంగా ఉన్న క్రీడాకారులు జాతీయస్థాయిలో తమ సత్తా చాటుకునేందుకు ప్రత్యక్ష శిక్షణ త్వరలో పొందనున్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్

విశాలాంధ్ర-దుండిగల్: స్వచ్ఛత పై దృష్టి పెట్టి మున్సిపాలిటీని పరిశుభ్రమైన ప్రాంతంగా తీర్చిదిద్దటానికి ప్రజలందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ పేర్కొన్నారు. ఆదివారం నియోజకవర్గం దుండిగల్ మున్సిపల్ పరిధిలో వివిధ కాలనీల నందు నిర్వహించిన పారిశుధ్య కార్యక్రమాలు, పలు వార్డుల వద్ద స్వచ్ఛ వాహనాలను కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ పరిశీలించారు. అనంతరం ఆయన కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ మాట్లాడుతూ ప్రతి ఇంటిని సంప్రదించి చెత్తను తప్పనిసరిగా సేకరించాలని సూచించారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న గార్బేజిను, ప్లాస్టిక్‌ను నిరంతరం తీసివేసి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సింగల్ యూస్ ప్లాస్టిక్ అనేది వాడకుండా ఉండాలని ప్రతి దుకాణాల వద్ద, హెూటల్స్‌లలో సింగల్ యూస్ ప్లాస్టిక్ వాడకుండా నిషేధించాల వాటిపైన స్పెషల్ టీమ్‌లను బదిలీ చేసి జనాలకు అవగాహన కల్పించాలని, ప్రతిరోజు ఉదయాన్నే జాతీయ రహదారి నందు స్లీపింగ్ మిషన్స్‌తో రోడ్‌కి ఇరువైపులా ఉన్నటువంటి మట్టిని పరిశుభ్రపరచాలని వెల్లడించారు. అదేవిధంగా పారిశుద్ధ సిబ్బందికి పిపిటి కిట్లు, చేతికి గ్లౌజులు, ముఖానికి మాస్క్ కాళ్ళకి షూ, రేడియం స్టిక్కర్ జాకెట్లును తప్పనిసరిగా ధరించాలని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది అందరూ ఉదయం 5 గంటల వరకు డ్యూటీలకు హాజరు అవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ సాత్విక్, సానిటరీ ఇన్స్పెక్టర్ రామచందర్, జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కును పంపిణీ చేసిన మాజీ మేయర్

విశాలాంధ్ర- మేడిపల్లి : పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 26వ డివిజన్ పరిధిలో ముఖ్యమంత్రి సహాయ నిధి మంజురైన చెక్కును లబ్ధిదారుడు బి.రాంరెడ్డికి రూ. 20,500 చెక్కును స్థానిక మాజీ కార్పొరేటర్ పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డి, మాజీ మేయర్ అమర్ సింగ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అనేక మంది ప్రయోజనం పొందుతున్నారని తెలిపారు. లబ్ధిదారుడు తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, పీర్జాదిగూడ మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్, మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, 26వ డివిజన్ మాజీ కార్పొరేటర్ పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు యాసారం మహేష్, బుచ్చిబాబు కాలనీ వాసులు పాల్గొన్నారు.

తెలంగాణకు బడ్జెట్లో అన్యాయంపై భారీ నిరసన

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: తెలంగాణ రాష్ట్రానికి మొండిచేయి చూపిన కేంద్రంపై తెలంగాణ కాంగ్రెస్ దళం ఆగ్రహం వ్యక్తం చేసింది. టీపీసీసీ ఆధ్వర్యంలో చేపట్టిన భారీ నిరసన కార్యక్రమనికి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి నియోజవర్గం నుండి కాంగ్రెస్ సైన్యం కదిలివెళ్లారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష చూపి నిధుల కేటాయింపులో అన్యాయం చేసినందుకు నిరసనగా ఆదివారం ట్యాంక్ బ్యాండ్‌పై ఉన్న అంబేత్కర్ విగ్రహం వద్ద టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎమ్మెల్యేలు, నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్, బొంతు శ్రీదే, నియోజకవర్గ నాయకులతో కలిసి శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై నిరసన

విశాలాంధ్ర - కాప్రా : కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక కర్షగా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆల్ ట్రేడ్ యూనియన్ సదస్సు సీఐటీయూ కార్యాలయం వద్ద సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఏ అశోక్ అధ్యక్షతన నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.ఈశ్వర్రావు మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మికులపై దాడిను పెంచింది. పని గంటలు పెంచీ జీతాలు తగ్గించింది. లేబర్ చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను చేసియాజమాన్యానికి అనుకూలంగా లేబర్ చట్టాలను మార్చారు. సమ్మె హక్కును తొలగించడానికి కుట్ర చేస్తున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని కష్టజీవులు ఎన్నో ఏళ్ల క్రితం కష్టపడి పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తున్నారు. అంతేకాదు రైతాంగాన్ని వారి సమస్యలను పట్టించుకోకపోగా రైతు విద్యుత్ చట్టాలను దెబ్బతీసి నడ్డి విరిచింది. అందుకే ఈ దేశంలో ఉన్న రైతాంగ కిసాన్ సంయుక్త మోర్చ కూడా ఈ నిరసనలో భాగస్వామ్యం అవుతున్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కాన్సిల్ సభ్యుడు ఎస్.శంకర్‌రావు మాట్లాడు తూ కార్మికులకు కనీసవేతనం ఇవ్వాలని అందరికీ పెన్షన్ కల్పించాలని 8 గంటల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. టి యు సి ఐ జిల్లా నాయకుడు ప్రవీణ్ మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్, గ్యాస్, ధర పెంచి జనాల నడ్డి ఇరగోడుతున్నారని ఆటో కార్మికులకు చాలా ఇబ్బంది అవుతున్నారని వెంటనే కార్మికుల సమస్యపై పార్లమెంట్లో చర్చించాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సులో ఐ.ఫ్.టీ.యు జిల్లా నాయకులు యాదయ్య సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జి శ్రీనివాసులు, పి గణేష్, బి.లింగ స్వామి, బచుపల్లి, మల్కాజిగిరి మండల నాయకులు చంద్రశేఖర్, బి.నర్సింగ్ రావు, చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐఈ యు) అధ్యక్షుడు సత్యనారాయణ, గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్ శ్రీనివాస్, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి కే.ఉన్నీకృష్ణ. ఏఐటీయూసీ జిల్లా నాయకుడు శ్రీనివాస్ మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధితో ఆర్థిక పరిపుష్టి సాధించాలి

విశాలాంధ్ర - ఆమనగల్లు : యువత స్వయం ఉపాధితో ఆర్థిక పరిపుష్టి సాధించి రాణించాలని టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహా ముదిరాజ్ అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలో ఎన్ఎస్యుఐ జిల్లా కార్యదర్శి ఫరీద్ నూతనంగా ఏర్పాటు చేసిన మోడల్ డిజిటల్ ఫోటో స్టూడియోను వారు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫరీద్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శ్రీనివాస్ గౌడ్, యాట నర్సింహా మాట్లాడుతూ ఎవ్వరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురు చూడకుండా, ఆశించకుండా తన కాళ్ళపై తాను నిలబడేందుకు స్వయం ఉపాధి రంగాలను ఏర్పరచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు స్వయం ఉపాధి రంగాన్ని ఎంచుకుని ఆర్థిక పరిపుష్టి సాధించి ఆ రంగంలో రాణించి గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. స్వయం ఉపాధితో పాటు మరికొందరికి ఉపాధి కల్పించాలన్నారు. యువత స్వయం ఉపాధి ద్వారా దేశాభివృద్ధి తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షులు జగన్, బిచ్యా నాయక్, బ్లాక్ ఉపాధ్యక్షుడు ఖలీల్, జిల్లా నాయకులు కృష్ణ నాయక్, ఖాదర్, కరీం, అలీమ్, సోషల్ మీడియా కన్వీనర్లు నాజర్, మహేష్, శేఖర్ గౌడ్, జాజి మొగ్గల మహేష్, అబేద్, జహీర్, సలీం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జూపల్లి నర్సింగ్‌రావు కుమారుడి వివాహం

విశాలాంధ్ర - బషీర్ బాగ్: అసిస్టెంట్ కమిషనర్ జూపల్లి నర్సింగ్‌రావు కుమారుడు శ్రీకాంత్, ప్రియంకల వివాహం మహమూద్ హౌస్ గార్డెన్ యూసుఫ్ గూడ జరిగింది. వివాహానికి అసిస్టెంట్ డైరెక్టర్ శాస్త్రి, హైదరాబాద్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ జాంగీర్, టిఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ అసోసియేట్ ప్రెసిడెంట్, టీఎన్జీవోస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ హైదరాబాద్ అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, జాయింట్, సెక్రటరీ జయంతిరెడ్డిలు నూతన వధూవరులకు పుష్పగుచ్చం అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ప్రియదేవ్ ఠాకూర్ రమేష్, అరుణజ్యోతి, రాజ్‌కుమార్, శ్రీకాంత్, ఓపెన్ స్కూల్ ప్రభాకర్, శేషిరత్న, సంతోష్, సి.ప్రెడ్డి, శివజ్యోతిరెడ్డి, రిటీడీ సుబ్బారావు, ప్రసాద్ అన్న, సునీల్, మురళీ, సుందర్ శృదపూర్, శంకర్‌ప్రసాద్ పాల్గొనారు.

రాపోలు రాములుకు ఘన సన్మానం

విశాలాంధ్ర - మేడిపల్లి: మున్సిపల్ కార్పొరేషన్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి 311వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఫెడరేషన్ చైర్మన్ డాక్టర్ రాపోలు రాములు, ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పంగా ప్రణయ్ పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పించారు. అనంతరం ప్రజాసేవలో రాపోలు రాములు డాక్టరేట్ పొందిన సందర్భంగా నత్తి మైసయ్య ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించి రాజ్యాంగాన్ని బహుకరించారు. అదేవిధంగా పంగా ప్రణయ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టి ప్రజా సేవే పరమార్థంగా బోడుప్పల్ ప్రజా సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేసిన డాక్టర్ రాపోలు రాములు జీవితం నేటి యువతకు, బడుగు బలహీన వర్గాలకు ఆదర్శప్రాయం అని ఆయనను సత్కరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం డాక్టర్ రాపోలు రాములు మాట్లాడుతూ తనకు డాక్టరేట్ రావడం మరింత బాధ్యతను పెంచిందని, ఇదే స్ఫూర్తితో ప్రజలకు మరింత సేవ చేస్తానని, ప్రతి ఒక్కరూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తీసుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని తనను సన్మానించిన అంబేద్కర్ ఆశయ సాధన సంఘపు సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాపోలు శ్రీరాములు, చిలక భాస్కర్, నత్తి దర్శన్, మైస గళ్ళ జానజానీ, బందారి సాయి, బోడుప్పల్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మైసగల శివ గరుగుల యాకయ్య,చిన్ని మిగల శ్రీకాంత్, ఎం ఆర్ పి ఎస్ సెక్రెటరీ దాన గళ్ళ సురేష్, ఏ రాజేష్, కొంపల్లి నరేష్, బెక్కం శివ, ఏసు రాజు, సవరపు బయన్న, జై భీమ్ అజయ్, ఫెడరేషన్ సభ్యులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

మానవతా పరిమళాలు విరబూసిన కవన కుసుమాలు పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర - బషీర్‌బాగ్ : కుటుంబ వ్యవస్థ విలువలు, మానవ సంబంధాల మాధుర్యాలను పునస్మరిస్తూ కవితా కుసుమాలతో కూర్చిన కవితా సంపుటి కవన కుసుమాలని ప్రముఖ కవి, పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయ సాహిత్య పురస్కార గ్రహీత డాక్టర్ కాంచనపల్లి గోవర్ధన్ రాజు అన్నారు. ఫిబ్రవరి 2 ఆదివారం రోజున గుండవరపు హనుమంతరావు కళావేదిక త్యాగరాయ గాన సభ చిక్కడపల్లిలో భవానీ సాహిత్య వేదిక కరీంనగర్ ఆధ్వర్యంలో వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించిన సాహిత్య సభకు హాజరై డాక్టర్ అన్నమరాజు సుమాల్య రచించిన కవన కుసుమాలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి ఆరాధన, సామాజిక విలువలతో కూడిన కవితలతో రచించిన కవన కుసుమాలు అలతి పదాలతో కూడి చక్కని భావుకతతో పాఠకులను ఆకట్టుకుంటాయన్నారు. పండిత వంశాన్ని వారసత్వంగా పుణికి పుచ్చుకున్న అన్నమరాజు సుమాల్య చక్కని కవిత్వం అందించారని అభినందించారు. విశిష్ట అతిథిగా హాజరైన పద్యభాషి డాక్టర్ రాధశ్రీ మాట్లాడుతూ సుమాల్య కవిత్వం సరళమై, సుబోధకమే అందరి హృదయాలను అలరిస్తుందని తెలిపారు. ప్రముఖ కవి చౌదూరి కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు చౌదూరి నరసింహారావు కవన కుసుమాలు పుస్తకాన్ని సమీక్షించగా కవి, రచయిత లోడె రాములు వేదిక పైకి అతిథులను ఆహ్వానించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి గంప ఉమాపతి ఆధ్వర్యంలో చౌదూరి నరసింహారావు అధ్యక్షతన కవి సమ్మేళనం నిర్వహించి కవితలను ఆలపించిన కవులను సర్టిఫికెట్, శాలువా మెమెంటోలతో ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కవులు సాహిత్య అభిమానులు పండితులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం

విశాలాంధ్ర - ఆమనగల్లు : కేంద్ర బడ్జెట్ 2025 26లో తెలంగాణకు మరోసారి తీవ్ర అన్యాయం జరిగిందని, బడ్జెట్లో తెలంగాణ పేరును ఎక్కడ ప్రత్యేకంగా ప్రస్తావించలేదని, కొత్త కార్యక్రమాలకు పథకాలకు విద్యా సంస్థలకు నిధులు కేటాయించలేదని పీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. ఆదివారం మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన విన్నతులను కేంద్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకోలేదని, రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా విభజన చట్టంలోని అంశాలను అమలు చేయాలని కొత్తగా ప్రతిపాదించిన వాటికి నిధులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరిందని అన్నారు. గత మూడేళ్లుగా కేంద్రం నుంచి గ్రాంట్ల పద్ధతి కింద పూర్తి స్థాయిలో నిధులు రావడం లేదని, అసెంబ్లీ ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకే పెద్ద పీట వేసి దేశ ప్రజల సమానత్వాన్ని కేంద్ర ప్రభుత్వం మరిచిందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా రైతన్నలు కనీస మద్దతు ధర కోసం కొంతకాలంగా ఆందోళన చేస్తున్నప్పటికీ, రైతులకు కనీస మద్దతు ధరపై బడ్జెట్లో ఎక్కడ ప్రస్తావించలేదని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పోరేట్ అనుకూల బడ్జెట్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఖలీల్, జిల్లా నాయకులు కృష్ణ నాయక్, ఖాదర్, కరీం, అలీం, జిల్లా కార్యదర్శి ఫరీద్, నాయకులు నాజర్, మహేష్ శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఐ హోమ్స్ బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : ఆదిభట్లలో నూతనంగా చేపడుతున్న ఐ హెూమ్స్ బ్రోచర్‌ను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌లు ఆదివారం నిర్వాహకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐటి, ఔటర్ రింగ్ రోడ్డుకు చేరువలో నిర్మాణం చేపట్టడం అభినందనీయమని నిర్వాహకులను అభినందించారు. దినదినాభివృద్ధి చెందుతున్న ఆదిభట్లలో వినియోగదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి వినియోగదారుల మన్ననలు అందుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బడంగ్ పేట్ నగర పంచాయతీ మాజీ చైర్మన్ సామ నరసింహా గౌడ్, సీనియర్ నాయకులు ఇ సి శేఖర్ గౌడ్, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను నిరుత్సాహపరిచిన కేంద్ర బడ్జెట్

- కిసాన్ సమ్మాన్ నిధి రూ.10వేలకు పెంచాలి
- నూతన వ్యవసాయ మార్కెట్ విధానం ఉపసంహరించాలి
- ఏఐకేఎస్ హర్యానా రాష్ట్ర మహాసభలో రావుల వెంకయ్య

సిర్సా: 2025-26 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన సాధారణ బడ్జెట్ రైతులను నిరుత్సాపరిచిందని, ఇది కోతల బడ్జెటని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య తీవ్రంగా విమర్శించారు. రూ. 50 లక్షల కోట్లతో ప్రవేశపెట్టినప్పటికీ అందులో రైతుల వాటా కేవలం రూ. 1.72 లక్షల కోట్లు మాత్రమేననీ గత ఆర్థిక సంవత్సరం రూ. 1.76 లక్షల కోట్లు కేటాయిస్తే ఈ ఏడాది నాలుగు వేల కోట్ల రూపాయలు కోత విధించారన్నారు. రైతులకు ఇచ్చే సబ్సిడీలను కూడా భారీగా తగ్గించివేశారనీ, ఎరువులపై సబ్సిడీ గత ఏడాది రూ. 15,864 కోట్లు ఉంటే ఈ ఏడాది రూ. 12,242 కోట్లకు తగ్గించి వేశారన్నారు. ఏఐకేఎస్ హర్యానా రాష్ట్ర 15వ మహాసభలు సిర్సా జిల్లా కేంద్రంలో ఈ నెల 1,2 తేదీలలో ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. రాష్ట్రంలోని 22 జిల్లాలకుగానూ పది జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రతినిధులు ఈ మహాసభకు హాజరయ్యారు. ఈ మహాసభలకు ధర్మపాల్, గుర్‌భజన్ సింగ్, సత్యేంద్ర ఖేరి, సూర్జిత్ సింగ్ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఏఐకేఎస్ అధ్యక్షులు రాజన్ క్షీరసాగర్ మహాసభలలో ప్రారంభోపన్యాసం చేస్తూ, కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి కార్పొరేట్ అనుకూల, రైతు వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు. రైతులు సంఘటితంగా పోరాడి ఎన్డీయే ప్రభుత్వ వినాశకర విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

మహాసభల రెండో రోజైన ఆదివారం రావుల వెంకయ్య ముగింపు ఉపన్యాసం చేస్తూ, రైతు సంఘం రాష్ట్ర మహాసభలు సిర్సాలో అనేక సంవత్సరాల తర్వాత జరుగుతున్నాయన్నారు. జాతీయ మహాసభలు ఏప్రిల్ 15-17 తేదీలలో తమిళనాడులోని నాగపట్నంలో జరుగుతాయనీ, ఈ మహాసభల విజయవంతానికి ఆహ్వాన సంఘం ఇప్పటికే ఏర్పడిందన్నారు. జాతీయ మహాసభల నేపథ్యంలో రాష్ట్రాల మహాసభలు జరుగుతున్నాయని చెప్పారు. జాతీయ మహాసభలకు వివిధ దేశాల నుంచి అంతర్జాతీయ ప్రతినిధులు హాజరవుతున్నారనీ, దేశంలోని వివిధ రైతు సంఘాల, కిసాన్ మోర్చా ప్రతినిధులు హాజరై సౌహార్ద సందేశాలివ్వనున్నట్టు చెప్పారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి క్రింద రైతులకు ఏడాదికి ఇచ్చే 6వేల రూపాయలను పదివేల రూపాయలకు పెంచాలన్న రైతు సంఘాల, రైతుల డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడంలేదన్నారు. పదివేలకు పెంచుతూ ఈ బడ్జెట్‌లో ప్రకటిస్తారని ఆశించిన రైతులకు నిరాశే ఎదురైందన్నారు. ఈ పథకానికి కేటాయింపులు కూడా బడ్జెట్‌లో తగ్గించడం విచారకరమన్నారు. మోదీ అధికారం చేపట్టిన తరువాత రుణబాధలు తట్టుకోలేక దేశవ్యాప్తంగా 4లక్షల మంది ఆత్మహత్య చేసుకున్నారనీ, అంటే 31 మంది రైతులు బలవన్మరణం చెందారనీ, ఇది చాలా ఆందోళనకలిగిస్తోందన్నారు. రైతులు కోరుకుంటున్న పంటలకు గిట్టుబాటు ధర, సీ2+50, రుణాల రద్దు, విద్యుత్ బిల్లు ఉపసంహరణ అంశాలు కేంద్ర బడ్జెట్‌లో ప్రస్తావనకు రాకపోవడం విచారకరమని రావుల వెంకయ్య అన్నారు. గోరుచుట్టుపై రోకటిపోటులా కేంద్ర ప్రభుత్వం నూతన వ్యవసాయ మార్కెట్ విధానం ప్రవేశపెట్టి రైతుల నడ్డివిరుస్తూ, కార్పొరేట్ శక్తులకు మేలుచేస్తోందన్నారు. దుర్మార్గమైన ఈ చట్టం ప్రవేశపెట్టడం రాష్ట్రాల హక్కులు హరించడమేనన్నారు. వ్యవసాయం, మార్కెటింగ్ విధానం రాష్ట్రాలకు చెందిన అంశం అయినప్పటికీ కేంద్రం తన గుప్పెట్లోకి తీసుకునేందుకు ప్రయత్నించడం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. రాష్ట్రాలు కూడా ఈ విషయమై ఆలోచించాలన్నారు. కేరళ, ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే ఈ విధానాన్ని వ్యతిరేకించాయనీ, మిగిలిన రాష్ట్రాలు కూడా వీటి బాటలో పయనించాలని సూచించారు. ఈ విధానాన్ని ఉపసంహరించుకునే విధంగా రైతాంగం సంఘటిత పోరు సల్పాలని రావుల వెంకయ్య పిలుపునిచ్చారు.

వాగ్దానాలు అమలు చేసి రైతును ఆదుకోండి

- 10న మండలాల్లో, మార్చి 3న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు
- జమలయ్య పిలుపు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: ఎన్నికల సందర్భంగా చేసిన వాగ్దానాలు అమలు చేసి రైతులను ఆదుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. కౌలు రైతుల రక్షణ, వారి సంక్షేమానికి నూతనంగా సమగ్ర కౌలు చట్టం తీసుకురావాలని, భారతీయ రిజర్వు బ్యాంకు ఆదేశాల ప్రకారం హామీలేని పంట రుణాలు కౌలు రైతులకు ఇవ్వాలని తదితర డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 10న మండల కార్యాలయాల వద్ద, మార్చి 3న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేయాలని సంఘం కౌన్సిల్ సమావేశం తీర్మానించిందని చెప్పారు. కౌలు రైతుల సంఘం రాష్ట్ర సమితి సమావేశం సంఘం అధ్యక్షులు ఎ.కాటమయ్య అధ్యక్షతన గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లో ఆదివారం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర సమితి సమావేశం ఆమోదించిన తీర్మానాలు వెల్లడించారు. గ్రామ సభలు నిర్వహించి భూ యజమాని ప్రమేయం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు. కౌలు రైతులు పండిస్తున్న పంటలకు ఉచిత బీమా పథకాన్ని వర్తింపచేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన ప్రకారం కిసాన్ క్రెడిట్ కార్డులు కౌలు రైతులకు జారీ చేయాలని, వీటి ఆధారంగా హామీ లేని పంట రుణాలు ఇచ్చి ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తుల కబంధ హస్తాల నుంచి వారికి రక్షణ కల్పించాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. దేవాలయ భూములను సాగు చేస్తున్న కౌలు రైతులకు కూడా వ్యవసాయ, ఉద్యానవన పథకాలు వర్తింపు చేసి ఆదుకోవాలన్నారు. 2024 సంవత్సరంలో వ్యవసాయ సంక్షోభం వల్ల అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడిన బాధిత కౌలు రైతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కౌన్సిల్ సమావేశం తీర్మానించిందని చెప్పారు. మార్చి 20వ తేదీన రబీలోనైనా కౌలు రైతులకు పంట రుణాలు అందించాలని కోరుతూ జిల్లా కేంద్రాల్లో ఉన్న లీడ్ బ్యాంకు మేనేజర్ కార్యాలయాల వద్ద ఆందోళన నిర్వహించాలని, దేవాలయ భూములను సాగు చేస్తున్న కౌలు రైతులకు శాశ్వత కౌలు హక్కు పత్రాలు ఇవ్వాలని తీర్మానం చేసినట్లు వివరించారు. ఈ సమావేశంలో ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి, ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కంజుల విఠల్ రెడ్డి, పీవీ జగన్నాథం, పల్నాడు కౌలు రైతుల సంఘం నాయకులు పి.లక్షాధికారి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ దళిత వ్యతిరేకి

రాహుల్, ప్రియాంక

న్యూఢిల్లీ: బీజేపీ దళిత వ్యతిరేకి అని కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ విమర్శించారు. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో ఓ దళితురాలి నగ్న మృతదేహం లభ్యం కావడంపై ఆందోళన వ్యక్తం చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమయానికి స్పందించని పోలీసు అధికారులపై చర్యలను కోరారు. 'ఇది అమానుషం. యోధ్యలో దళిత మహిళ దారుణంగా హత్యకు గురి కావడం హృదయ విదారకం. చాలా సిగ్గుచేటు. బాధిత కుటుంబం మొరను ఆలకించి అధికారులు సరైన విధంగా స్పందించివుంటే ఇంతటి ఘోరం జరిగేది కాదు. మహిళ ఆచూకీ కోసం మూడు రోజుల పాటు ఆమె కుటుంబం మొర పెట్టుకున్నది. సమయానికి స్పందించివుంటే ఆమె ఈరోజు ప్రాణాలతో ఉండేది' అని రాహుల్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'హేయమైన నేరానికి మరొక ఆడబిడ్డ బలైపోయింది. ఇది ఇంకెంత కాలం.. ఇంకెన్ని కుటుంబాలు ఆ వేదనను అనుభవించాలి?' అని ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్‌లో ఉన్నది బహుజనుల వ్యతిరేక బీజేపీ ప్రభుత్వమని రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. ఈ ఘటనపై తక్షణమే విచారణను చేపట్టాలని, దోషులను సాధ్యమైనంత త్వరగా శిక్షించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులనూ వదిలి పెట్టవద్దని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని వేధించవద్దన్నారు. న్యాయం కోసం దేశ ఆడబిడ్డలు, యావత్ దళిత సమాజం మీ వైపు చూస్తోందని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి రాహుల్ గాంధీ అన్నారు. ప్రియాంక గాంధీ స్పందిస్తూ అయోధ్యలో ప్రవచనం వినేందుకు వెళ్లిన దళిత యువతిని అమానుషంగా కడతెర్చిన ఘటన ఎవరికైనా వెన్నులో వణుకు తెప్పిస్తుందని అన్నారు. మానవళికి ఇలాంటి క్రూరత్వం సిగ్గుచేటన్నారు. మూడు రోజులుగా జాడ లేని యువతి ఆచూకిని తెలుసుకునేందుకు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గర్హనీయమని అన్నారు. బీజేపీ ఆటవిక పాలనలో దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గీయులు, పేదల మొర ఆలకించే వారే కరువయ్యారని విమర్శించారు. దళితులపై దురాగతాలకు యూపీ సర్కార్ మారుపేరుగా మారిందని ప్రియాంక దుయ్యబట్టారు. ఇంతటి దారుణానికి ఒడిగట్టిన వారిని వదిలిపెట్టరాదని, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఏపీకి నయవంచన

- ప్రత్యేక హోదా, విభజన హామీల ప్రస్తావన లేదు
- చంద్రబాబు ప్రభావం ఉందనడం విడ్డూరం
- కేంద్ర బడ్జెట్‌పై చలసాని శ్రీనివాస్

విశాలాంధ్ర-విజయవాడ: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు నయవంచన జరిగిందని ప్రత్యేక హోదా సాధన కమిటీ అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా గురించి కానీ, విభజన హామీలపై కానీ బడ్జెట్‌లో ఏమీ లేదన్నారు. కేంద్ర బడ్జెట్‌పై సీఎం చంద్రబాబు ప్రభావం కనిపించిందన్న వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయని శ్రీనివాస్ అన్నారు. విజయవాడ బాలోత్సవ భవనంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని ఏర్పాటు-మౌలిక వసతులకు సాయం అన్నవి విభజన చట్టం ఇచ్చే హక్కు అని భిక్ష కాదన్నారు. విభజన అంశాల సాధనపై ఇచ్చిన మాటలకు చంద్రబాబు, మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి కట్టుబడలేదని విమర్శించారు. కొద్ది పాటి విదిలింపులతో రాష్ట్రాలతో ధన్యవాదాలు చెప్పించుకోవడం కేంద్రానికి అలవాటైందని దుయ్యబట్టారు. '2023లో రూ.12,950 కోట్లు ప్రకటించి... ధన్యవాదాలు చెప్పించుకున్నారు. గత బడ్జెట్ సమయంలో అదే చేశారు. అందరితో ధన్యవాదాలు చెప్పించుకున్నారు. ఇప్పుడూ అదే చేశారని, ముఖ్య నాయకులు దీనిపై స్పందించకపోవడం బాధకరమ'ని శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతుంటే బడ్జెట్‌పై చంద్రబాబు ప్రభావం ఉందని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించడం తగదన్నారు. చంద్రబాబు ప్రభావం ఉంటే రాష్ట్రానికి కేంద్రం నుంచి ఎంతో కొంత వచ్చేదని అభిప్రాయపడ్డారు. రైల్వే విషయంలో మెట్రో, అమరావతికి - ఓఆర్ఆర్‌కి కొన్ని విదిలింపులు ఉండొచ్చని చెప్పారు. ప్రత్యేకంగా గుజరాత్‌తో సహా అనేక రాష్ట్రాల ప్రస్తావన రాగా ఆంధ్రప్రదేశ్ ప్రస్తావన రాలేదని, దీనిని గ్రహించి దక్షిణాదికి జరుగుతున్న అన్యాయంపై ఉత్తరాదిని నిలదీయాలని శ్రీనివాస్ సూచించారు. విభజన హామీల సాధన కోసం పోరాడలేని ఎంపీలు సిగ్గుపడాలని... దిక్కుమాలిన ప్యాకేజీలతో రాష్ట్రానికి ఒరిగేదేమీ ఉండదని చలసాని శ్రీనివాస్ అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ బడ్జెట్‌పై ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. రాష్ట్రానికి వెయ్యి కిలోమీటర్ల తీరం ఉన్నా గుజరాత్ తరహా కేటాయింపులు ఏపీకి దక్కలేదన్నారు. రాయలసీమ ఉత్తరాంధ్రకి కేబికే తరహా ప్యాకేజీ ప్రకారం రూపాయి రాలేదని, దీనిపై ఏ చర్చకైనా సిద్ధమేనన్నారు. కడప ఉక్కు ఫ్యాక్టరీకి భూమి, అన్ని సదుపాయాలు సిద్ధంగా ఉన్నా బడ్జెట్‌లో ఇచ్చినదేమీ లేదని చలసాని శ్రీనివాస్ అన్నారు. ఏఐసీసీ నేత నరహరిశెట్టి నరసింహారావు మాట్లాడుతూ రాష్ట్రానికి 11ఏళ్లుగా అన్యాయం జరుగుతోందన్నారు. విభజన హామీల కోసం తమ పోరాటం ఆగదన్నారు. సాధన సమితి ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ ప్రజలు, ప్రాంతం కోసం సాధన సమితి అధ్వర్యంలో అలుపెరగని పోరాటం చేశామన్నారు. రాజకీయాలను పక్కనపెట్టి ఆంధ్రాభివృద్ధి కోసం ఉద్యమాన్ని ముందుకు తీసుకెళతామని అన్నారు. సమితి సహాయ కార్యదర్శి తాటికొండ నరసింహారావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ హక్కుల కోసం నిర్విరామంగా ఉద్యమిస్తున్నామని చెప్పారు. విభజన హామీల సాధన సమితి ఉద్యమం చేసినా సరే మీడియా పట్టించుకోలేదని, తమ ఉద్యమాన్ని కొనసాగించామని తెలిపారు. పాత్రికేయులందరూ తమ వంతు పాత్ర పోషించి భావితరాలకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. సభలో శ్రామిక వికాస్ సంఘటన నేత యజ్ఞ నారాయణ, విద్యార్థి నేత లంక గోవిందరాజులు, ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు చెవుల కృష్ణ ఆంజనేయులు పాల్గొన్నారు.

'సూపర్ 6' అమలు చేయాలి

సీపీఎం రాష్ట్ర మహాసభ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ 6 హామీలతో పాటు ఇతర హామీలను అమలు చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. పార్టీ 27వ రాష్ట్ర మహాసభల రెండవ రోజు ఆదివారం కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రాంగణంలో(అనిల్ గార్డెన్స్) లో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు, కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ సర్దుబాటు చార్జీలు, స్మార్ట్ మీటర్లు, అదానీ ఒప్పందం రద్దు చేయాలని, ఆంధ్ర ప్రదేశ్ సమగ్రాభివృద్ధికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, అందరికీ ఇళ్లు, పట్టాలు మంజూరు చేసి సదుపాయాలు కల్పించాలని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వమే నడపాలని, కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, కార్మిక సంక్షేమ పథకాలు అమలు చేయాలని, వెనుకబడిన ప్రాంతాల ఎడల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం విడనాడి, అభివృద్ధికి నిర్దిష్ట చర్యలు చేపట్టాలని, నిత్యావసర సరుకుల ధరలు నియంత్రించాలని, ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులు అందించాలని రాష్ట్ర మహాసభ డిమాండ్ చేసిందని తెలిపారు. అదేవిధంగా విద్యా రంగానికి నిధులు పెంచాలని, ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేయాలని, కార్పొరేట్ విద్యా సంస్థలను నియంత్రించాలని, పొదుపు సంఘాలకు సక్రమంగా రుణాలు ఇవ్వాలని, మహిళలకు ఉపాధి చూపాలని, మైక్రో ఫైనాన్స్, లోన్ యాప్‌ల నుంచి రక్షణ కల్పించాలని, దళితులపై దాడులు అరికట్టాలని, వివక్షత రూపుమాపడానికి చర్యలు చేపట్టాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు సమగ్ర పునరావాసం, పూర్తిస్థాయిలో పరిహారం అమలు చేయాలని కోరిందన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని, పట్టణ ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టాలని, పట్టణాల్లో ఆస్తి పన్ను పెంపు ఆపాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రైవేటీకరణ విడనాడాలని, మహిళలు, బాలికలపై హింసను అరికట్టాలని, మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించాలని, రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం గ్రాంట్లు ఇవ్వాలని, రాజధాని ప్రాంత ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని, వక్ఫ్ చట్టానికి కేంద్రం తలపెట్టిన సవరణలను ఉపసంహరించాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలన్న తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించిందని వారు తెలిపారు. అదేవిధంగా ప్రజా సమస్యలపై ఒక పోరాట కార్యాచరణను మహాసభలో చర్చించి, తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మోహన్ రావు పాల్గొన్నారు.

అండర్-19 మహిళల జట్టుకు చంద్రబాబు, పవన్, జగన్ అభినందనలు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: అండర్-19 మహిళల టీ 20 ప్రపంచ కప్ సాధించిన భారత జట్టు క్రీడాకారులకు ఏపీ సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు, మాజీ సీఎం జగన్ అభినందనలు తెలిపారు. మీ కఠోర శ్రమ, పట్టుదల, దృఢ సంకల్పంతో 9 వికెట్ల తేడాతో ఘనత విజయం సాధించారు. తద్వారా ప్రతి భారతీయుడు గర్వించేలా చేశారు. యావత్ దేశం మిమ్మల్ని చూసి గర్విస్తోంది అంటూ చంద్రబాబు ట్వీట్ చేశారు. అద్భుత ప్రదర్శనతో చరిత్ర సృష్టించారని, మీ అంకితభావం, కృషి దేశానికి గర్వకారణంగా నిలుస్తుందని పవన్ అన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని జగన్ ఆకాంక్షించారు. డిఫెండింగ్ ఛాంపియన్‌గా అడుగుపెట్టి రెండోసారి వరల్డ్ కప్ విజేతగా నిలిచిన భారత జట్టుకు అభినందనలు తెలియజేస్తున్నానని మంత్రి లోకేశ్ అన్నారు. సమిష్టి ప్రదర్శనతో దక్షిణాఫ్రికాను ఓడించి అంతర్జాతీయ స్థాయిలో దేశ ఖ్యాతిని ఇనుమడింపజేశారన్నారు. టోర్నీ మొత్తం తనదైన బ్యాటింగ్, బౌలింగ్‌తో అద్భుత ప్రదర్శన చేసిన తెలుగు క్రికెటర్ గొంగడి త్రిష అందరికీ గర్వకారణంగా నిలిచారన్నారు. ఫైనల్లో సౌతాఫ్రికాపై 9 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించి భారత్ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పడం గర్వకారణమని మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. విజేతలను ఆదర్శంగా తీసుకుని బాలికలు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. ప్రపంచకప్ గెలిచిన భారత్ విశ్వవిజేతగా అవతరించిందని క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు.

సోనియా, రాహుల్, ప్రియాంకపై క్రిమినల్ కేసు

ముజఫర్‌పూర్: రాష్ట్రపతి ప్రసంగంపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్, ప్రియాంక వాద్రాపై ముజఫర్‌పూర్ సీజేఎం (చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్) కోర్టులో ఫిర్యాదు నమోదైంది. రాష్ట్రపతి ప్రసంగం అనంతరం పార్లమెంటు వెలుపల... ఆమె ప్రసంగం బాగోలేదని చెప్పడం సరికాదని, రాష్ట్రపతి ద్రౌపది ముర్మును అవమానించేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నించారని ముజఫర్‌పూర్‌కి చెందిన ప్రముఖ న్యాయవాది సుధీర్ కుమార్ ఝా కోర్టులో ఫిర్యాదు చేశారు. భారత న్యాయ సంహిత 2023లోని 352, 351(2) (3) 79, 151 61(2) కింద వీరిపై కేసు నమోదైంది. ఆరోపణలు రుజువైతే.. నిందితులకు రెండు నుంచి ఏడేళ్ల వరకు జైలుశిక్షపడే అవకాశం ఉందని సుధీర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'కాంగ్రెస్ నేతలు సోనియా, రాహుల్, ప్రియాంక వాద్రాలపై నేను ముజఫర్‌పూర్ కోర్టులో క్రిమినల్ కేసు పెట్టాను. పార్లమెంటులో ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేసిన ప్రసంగంపై వీరు కుట్రపూరితంగానే అనుచిత, అసభ్యకర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రపతి ఓ గిరిజన మహిళ. అలాంటి మహిళపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు. అందుకే ఈ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా కోర్టులో పిటిషన్ వేశాను' అని చెప్పారు. ఈ పిటిషన్‌ను 10వ తేదీన కోర్టు విచారించనుంది.

ఆలనాపాలనా లేని అపురూప శిల్పాలు

పరిరక్షించాలన్న పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కర్నూలు జిల్లాలో రాష్ట్ర కూటుల కాలం నాటి (9వ శతాబ్దపు) అపురూప శిల్పాలు ఆలనాపాలనా లేక ముళ్ల కంచెల్లో నిర్లక్ష్యంగా పడి ఉన్నాయని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో, డా.ఈమని శివనాగిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యానికి గురైన వారసత్వ స్థలాలు, కట్టడాలు, శాసనాలు, శిల్పాలను గుర్తించి, వాటి చారిత్రక ప్రాధాన్యత, కాపాడుకోవల్సిన ఆవశ్యకత గురించి అవగాహన కల్పించే 'ప్రిజర్వ్ హెరిటేజ్ ఫర్ పోస్టెరిటీ' కార్యక్రమంలో భాగంగా ఆయన ఆదివారం కర్నూలు నగరానికి దక్షిణంగా 25 కి.మీ.ల దూరంలో కల్లూరు మండలం, నాయకల్లు గ్రామాన్ని సందర్శించి పొలాల్లో ఉన్న శిథిల శివాలయాలు, విగ్రహాలను గుర్తించారు. గ్రామానికి ఉత్తరంగా ఉన్న కల్లాల దగ్గర ముళ్ల కంచెల్లో ఉన్న రాష్ట్ర కూటుల కాలం నాటి నిలువెత్తు ఎర్ర ఇసుకరాతి శివ ద్వారపాలుడు, నల్ల శాసనపు రాతిలో చెక్కిన రెండు మహిషాసురమర్ధిని శిల్పాలు, ఒక వీరగల్లు శిల్పం, ఇంకా పొలాల్లో ఉన్న శిథిల శివాలయాల పక్కన ముళ్ల పొదల్లో చిక్కుకున్న అందమైన నంది విగ్రహం, 1100 సం నాటి చరిత్ర, సంస్కృతికి అద్దం పడుతున్నాయన్నారు. రెండు మహిషాసురమర్ధిని శిల్పాలు అలనాటి శక్తి ఆరాధనను, శత్రువులతో వీరోచితంగా పోరాడి ప్రాణాలు కోల్పోయిన వీరుడు విజయ స్వర్గాన్ని చేరుకోగా, అతనికి అప్సరసలు పరిచర్యలు చేస్తున్నట్లు తెలిపే నిలువెత్తు వీరగల్లు శిల్పం, అలనాటి వీరరాధనను తెలియజేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. చారిత్రక ప్రాధాన్యత గల ఈ కళాఖండాలను గ్రామంలోకి తరలించి, పీఠాలపై నిలబెట్టి కాపాడుకొని భవిష్యత్తరాలకు అందించాలని శివనాగిరెడ్డి గ్రాస్తులకు విజ్ఞప్తి చేశారు.

రూపాయి బలహీనంగా లేదు: సీతారామన్

న్యూఢిల్లీ: రూపాయి బలహీనంగా ఏమీ లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నొక్కి చెప్పారు. డాలర్ మినహా ఏ కరెన్సీతోనూ రూపాయి తీసిపోదన్నారు. వరుసగా ఎనిమిదోసారి కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన క్రమంలో సీతారామన్ ఓ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వివరాలు తెలిపారు. డాలర్‌తో పోల్చితే మూడు శాతం మేర రూపాయి మారక విలువ కొద్ది నెలల్లో తగ్గడం ఆందోళనకరమని ఒప్పుకుంటానని చెప్పారు. దిగుమతుల వ్యయం పెరుగుతుండటంతో ఇది మరింత ఆందోళన కలిగిస్తోందని అన్నారు. అలాగని రూపాయి బలహీనంగా ఉందంటే అంగీకరించబోనని సీతారామన్ అన్నారు. 'ఓహో రూపాయి బలహీనపడుతోంది అంటే ఒప్పుకోను. మన మాక్రో ఎకనామిక్స్ మూలాలు బలంగా ఉన్నాయి. లేకపోతే మిగతా కరెన్సీల కంటే రూపాయి స్థిరంగా ఉండదు' అని ఆర్థిక మంత్రి చెప్పారు. డాలర్ విలువలో పెంపుదల క్రమంలో రూపాయిని స్థిరపర్చే కసరత్తు జరుగుతున్నట్లు తెలిపారు. రక్షణ వ్యయాన్ని ఎన్నడూ తగ్గించలేదని అన్నారు. స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) ఫలితాలపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. ఎప్పుడు కూడా లక్ష్యాల్లో విఫలమైన దాఖలాలు లేవన్నారు. ఆర్థిక వ్యవస్థ పురోగతి కాదనలేదని చెప్పారు. రుణాల విషయంలో తగు విధంగా ముందుకు వెళుతున్నట్లు తెలిపారు.

వికసిత్ భారత్ లక్ష్యంతో బడ్జెట్‌ను అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇస్తూ రూపొందించినట్లు వెల్లడించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ కేటాయింపు కంటే మూల ధన వ్యయం తక్కువగా ఉన్నట్లు చెప్పారు.

కర్నాటకలో ఆఖరి నక్సల్ లక్ష్మి లొంగుబాటు

ఉడిపి: కర్నాటకలోని ఆఖరి మహిళా మావోయిస్టుగా చెప్పబడే లక్ష్మి బేషరతుగా లొంగిపోయారు. ఈ మేరకు ఉడిపి డిప్యూటీ కమిషనర్ విద్యాకుమారి, ఎస్పీ అరుణ్ ఆదివారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో నక్కి ఉన్న ఆమెపై ఉడిపి జిల్లాలోని కుందాపూర్ తాలుకలోగల అమేసెయిల్, శంకరనారాయణ పోలీసు స్టేషన్లలో మూడు కేసులు ఉన్నాయని, అవి 2007-2008 నాటివని చెప్పారు. లక్ష్మి వాస్తవానికి కుందాపూర్ తాలుకలోగల మంచుటెట్టు గ్రామంలోని తోంబట్టుకు చెందిన వారన్నారు. 15ఏళ్ల కిందట కుటుంబంతో అన్ని సంబంధాలు తెంచుకున్న లక్ష్మి అజ్ఞాతలోకి వెళ్లినట్లు చెప్పారు. చిక్కమంగళూరు, ఉడిపి జిల్లాల్లో ఆమె క్రియాశీలంగా ఉన్నారన్నారు. లక్ష్మి 'ఏ' కేటాగిరి కిందకు వస్తారని, ఆమెకు లొంగుబాటు ప్యాకేజి కింద రూ.7లక్షలను కర్నాటక ప్రభుత్వం ఇస్తుందని డీసీ విద్యా కుమారి చెప్పారు. కర్నాటక రాష్ట్రానికి చెందిన నక్సల్స్‌ను ఎ కేటగిరిగా పరిగణిస్తారన్నారు. లక్ష్మి విలేకరులతో మాట్లాడుతూ లొంగిపోయే అవకాశం కల్పించినందుకు, తనకు ప్రోటోకాల్ ప్రకారం ప్యాకేజి ప్రకటించినందుకు కర్నాటక ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.